అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 28-12-2023
సంపుటి : 9 | సంచిక : 307 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



ఉపరాష్ట్రపతి జగదీప్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

# గడీల పాలనను గ్రామాలకు తెచ్చాం

## పకడ్బందీగా ఆరు గ్యారంటీల అమలు

- నేటి నుంచి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అన్ని గ్రామాలు, పట్టణాల్లో సభలు
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- టీఎస్‌పీఎస్సీకి త్వరలో చైర్మెన్ నియామకం
- డిసెంబర్ 2024 వరకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ
- మేడిగడ్డపై న్యాయ విచారణ
- కేటీఆర్ దోచుకున్న లక్ష కోట్లు కక్కిస్తాం : అభయ హస్తం లోగో, పోస్టర్, ధరఖాస్తు ఫారం ఆవిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

"మాది ప్రజా ప్రభుత్వం..ప్రజల చేత ప్రజల కోసం ఎన్నుకోబడ్డ ప్రభుత్వం.. గడీల నుంచి పాలనను గ్రామాలకు తెచ్చాం..ఎన్నికల ముందు తెలంగాణ సమాజానికి ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టాం..డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు గ్రామాలు, పట్టణాల్లో సభలు నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తాం... ప్రజలకు మంచి పాలన అందించడమే మా లక్ష్యం" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీల లోగో, పోస్టర్, దరఖాస్తు ఫారాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖతో కలిసి సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందని తెలిపారు. ఈ నెల 8న రెండు గ్యారంటీల అమలును చేపట్టగా, మిగతా గ్యారంటీల ప్రక్రియకు బుధవారం నుంచి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. వివరాలు 3లో

## మన పద్దులో వాస్తవికత ఉండాలి

- ఉన్నది ఉన్నట్టుగా ప్రజల ముందుంచుదాం..
- అదే అసలైన బడ్జెట్
- కేంద్ర నిధులను నూటికి నూరు పాళ్లు వాడుకోవాలి
- ప్రజలకు జవాబుదారీగా వార్షిక బడ్జెట్ : సీఎం రేవంత్

వివరాలు 3లో

## ప్రజాపాలనకు నోడల్ అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల వారిగా నోడల్ అధికారులను నియమించింది. ఈ మేరకు ...11లో



## భారత్ న్యాయ యాత్ర

14 రాష్ట్రాలు, 85 జిల్లాలు, 6,200 కిలో మీటర్లు

- మణిపూర్ టూ ముంబయి
- జనవరి 14 నుంచి మార్చి 20 వరకు రాహుల్ పాదయాత్ర

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి యాత్ర చేపట్టనున్నారు. ఈసారి 'భారత్ న్యాయ యాత్ర' పేరిట ఈశాన్య రాష్ట్రం మణిపూర్ నుంచి ప్రారంభించి పశ్చిమ తీరం వరకూ యాత్ర సాగనుంది. జనవరి 14న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించనున్నారు. మార్చి 20న ముంబయిలో ముగియనుంది. 14 రాష్ట్రాల్లో 85 జిల్లాల మీదుగా 6,200 కిలో మీటర్లు సాగనున్న ఈ యాత్రను రాహుల్ గాంధీ వినూత్న తరహాలో నిర్వహించనున్నారు. బస్ ద్వారా, అక్కడక్కడా కాలినడకన రాహుల్ భారత్ న్యాయ యాత్ర సాగనుంది. ఇది రాజకీయ యాత్ర కాదని, రాజకీయ ప్రయోజనాలు ఆశించడం లేదని ఏఐసీసీ అర్గనైజేషన్ ఇన్‌చార్జ్ జనరల్ ...3లో

## రెజ్లర్లతో రాహుల్

- బజరంగ్ పూనియాతో సహా పలువురితో సంభాషణ
- హర్యానాలో కాంగ్రెస్ అగ్రనేత పర్యటన

వివరాలు 2లో


# డీప్‌ఫేక్ పాలిట్రిక్స్

## 'ఏఐ'తో టెక్నాలజీ మాయాజాలం

- లేనిది ఉన్నట్టుగా వీడియోలు, ఆడియోలు తయారు
- ప్రత్యర్థులపై అడ్డదారుల్లో దుష్ప్రచారాలు
- ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే ఎత్తుగడలు
- ఇందుకోసం ఎంత ఖర్చుకైనా వెనకాడని నేతలు
- డిజిటల్, టెక్ సంస్థలకు రూ. లక్షల్లో చెల్లింపులు
- 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారాలపై ఆంగ్ల వార్త సంస్థ దర్యాప్తులో బహిర్గతం



**ప్రముఖ సాంకేతిక నిపుణులు, దిగ్గజ టెక్ సంస్థల అధినేతలు చెప్పినట్టుగానే కృత్రిమ మేథ (ఏఐ) ప్రమాదకరంగా మారుతున్నది. 'డీప్‌ఫేక్'తో నకిలీ వీడియోలు, ఆడియోలు తయారు చేస్తున్న తీరు ఈ మధ్యకాలంలో అధికమైంది. అది క్రమంగా రాజకీయ రంగానికీ పాకింది. భారత్‌లో 2024 లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు ముందు డీప్‌ఫేక్ టెక్నాలజీని కృత్రిమంగా ఉపయోగించటం ద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయటానికి డిజిటల్ మానిప్యులేటర్లు రహస్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఒక జాతీయ ఆంగ్ల వార్త సంస్థ దర్యాప్తులో ఇది బహిర్గతమైంది.**



న్యూఢిల్లీ : ప్రపంచంలో సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్నది. పరిశోధకులు, టెక్ సంస్థల అనేక నూతన ఆవిష్కరణలు మనిషికి ఎంతగానో ఉపయోగపడుతు న్నాయి. అయితే, సదరు టెక్నాలజీ మనిషి పురోగతికి ఉపయోగపడాలి. కానీ, టెక్నాలజీని చెడు దారిలో ఉపయో గిస్తుండటంతో దాని ప్రతికూల ప్రభావం తిరిగి సమాజం పైనే పడుతున్నది. ఏఐతో రూపొందిస్తున్న డీప్‌ఫేక్ కంటెంట్ దీనికి ఉదాహరణ అని టెక్ నిపుణులు తెలుపుతున్నారు. భారత్‌లో వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు డీప్‌ఫేక్ వినియోగం అధికమైందని చెప్తున్నారు.

ఆంగ్ల వార్త సంస్థ దర్యాప్తు ప్రకారం.. నోయిడాలోని ది డిజిటల్ పబ్లిసిటీ వ్యవస్థాపకుడు రోహిత్ పాల్‌తో విచారణ ప్రారంభమైంది. ఆయన 2024 ఎన్నికలకు బరిలో ఉండగలికే అభ్యర్థులను గుర్తించటం, వారి ప్రచారాలను వ్యూహాత్మకంగా ప్లాన్ చేయడం వంటి తన కార్యకలాపాలను వివరించాడు. ప్రత్యర్థులను కించపరిచేలా డీప్‌ఫేక్ వీడియోలను రూపొందించటంపై పాల్ ప్రాథమిక దృష్టి ఉన్నది. "మేము ఆన్‌లైన్ చిత్రాలను మెరుగుపర్చి వాటిని సానుకూల చిత్రాలుగా రూపొందిస్తాం. యానిమేటెడ్ వీడియోలను తయారు చేస్తాం. ఇతర పార్టీల అభ్యర్థుల తప్పులను ప్రదర్శిస్తాం. వారిని మూర్ఖులుగా చూపుతాం" అని ఆయన అన్నారు. ఈ ఏఐ రూపొందించిన వీడియోల గుర్తింపు గురించి అడిగినప్పుడు.. "వ్యక్తులు కంటెంట్‌ను నకిలీ అని గుర్తించడం సవాలుతో కూడుకున్నది. సగటు వ్యక్తి దానిని గుర్తించలేరు. ఇది పూర్తిగా ప్రామాణికమైనదిగా కనిపిస్తుంది" అని తెలిపారు. డీప్‌ఫేక్ మెటీరియల్‌ని రూపొందించడానికి ఎంత సమయం ...3లో



## బీఆర్ఎస్ తాత్సారం చేయలే.. కేంద్రానిదే వివక్ష

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

విభజన హామీల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదనీ, కేంద్ర ప్రభుత్వమే తెలంగాణపై వివక్ష చూపిందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోడీని కేసీఆర్ ...11లో

# కరెంట్ బిల్లులు కట్టొద్దు

## కాంగ్రెస్ హామీలను సద్వినియోగం చేసుకోవాలి

- నిరుద్యోగభృతి ఊసేదీ..? : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**నవతెలంగాణ-సిరికొండ**

కాంగ్రెస్ పార్టీ 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇస్తామని హామీనిచ్చిన నేపథ్యంలో వచ్చే జనవరి నెల నుంచి ప్రజలెవరూ కరెంట్ బిల్లు చెల్లించొద్దని, హామీలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ది లివింగ్ క్రైస్ట్ చర్చ్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా చూసిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీకి రెండు శాతం ఓట్లు మాత్రమే తేడా ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో రూ.2వేలు పెన్షన్ తీసుకున్న 44 లక్షల మందికి ఎలాంటి అప్లికేషన్ తీసుకోకుండా, వచ్చే జనవరి నుంచి రూ.4వేలు ఇవ్వాలని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రభుత్వం కొత్తగా అప్లికేషన్ తీసుకోవడంతో ఎంతో మందికి ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఆరు గ్యారంటీల అప్లికేషన్‌లో నిరుద్యోగ భృతి కాలమ్ ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుబంధు అర్హులైన రైతులకు వారి ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని కోరారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఊసే లేదని, వారికి వెంటనే రూ.4000 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు మాన్‌సింగ్, సుమనారెడ్డి, ఎంపీపీ సంగీత రాజేందర్, మాజీ జెడ్పీటీసీ అయిత సుజ ఫిలిప్, మాజీ ఎంపీపీ మంజుల, మండల అధ్యక్షులు శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# ఇక భారత్ బియ్యం

## కిలో పాతిక రూపాయలకు విక్రయం

- బియ్యం ధరలు నియంత్రించలేక ఎన్నికల వేళ మోడీ ప్రభుత్వం జిమ్మిక్కులు
- మూన్నాళ్ల ముచ్చటేనంటున్న పరిశీలకులు



**ఆలులేదు..చూలు లేదు..కొడుకు పేరు సోమలింగం అన్నతీరులో వ్యవహరిస్తోంది కేంద్రంలోని బీజేపీ . భారత్ ఆటా, పప్పులను తక్కువ ధరకే ప్రజలకు విక్రయిస్తున్నామంటూ కొంతకాలంగా ప్రచారం చేసుకుంటోంది. కానీ.... వాస్తవానికి మార్కెట్‌లో భూతద్దం పెట్టి వెతికినా..అవి ఎక్కడా కనిపించవు. పోనీ ఎక్కడ అమ్ముతారు...? రాష్ట్రాలకు ఎంతమేర సరకులను పంపిందో కూడా తెలియదు. ఇదిలా ఉండగానే తాజాగా భారత్ బియ్యం అంటూ బీజేపీ ప్రభుత్వం మరో కొత్త ఎత్తుగడను తెరపైకి తెచ్చింది. కిలో రూ. 60 పెడితే కానీ బియ్యం దొరకని కాలంలో... భారత్ బియ్యాన్ని కిలో..రూ.25 కే విక్రయిస్తామంటోంది. ఇది ఎన్నికల వేళ భారత్ సెంటిమెంట్‌తో సార్వత్రికంలో ఓట్లు రాల్చుకోవడానికి మోడీ ప్రభుత్వం వేస్తున్న సరికొత్త పాచిక అని విశ్లేషకులు అంటున్నారు**

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మరో ప్రచారాస్త్రాన్ని సంధించింది. ఇప్పటికే గోధుమ పిండిని భారత్ అట్టా, పప్పులను భారత్ దాల్ పేరుతో విక్రయిస్తున్న ప్రభుత్వం తాజాగా తగ్గింపు ధరతో భారత్ బియ్యాన్ని అమ్మేందుకు సన్నాహాలు చేస్తోంది. భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్), భారత జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్), కేంద్రీయ భాండార్ ఔట్‌లెట్లు, మొబైల్ వాహనాల ద్వారా కిలో బియ్యాన్ని ఇరవై ఐదు రూపాయలకు విక్రయిస్తారని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలిపారు.

ఇప్పటికే దేశంలో 50-60 రూపాయలు పెట్టందే కిలో బియ్యం రావడం లేదు. బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయే తప్ప తగ్గుతున్నది లేదు. దేశంలోని పలు రాష్ట్రాలలో ధాన్యం దిగుబడులు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ బియ్యం ధరలు మాత్రం దిగిరావడం లేదు. పోనీ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న బియ్యాన్ని వండుకుందామని అనుకుంటే అది నాసిరకంగా ఉంటోంది. ఒక్కోసారి తినడానికి కూడా పనికిరావడం లేదని పేదలు వాపోతున్నారు. మరోవైపు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాసిరకం బియ్యం తప్పించి మరేదీ సరఫరా కావడం లేదు. గతంలో బియ్యంతో పాటు పప్పులు, చక్కెర, నూనె వంటి నిత్యావసరాలు కూడా సరఫరా చేసే వారు. అయితే కాలక్రమేణా బియ్యం మినహా ...11లో

## ఐఎన్‌టియూసీ ఆధిక్యత

- ఉత్కంఠగా సింగరేణి గుర్తింపు పోరు ఫలితం !
- అర్థరాత్రి వరకు అందిన సమాచారం మేరకు...
- తెల్లవారుజాము వరకు కొనసాగిన కౌంటింగ్
- నేడు అధికారికంగా వెల్లడి
- పోలింగ్ ప్రశాంతం.. పోటెత్తిన కార్మికులు

వివరాలు 11లో

## ఎంఫిల్‌లో చేరొద్దు

- ఆ డిగ్రీలకు గుర్తింపులేదు: యూజీసీ



న్యూఢిల్లీ : ఎంఫిల్ డిగ్రీకి గుర్తింపులేదని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) బుధవారం పేర్కొంది. విద్యార్థులు ఈ డిగ్రీలో అడ్మిషన్‌లు తీసుకోవద్దని సూచించింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఫిల్ అడ్మిషన్‌లు నిలిపివేయాలని అన్ని యూనివర్సిటీలను యూజీసీ సెక్రెటరీ మనీష్ జోషి ఆదేశించారు. ఎంఫిల్ అడ్మిషన్ కోసం పలు యూనివర్సిటీలు దరఖాస్తులు ...11లో

## కాంగ్రెస్‌లోకి షర్మిల..

### ఎన్నికలపై ఏపీ నేతలతో అధిష్టానం చర్చలు



**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్‌లో చేరేందుకు మార్గం సుగుమం అయినట్లు తెలుస్తోంది. అందుకు కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏపి కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, కేసి వేణుగోపాల్, ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్, పీసీసీ అధ్యక్షుడు గిడిగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరా రెడ్డి, మాజీ మంత్రి పళ్ళం రాజు, నేతలు చింతా మోహన్, కొప్పుల రాజు, హర్ష కుమార్, తులసి రెడ్డి, సుంకర పద్మ శ్రీ, మస్తాన్ వలి, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన సమావేశంలో ఏపీ అసెంబ్లీ, ...11లో


# ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ పరీక్షలు!

## మార్చి 18 వరకు నిర్వహణ

- అదేనెల 14 నుంచి టెన్త్ పరీక్షలు? : విద్యాశాఖ ప్రతిపాదన
- నేడో, రేపో షెడ్యూల్ విడుదల

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వార్షిక పరీక్షలు-2024, ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు మార్చి 18 వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇంటర్ బోర్డు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది. ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా, పరీక్షల నియంత్రణాధికారి జయప్రదబాయి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గురు లేదా శుక్రవారం విద్యాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించే అవకాశమున్నది. అందులోనే ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్‌పై తుది నిర్ణయం తీసుకుని ప్రకటిస్తారని తెలుస్తున్నది. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 16 వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, ఫిబ్రవరి 29 నుంచి మార్చి 18 వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలను నిర్వహించాలని అధికారులు షెడ్యూల్‌ను రూపొందించారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 13 వరకు ఇంటర్ ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు జరుగుతాయని ...11లో



## గ్రూప్-2 మరోసారి వాయిదా

- త్వరలో రాతపరీక్షల తేదీల ప్రకటన : టీఎస్‌పీఎస్సీ వెల్లడి

వివరాలు 11లో

## ఫిబ్రవరి రెండోవారంలో ఎంసెట్ నోటిఫికేషన్!

- ప్రవేశ పరీక్షలపై విద్యాశాఖ కసరత్తు : ఉన్నత విద్యామండలి అధికారులతో సమావేశం

వివరాలు 11లో

# కాలపరిమితి నిర్ణయించండి

## గిరిజన గ్రామాల అభివృద్ధిపై పార్లమెంటరీ కమిటీ సూచన

**న్యూఢిల్లీ** : నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి ఆది ఆదర్శ్ గ్రామ యోజన (పీఎంఏఏజీవై) పథకం అమలు కోసం కాలపరిమితిని నిర్ణయించాలని, సమస్యలకు పరిష్కారాలు సాధించాలని పార్లమెంటరీ కమిటీ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సూచించింది. ఈ ప్రాజెక్ట్ కింద గత రెండు సంవత్సరాల కాలంలో గుర్తించిన 36,428 గ్రామాలలో కేవలం 24% గ్రామాలకు మాత్రమే అభివృద్ధి ప్రణాళికలు ఆమోదం పొందాయని తెలిపింది. దేశంలోని 36 వేలకు పైగా గిరిజన గ్రామాలలో అవసరమైన ప్రాథమిక వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. గత సంవత్సరం ఈ పథకం పేరును మోడీ ప్రభుత్వం 'గిరిజన ఉప పథకానికి ప్రత్యేక కేంద్ర సాయం'గా మార్చింది.

సామాజిక న్యాయం, సాధికారతపై ఏర్పాటు చేసిన కమిటీ తన నివేదికను పార్లమెంటుకు సమర్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లను ఈ కమిటీ మదింపు చేసింది. పథకం అమలు నత్తనడక నడుస్తుండడంపై మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కమిటీ అంగీకరించలేదు. సమస్యల పరిష్కారానికి మంత్రిత్వ శాఖ అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని కమిటీకి నేతృత్వం వహించిన బీజేపీ ఎంపీ రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. ఆచరణ సాధ్యమైన పరిష్కారాలు కనుగొని, వాటి అమలుకు కాలపరిమితి నిర్ణయించాలని సూచించారు.

ఈ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులు అందజేస్తుంది. అభివృద్ధి పనుల నిమిత్తం ప్రతి గ్రామానికి రూ.20.38 లక్షలు అందజేస్తారు. దశలవారీగా గ్రామాలను గుర్తించి, అభివృద్ధి పనులు చేపడతారు. మొత్తం గ్రామాలలో ప్రతి సంవత్సరం ఐదో వంతు గ్రామాలను



ఎంపిక చేస్తారు. ఈ పథకం కింద మొత్తం 36,428 గ్రామాలను గుర్తించగా తొలి రెండు సంవత్సరాలలో 16,554 గ్రామాలను (52%) ఎంపిక చేశారు. ఈ సంవత్సరం ప్రారంభం నాటికి 8,707 గ్రామాలకు గ్రామాభివృద్ధి ప్రణాళికలను ఆమోదించారు. రెండు సంవత్సరాల కాలంలో సమీకృత అభివృద్ధి ప్రణాళిక కింద గుర్తించిన గ్రామాలలో 24% గ్రామాలకు మాత్రమే అనుమతి ఇచ్చారని కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది.

### నవతెలంగాణపై స్పందన
### ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

**అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.**



### హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్లు | 63,820 | ▲ | 110 |
| 22 క్యారెట్లు | 58,500 | ▲ | 100 |
| కిలో వెండి | 81,700 | ▼ | 300 |



### చికెన్ ధరలు
### హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

| | | |
|---|---|---|
| ఫారం రేటు | రూ. | 85 |
| రిటైల్ (లైవ్) | రూ. | 107 |
| స్కిన్‌తో | రూ. | 155 |
| స్కిన్‌లెస్ | రూ. | 177 |

**బిజినెస్**

## ఎల్ఐసీకి బంఫర్ లాభాలు

- ఈక్విటీల్లో రూ.2.3 లక్షల కోట్ల రాబడి
- 2023లో అనేక స్టాక్స్‌లో రెండంకెల రిటర్న్స్

**ముంబయి** : ప్రభుత్వ రంగ దిగ్గజ బీమా సంస్థ ఎల్ఐసీ అదిరిపోయే లాభాలను సాధించింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ల పోర్టుపోలియోలో పెట్టిన పెట్టుబడులపై 2023లో ఏకంగా రూ.2.8 లక్షల కోట్లు ఆర్జించింది. ఇటీవల దలాల్ స్ట్రీట్ దూసుకుపోతున్న నేపథ్యంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) లాభాలు కూడా అమాంతం పెరిగాయి. గతేడాది డిసెంబర్ ముగింపు నాటికి ఎల్ఐసీ మార్కెట్ హోల్డింగ్ పెట్టుబడులు రూ.9.61 లక్షల కోట్లుగా ఉండగా.. అవి ప్రస్తుతం రూ.11.89 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఏస్ ఈక్విటీ గణంకాలు వెల్లడించాయి. 260 లిస్టెడ్ కంపెనీల్లో ఎల్ఐసి పెట్టుబడులను కలిగి ఉంది. ఎల్ఐసి వాటా, స్టాక్‌ల ప్రస్తుత మార్కెట్ ధర ఆధారంగా మార్కెట్ విలువ లెక్కించబడిందని ఏస్ ఈక్విటీ పేర్కొంది.

ఏడాదికేడాదితో పోల్చితే ఈ ఏడాదిలో నిఫ్టీ-50 ఏకంగా 19 శాతం రిటర్న్‌లు ఇచ్చింది. మార్చిలో దాదాపు 52 వారాల కనిష్టానికి పడిపోయినప్పటికీ.. ఆ తర్వాత 28 శాతం ర్యాలీ చేసి బుధవారం 21,655 పాయింట్లకు చేరింది. 2023లో ఇప్పటి వరకు ఎల్ఐసి నిఫ్టీ 50 స్టాక్స్‌లో 40 సూచీలు కూడా 86 శాతం వరకు రెండంకెల లాభాలతో రిటర్న్స్‌ను ఇచ్చాయి. కోల్ ఇండియా, లర్సన్ అండ్ టర్బో, బజాజ్ ఆటో, టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ స్టాక్స్ అధిక లాభాలను అందించిన వాటిలో ఉన్నాయి.

**ఎన్‌టీపీసీ..**

దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టీపీసీలో ఎల్ఐసీ పెట్టుబడులను రూ.2,400 కోట్లు పెంచింది. ఈ సూచీ 86 శాతం లాభపడింది. ప్రభుత్వ రంగ సూచీల్లో భారీ ర్యాలీ చేసి.. డిసెంబర్‌లో ఆల్‌టైం గరిష్ఠ స్థాయికి చేరింది. బొగ్గు ఉత్పత్తి దిగ్గజ సంస్థ కోల్ ఇండియా సూచీ 63 శాతం పెరిగింది. ఇందులో ఎల్ఐసి పెట్టుబడుల విలువ ఒక సంవత్సరంలోనే 58 శాతం పెరిగి రూ.24,087 కోట్లకు చేరుకుంది.

**ఎల్అండ్‌టీ మద్దతు**

ఎల్ఐసి ఖజానా నింపిన స్టాక్స్‌లో లర్సన్ అండ్ టర్బో (ఎల్అండ్‌టీ) మూడో స్థానంలో ఉంది. ఈ దిగ్గజ మౌలిక వసతుల కంపెనీ షేర్ 2023లో 67 శాతం పెరిగింది. ఇందులో ఎల్ఐసి హోల్డింగ్ విలువ 46 శాతం పెరిగి రూ.52,786 కోట్లకు చేరింది. ఎల్ఐసి అధిక లాభాలందించిన స్టాక్స్‌లో టాటా మోటార్స్ కూడా ఉంది. 2023లో ఈ సూచీ 85 శాతం లాభపడింది. ఈ స్టాక్‌లో ఎల్ఐసీ రూ.13,519 కోట్ల పోర్టుపోలియో పెట్టుబడులు కలిగి ఉంది.

**మరో 21 స్టాక్స్‌ల్లో..**

ఎల్ఐసీ పెట్టుబడులు కలిగిన మరో 21 స్టాక్స్ 2023లో 328 శాతం రాబడులను ఇచ్చాయి. బీఎస్ఈలో పలు స్టాక్స్ మూడు రెట్లు పెరిగాయి. ఆ సూచీల్లోని ఎల్ఐసి పెట్టుబడులకు భారీగా రిటర్న్స్ వచ్చాయి. స్మాల్ క్యాప్ సెగ్మెంట్‌లో సుజ్లాన్ ఎనర్జీ 250 శాతం పెరిగింది. ఇందులోనూ ఎల్ఐసీ పెట్టుబడులు మూడు రెట్లు పెరిగి రూ.519 కోట్లకు చేరాయి. రైల్ వికాస్ నిగమ్ సూచీ 160 శాతం పెరగ్గా.. ఇందులో ఎల్ఐసి హోల్డింగ్స్ 2 రెట్లు పెరిగి రూ.2,076 కోట్లకు చేరాయి. 2024లోనూ భారీ లాభాలు కొనసాగవచ్చని అనేక ఫండ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

## అపర్ణ 17 డిగ్రీస్ నార్త్ క్లబ్‌లో వేడుకగా క్రిస్మస్

**హైదరాబాద్** : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ తన 17 డిగ్రీస్ నార్త్ క్లబ్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించినట్లు తెలిపింది. లైవ్ కన్సర్ట్‌తో ఒక కొత్త వేదికను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ వేడుకల్లో 17 డిగ్రీస్ నార్త్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఆపరేషన్స్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ క్లబ్ కేవలం మరో రొటీన్ క్లబ్ కాదని.. కొత్త జీవన విధానానికి నాంది అన్నారు. అత్యంత ప్రముఖ వ్యక్తులతో జాగ్రత్తగా ఏర్పాటుచేసిన కమ్యూనిటీ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఇప్పటికే పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్టు వివరించారు.

## పియాజియో వాహన ధరలు పెంపు

**పూణె** : కొత్త ఏడాది నుంచి తన ఆపే ఐస్-3 వీలర్ల ధరలను పెంచుతున్నట్లు పియాజియో తెలిపింది. జనవరి 1 నుంచి తన డీజిల్, సీఎన్‌జీ, ఎల్‌పీజీ, పెట్రోల్ వేరియంట్‌లలోని కార్గో, ప్యాసింజర్ వాహన ధరలను సవరిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుత ఎక్స్‌షోరూం ధరల్లో రూ.6,000 వరకు పెంపు ఉంటుందని వెల్లడించింది.

## టెక్నో స్మార్ట్‌ఫోన్‌ల బ్రాండ్ అంబాసిడర్‌గా దీపికా



**న్యూఢిల్లీ** : ప్రీమియం గ్లోబల్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన టెక్నో కొత్తగా సూపర్ స్టార్ దీపికా పదుకొణెని తన బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. తమ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నవీన ఆవిష్కరణలను తీసుకురావాలనే నిబద్ధతో పాటు తమ బ్రాండ్ బలోపేతానికి ఇది దోహదం చేయనుందని టెక్నో మొబైల్స్ సీఈఓ అరిజీత్ తలపాత్ర పేర్కొన్నారు. టెక్నోతో భాగస్వామ్యం సంతోషంగా ఉందని దీపిక పేర్కొంది.

## ఒకే వేదికపై 500పైగా రకాల స్వీట్స్

- కలనరీ అకాడమీలో ప్రదర్శన



**హైదరాబాద్** : ఒకే వేదికపై దాదాపు 500పైగా రకాల భారతీయ స్వీట్స్‌ను ప్రదర్శించారు. నగరంలోని బేగంపేటలోని కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియాలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా భారీ స్థాయిలో స్వీట్స్‌ను తయారు చేసి వీక్షకులను ఆశ్చర్యపోయేలా చేశారు. 350 మంది విద్యార్థులు, పాకశాస్త్ర నిపుణులు 72 గంటల పాటు శ్రమించి వీటిని తయారు చేశారని కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియా చెఫ్ అక్షయ్ కులకర్ణి తెలిపారు.

# చివరి ఇంటి వరకు పథకాలు చేరుస్తాం

- గత ప్రభుత్వం అనేక హామీలను ఎగ్గొట్టింది
- ప్రజా పాలనలో గ్రామాల చెంతనే అధికారులు

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి**

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని తప్పకుండా నెరవేరుస్తామని, ప్రతి చివరి ఇంటి వరకు ప్రభుత్వ పథకాలు చేరే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. రాష్ట్రంలో నూతన ప్రజా పాలన ప్రారంభమైందని ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసమే ఈ నెల 28 నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నామని చెప్పారు. బుధవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆమె కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం అనేక హామీలు గుప్పించి వాటిని ఎగ్గొట్టిందని విమర్శించారు. నిరుద్యోగభృతి, పోడు భూములకు హక్కుపత్రాలు, అసైన్డ్ భూములకు హక్కులు, రుణమాఫీతో పాటు కేంద్రం చెప్పిన 2కోట్ల ఉద్యోగాలు అమలు చేయలేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జోడెద్దుల్లా పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలు అని.. ప్రస్తుతం ప్రభుత్వానికి ప్రజలంతా ఒకటేనని స్పష్టంచేశారు. ప్రభుత్వం గురువారం నుంచి ప్రజాపాలన పేరిట ఆరు గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటుందని చెప్పారు. అధికారులే గ్రామాలకు వచ్చి ప్రజల నుంచి వీటిని స్వీకరిస్తారని, దరఖాస్తులు ముందుగానే పూరించి అధికారులకు అందజేస్తే బాగుంటుందని వివరించారు. ఎవరైనా తమ గ్రామానికి రాలేదని ఇబ్బందులు పడకూడదని, మండల కార్యాలయాల్లోనూ అందజేసేందుకు వీలుంటుందని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే సమస్యలు గుర్తించామని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆదివాసీల పోడు భూములకు హక్కుపత్రాలు అందిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

### విలేకరులు ఉద్యమకారులే..!

విలేకరులు కూడా ఉద్యమకారులేనని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క చెప్పారు. జర్నలిస్టులకు సంబంధించి 250 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం పరిశీలన చేస్తోందని వివరించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, గడ్డం వినోద్, ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీని ప్రకటించాలి

- శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కు డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం వినతి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంత్రులు డి శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని తెలిపారు. మిగిలిన 15 వేలు పోస్టులను కలిపి 20 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరామన్నారు. మెగా డీఎస్సీ ప్రతిపాదన ప్రభుత్వం దృష్టిలో ఉందనీ, కొంత సమయం తీసుకుని నోటిఫికేషన్‌ను జారీ చేస్తామంటూ మంత్రులు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం సభ్యులు హరీశ్, ఆదిత్య శ్రీనివాస్, శ్రీనునాయక్, స్వప్న, కవిత తదితరులు పాల్గొన్నారు.

**విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి వినతి**

15 వేల ఉపాధ్యాయ పోస్టులను కలిపి డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరుతూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనను బుధవారం తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాతపరీక్షల తేదీలను ప్రకటించాలనీ, ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులతో ముడిపెట్టకుండా మెగా డీఎస్సీని ప్రకటించాలని సూచించారు. డీఎస్సీపై ప్రభుత్వంలో చర్చలు జరుగుతున్నాయనీ, ముఖ్యమంత్రితో సమీక్ష తర్వాత నిర్ణయం తీసుకుంటామని బుర్రా వెంకటేశం హామీ ఇచ్చారని తెలిపారు.

## ఫీజు బకాయిలు చెల్లించండి

- ఉప ముఖ్యమంత్రికి టీపీజేఎంఏ వినతి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సంఘం (టీపీజేఎంఏ) అధ్యక్షులు గౌరి సతీశ్ నేతృత్వంలో కలిశారు. రాష్ట్రంలో ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమీక్ష నిర్వహించి బకాయిలను విడుదల చేసేందుకు ప్రయత్నిస్తామంటూ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీజేఎంఏ హైదరాబాద్ నాయకులు అహ్మద్, పహిల్వాన్, అక్రం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశ్‌ను గౌరి సతీశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటర్మీడియెట్ విద్యావ్యవస్థ, ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సమస్యలపై చర్చించామని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

## ముఠా నాయకుడిలా రేవంత్‌రెడ్డి మాటలు

ఆరు గ్యారంటీలపై చిత్తశుద్ధి ఏదీ? : దాసోజు శ్రవణ్‌కుమార్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రేవంత్‌రెడ్డి సీఎంలాగా కాకుండా ఓ ముఠా నాయకుడిలా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ ఆరోపించారు. గత ప్రభుత్వం ఏడుపు ఆపి ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా పాలన పేరిట కొత్తగా దరఖాస్తుల స్వీకరణ టైంపాస్ కోసమేనని విమర్శించారు. తెల్లరేషన్ కార్డులున్నవారికే సంక్షేమ పథకాలు అని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు.ఖజానాలో లంకె బింద ఉండదదనీ, తెలంగాణ మొత్తం లంకె బిందనే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రాలు పెట్టి అబాసుపాలైందని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు చేసేముందు తాము అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ ఎన్ని లక్షల కోట్ల రూపాయలు వెనక్కి వేసుకున్నారని నిలదీశారు.

# రెజ్లర్లతో రాహుల్

**న్యూఢిల్లీ** : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం ఉదయం హర్యానాలోని ఝజ్జర్ జిల్లాలోని వీరేంద్ర ఆర్య అఖారాలో పర్యటించారు. అక్కడ బజరంగ్ పునియాతో సహా మల్లయోధులతో సంభాషించారు. రెజ్లింగ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఎఫ్ఐ)పై తాజా వివాదం మధ్య ఆయన పర్యటించటం గమనార్హం.. డబ్ల్యూఎఫ్ఐ కొత్త అధ్యక్షుడు సంజయ్ సింగ్ ఈ ఏడాది చివరి నాటికి అండర్-15, అండర్-20 నేషనల్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నట్టు ప్రకటించిన తర్వాత క్రీడా మంత్రిత్వ శాఖ డబ్ల్యూఎఫ్ఐని సస్పెండ్ చేసింది. డబ్ల్యూఎఫ్ఐ మాజీ ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రెజ్లర్లు సంజయ్ సింగ్ బ్రిజ్ భూషణ్‌కు చాలా సన్నిహితుడు కాబట్టి సంజయ్ సింగ్ ఎన్నికపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీనికి నిరసనగా సాక్షి మాలిక్ రెజ్లింగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. బజరంగ్ పునియా అతని పద్మశ్రీని వాపసు చేశారు. వినేష్ ఫోగట్ సైతం ఆమె ఖేల్ రత్న, అర్జున అవార్డును తిరిగి ఇస్తున్నట్టు ప్రకటించారు. రాహుల్ గాంధీ తనతో వ్యాయామం చేశారనీ, కుస్తీ పట్టేందుకు ప్రయత్నించారని బజరంగ్ పునియా చెప్పారు. రాహుల్ గాంధీ తమతో యూట్యూబ్ ఛానెల్ కోసం అకారా వద్ద వీడియోను చిత్రీకరించారనీ, మల్లయోధుడి రోజువారీ జీవితం ఎలా ఉంటుందో చూడటానికి ఆయన వచ్చాడని తెలిపారు. రాహుల్ గాంధీ ఉదయం 6.15 గంటలకు అఖారాకు చేరుకున్నారని కోచ్ వీరేంద్ర ఆర్య చెప్పారు. రాహుల్ గాంధీ పర్యటన గురించి తమకు తెలియదన్నారు.

# ఐటీ ఉద్యోగులపై వేటు

## రెండేండ్లలో 4.25 లక్షల మందికి ఉద్వాసన

- తాజాగా రోడ్డునపడ్డ 36 వేల మంది భారతీయ టెకీలు

**న్యూఢిల్లీ** : ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పుణ్యమా అని ఐటీ కంపెనీలు వేలాది మంది ఉద్యోగులను ఇంటికి సాగనంపుతున్నాయి. గత రెండు సంవత్సరాల కాలంలో ఐటీ కంపెనీలు 4.25 లక్షల మందిని ఉద్యోగాల నుండి తొలగించాయని లేఆఫ్-ఫై అనే వెబ్‌సైట్ తెలిపింది. ఐటీ రంగంలో ఉద్యోగాల పరిస్థితిపై ఈ వెబ్‌సైట్ ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ ఉంటుంది. 2021, 2022 సంవత్సరాలలో తలెత్తిన కోవిడ్, అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం వంటి ప్రతికూల పరిస్థితులలో కూడా ఐటీ కంపెనీలు ఉద్యోగులను ఇంత పెద్ద సంఖ్యలో తొలగించలేదు. ముఖ్యంగా హాలిడే సీజన్‌లో ఉద్యోగాలు కోల్పోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

తాజాగా ఇంటెల్ కంపెనీ అమెరికాలోని తన హార్డ్‌వేర్ విభాగంలో 300 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. లాస్ ఏంజెల్స్‌లో ఎలన్ మస్క్ చేపట్టిన హైపర్‌లూప్ వన్ ప్రాజెక్ట్ అనుకున్న విధంగా ప్రారంభం కాలేదు. దీంతో ఈ కంపెనీ గత వారం తన కార్యకలపాలన్నింటినీ నిలిపివేసింది. ఫలితంగా అందులో పనిచేస్తున్న ఉద్యోగులందరూ రోడ్డున పడ్డారు. తాజాగా మన దేశంలో కూడా 36 వేల మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయారు. ఈ ఏడాది తొలి మూడు త్రైమాసికాలలో దేశంలో 28 వేల మంది ఐటీ నిపుణులను ఉద్యోగాల నుండి తొలగించారని లాంగ్‌హౌస్ కన్సల్టింగ్ సంస్థ తెలిపింది.

ఉద్యోగుల తొలగింపునకు అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులే కారణమని ఐటీ కంపెనీలు, స్టార్టప్ కంపెనీలు చెబుతున్నాయి. ఫిన్‌టెక్ కంపెనీలు, కన్స్యూమర్ టెక్ కంపెనీలు, రిటైల్ టెక్ కంపెనీలు ఈ ఏడాది ఎక్కువ మంది ఉద్యోగులను తొలగించాయి. ఖర్చును తగ్గించుకొని, వ్యాపారాలను తిరిగి గాడిలో పెట్టే పేరుతో 'పేటీఎం' ఇటీవలే వెయ్యి మంది ఉద్యోగులపై వేటు వేసింది. ఆర్‌బీఐ విధించిన ఆంక్షల కారణంగా కొన్ని కార్యకలాపాల నుండి పేటీఎం వైదొలిగింది. ఫలితంగా ఉద్యోగులపై వేటు పడింది. వ్యూహాత్మక పునర్నిర్మాణం పేరుతో సామాజిక మాధ్యమ వేదిక 'షేర్‌చాట్' 15% ఉద్యోగులకు వీడ్కోలు పలికింది. గేమ్ స్ట్రీమింగ్ వేదిక 'లోకో' కూడా 36% మందిని విధుల నుండి తొలగించింది. గూగుల్ మద్దతుతో పనిచేస్తున్న ఎడ్‌టెక్ వేదిక 'అడ్డా 247' 300 మందిపై వేటు వేసింది. కొన్ని నెలల క్రితం ఎడ్‌టెక్ కంపెనీ 'బైజూ' కూడా ఏకంగా ఐదు వేల మందిని ఉద్యోగాల నుండి తొలగించింది.

## పథకాలు అందరికీ చేరువయ్యేందుకే..

- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర
- గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్



**నవతెలంగాణ-ఓయూ**

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ చేరువచేసేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్టు గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. బుధవారం తెలంగాణలోని వివిధ జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభమైంది. ఈ మేరకు తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ హైదరాబాద్‌లోని లాలాపేట్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందించే వీడియో వ్యాన్‌ను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు కష్ట పడకుండా ఉండాలని పీఎం ఉజ్వల యోజన ద్వారా వంట గ్యాస్, ఆయుష్మాన్ భారత్ ద్వారా నిరుపేదలకు ఉచితంగా వైద్య సదుపాయం కల్పించారన్నారు. 2025 సంవత్సరంలోగా టీబీ ముక్త్ భారత్ కోసం ప్రధాని సంకల్పించారని తెలిపారు. ప్రభుత్వ పథకాల ఫలాలను ప్రజలకు చేరవేసేందుకు, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి తెలంగాణలో ఈ యాత్ర 2024 జనవరి 25 వరకు కొనసాగనుందన్నారు. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వ సమాచారంతో కూడిన ఐఈసీ మెటీరియల్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. లాలాపేట్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన వివిధ కేంద్ర ప్రభుత్వ స్టాళ్లను గవర్నర్ సందర్శించారు.

## నిజామాబాద్ నుంచి.. ప్రధాని పోటీచేస్తే ఆహ్వానిస్తా

- రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తుండదు : బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్

**నవతెలంగాణ-ఆర్మూర్**

నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పోటీ చేస్తే ఆహ్వానిస్తానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో రైల్వే పనులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై వచ్చిన ఆరోపణలు నిజమైతే తప్పకుండా జైలుకు పంపిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌ఓబీ పనులకోసం కేంద్ర ప్రభుత్వం డిపాజిట్ చేసిన రూ.15 కోట్ల నిధులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, నాయకులు జీవి నరసింహా రెడ్డి, పల్లె గంగారెడ్డి, ధ్యాగ ఉదయ్, కంచెట్టి గంగాధర్, పెర్కిట్ దుగ్గి విజయ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారం తహసీల్‌కు కరెంట్ కట్..

- దాదాపు రూ.9లక్షల బిల్లు పెండింగ్?
- రూ.3లక్షలు చెల్లించడంతో తిరిగి సప్లయి!
- యూపీఎస్‌లో సమస్య వల్ల అంతరాయం :తహసీల్దార్

**నవతెలంగాణ-జిన్నారం**



సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కరెంట్ కట్ చర్చనీయాంశమయింది. బుధవారం మధ్యాహ్నం వరకు కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పనులన్నీ స్తంభించాయి. అయితే తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి రూ.9లక్షలు బకాయి ఉండటంతో సరఫరా నిలిపివేసినట్టు తెలిసింది. అందులో సుమారు రూ.3లక్షలు చెల్లించడంతో కరెంట్‌ను పునరుద్ధరించినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై మండల విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజును వివరణ కోరగా.. పెండింగ్ బిల్లులు పెద్ద మొత్తంలో ఉన్నప్పుడు ప్రీపెయిడ్ కరెంటు మీటర్లు ఆటోమెటిగ్గా కట్ అవుతుంటాయన్నారు. తహసీల్దార్ కార్యాలయం రూ.9లక్షలు పెండింగ్ ఉండటం వాస్తవమే అన్నారు. కాగా, కరెంట్ కట్ విషయమై తహసీల్దార్ రవికుమార్‌ను వివరణ కోరగా.. బకాయితో కరెంట్ కట్ చేశారనేది సరికాదని, కార్యాలయంలోని యూపీఎస్‌లో సమస్య వల్లే సరఫరా నిలిచిపోయిందని, బాగు చేయగానే కరెంట్ వచ్చిందని తెలిపారు.



# గడీల పాలనను గ్రామాలకు తెచ్చాం

## మాది ప్రజా ప్రభుత్వం

- పకడ్బందీగా ఆరు గ్యారంటీల అమలు చేసి తీరుతాం
- అభయ హస్తం లోగో, పోస్టర్, ధరఖాస్తు ఫారం ఆవిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "నిస్సహాయులకు సహాయం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం... సుదూర ప్రాంతాల నుంచి ప్రజాభవన్‌కు వచ్చి ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు ఇస్తున్నారు.. గత పదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో లేదు... అందుకు ప్రజావాణీలో వచ్చిన 24 వేల ఫిర్యాదులే ఉదాహరణ.. గత సర్కార్ హాయంలో ప్రజలు తమ సమస్యలపై ప్రభుత్వం దగ్గరకు వస్తే గడీలు అడ్డుగోడలుగా ఉండేవి... కానీ ఇప్పుడు ప్రభుత్వమే ప్రజల వద్దకు నడిచి వెళ్తోంది...ప్రతి మండలాన్ని రెండు గ్రూపులుగా విభజించి ఒక గ్రూపునకు ఎంఆర్వో, మరో గ్రూపునకు ఎంపీడీవోను ఇన్‌చార్జిగా నియమించాం.. ప్రతీ అధికారి రోజుకు రెండు గ్రామాలను సందర్శించి గ్రామ సభల నిర్వహణను పర్యవేక్షిస్తారు.. జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాల్లో దరఖాస్తు స్వీకరణకు కౌంటర్లు పెంచుతున్నాం... గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనూ దరఖాస్తులు స్వీకరించే సదుపాయాన్ని కల్పిస్తున్నాం.. జనవరి ఆరు తర్వాత కూడా దరఖాస్తులు స్వీకరిస్తారు... గడువు తరువాత ఎంపీడీవో, ఎంఆర్వో కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నాం... ఎవరూ ఆందోళన చెందొద్దు.. రేషన్ కార్డులు లేని వారి దరఖాస్తును కూడా స్వీకరిస్తాం...కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ... గ్రామ సభల్లో అన్ని రకాల దరఖా స్తులను స్వీకరిస్తాం... జనవరి 7 లోపు లబ్దిదారుల వివరాలను సేకరిస్తాం" అని సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకంతో ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లకు త్వరలో ఆర్థిక సహాయం ప్రకటిస్తామని తెలిపారు. మేడిగడ్డ ప్రాజెక్ట్‌పై విచారణ కొనసాగుతోందని, దోషులెవరిని వదలబోమని హెచ్చరించారు. రైతు బంధుపై ఎలాంటి సీలింగ్ పెట్టే ఆలోచన ప్రస్తుతానికి లేదనీ, మంత్రి వర్గంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ డిసెంబర్ 20వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు విడతల వారీగా రైతు బంధు డబ్బులు జమ చేస్తూ వచ్చారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడు ఎందుకు గాయ్ గాయ్ చేస్తున్నారంటూ కేటీఆర్, హరీశ్‌లను ఉద్దేశించి చురకలు అంటించారు. అర్హులైన ప్రతి రైతుకు రైతు బంధు పథకం డబ్బులు జమ అవుతాయని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన రాష్ట్ర వాటా కోసం ప్రధానితో పాటు ఎవరినైనా కలవడానికి సిద్ధంగా ఉన్నామనీ, తమకు బేషజాలు లేవని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను దివాళా తీయించిందని, దాన్ని అధిగమించేందుకు దుబారాను తగ్గించడంతో పాటు ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తామని తెలిపారు. మీడియా కోసం సచివాలయంలో ప్రత్యేక గదిని కేటాయించనున్నట్టు తెలిపారు. ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ప్రకటించారు.

### కేసీఆర్ కుటుంబం ప్రజల రక్తాన్ని దోచుకుంది

కేసీఆర్ కుటుంబం ప్రజల రక్తం పిండి ఆస్తులు సంపాదించిందని సీఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు ఉపయోగపడే భవనాలను కూల్చి కమీషన్ల కోసం కొత్తవి కట్టారని దుయ్యబట్టారు. దాన్ని ఆస్తులు సష్టించడంగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. ప్రజావాణిలో న్యాయం జరగలేదంటూ ఓ మహిళకు మాజీ మంత్రి కేటీఆర్ రూ.లక్ష అందించారని ప్రచారం చేసుకుంటున్నారనీ, అయితే ఆ మహిళకు లక్ష రూపాయలు ఇప్పించడంలో ప్రజావాణి విజయవంతమైందని సీఎం అన్నారు. కేటీఆర్ దోచుకున్న లక్ష కోట్లల్లో లక్ష రూపాయలే పంచారనీ, మిగతా డబ్బులు కక్కిస్తామని అన్నారు. 22 కొత్త ల్యాండ్ క్రూజర్ వాహనాలు కొని విజయవాడలో దాచిపెట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వం చుట్టూ షాడో టీంలను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఓటమి జీర్ణించుకోలేక కేటీఆర్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఐటీఐఆర్, సైనిక్ స్కూల్ గురించి అడగని వినోద్ కుమార్ బుల్లెట్ ట్రైన్ గురించి మాకు నీతులు చెబుతున్నారని విమర్శించారు.

### త్వరలో జాబ్ క్యాలెండర్

ఎన్నికల ముందు తెలంగాణ యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, డిసెంబర్ 2024 కల్లా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం తెలిపారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులు ఇప్పటికే రాజీనామా చేశారనీ, వారి రాజీనామాలను గవర్నర్ ఆమోదించిన మరుక్షణమే కొత్త చైర్మన్, సభ్యులను నియమిస్తామని పేర్కొన్నారు. చైర్మెన్, సభ్యుల నియామకం తరువాత ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరుగుతుందన్నారు. నిరుద్యోగులు ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. గ్రూప్-2 నిర్వహణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## భారత్ న్యాయ యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

సెక్రటరీ కెసి వేణుగోపాల్, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ తెలిపారు. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం కోసం ఈ యాత్ర సాగుతుందని అన్నారు. డిసెంబర్ 21 న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవ తీర్మానం ప్రకారం రాహుల్ గాంధీ రెండో దశ యాత్ర జరుగుతుందని తెలిపారు. మణిపూర్ ప్రజల గాయాలను నయం చేసే ప్రక్రియలో భాగంగా ఈ యాత్ర ప్రారంభించాలని ఆయన అన్నారు.

మొదటి దశలో రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 12 రాష్ట్రాలను కవర్ చేస్తూ దాదాపు 4,500 కిలోమీటర్లు ప్రయాణించగా, ఈసారి 14 రాష్ట్రాలను కవర్ చేస్తూ 6,200 కిలోమీటర్లు ప్రయాణించనున్నారని తెలిపారు. యాత్ర మణిపూర్, నాగాలాండ్, అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలో సాగనుందన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఆర్థిక అసమానతలు, మతోన్మాదం, నియంతత్వం వంటి అంశాలను లేవనెత్తగా, న్యాయ యాత్ర దేశ ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయంపై దృష్టిసారిస్తుందని తెలిపారు.భారత్ జోడో యాత్రతో ఐక్యత, ప్రేమ, సామరస్య సందేశాన్ని వ్యాప్తి చేసిన రాహుల్ గాంధీ ఈ యాత్ర ద్వారా దేశ ప్రజలకు న్యాయం కోరుతారని అన్నారు. ఈ యాత్రలో ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) పార్టీలు కూడా పాల్గొంటాయా అనే ప్రశ్నకు వేణుగోపాల్ సమాధానమిస్తూ, తుది వివరాలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నేతలు కూడా ఆ యాత్రలో పాల్గొన్నారని గుర్తు చేశారు.

## స్వేద పత్రాలు కాదు.. సౌదాపత్రాలు రిలీజ్ చేయాలి

- ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం : రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్**

అప్పులపాలు చేసిన తెలంగాణపై స్వేదపత్రాలు కాదు.. కల్వకుంట్ల కుటుంబానికి.. ఆస్తులు ఎలా పెరిగాయో, ఫామ్‌హౌస్, ఇండ్ల విలువ వందల కోట్లు ఎలా వచ్చాయో సౌద పత్రాలు విడుదల చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 రోజులు కాలేదని, అంతలోనే బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని స్వేదపత్రంతో విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 రోజుల్లో రెండు హామీలను నెరవేర్చామని అన్నారు. ప్రజాపాలనలో సమస్యపై దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ రసీదు తీసుకోవాలని తెలిపారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత



ప్రయాణంతో పాటు ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచామన్నారు. నాలుగు కోట్ల మంది మహిళలు జీరో టికెట్‌తో ప్రయాణం చేశారన్నారు. మహిళలు ఊహించని విధంగా ఉచిత ప్రయాణంపై అనూహ్య స్పందన వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఉచిత ప్రయాణం అమలు చేశామన్నారు. కొన్ని రూట్లలో బస్సులు కావాలని నా దృష్టికి వచ్చిందని, త్వరలోనే కొత్త బస్సులు తీసుకొచ్చి అన్ని రూట్లలో బస్సులు వేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ పరిస్థితి చూస్తే రూ.7 లక్షల కోట్ల అప్పులతో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ఉద్యోగుల జీతాలు ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు తీసుకునే రోజులు వస్తున్నాయన్నారు. ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం కావాలంటే అధికారులు భాగస్వాములు కావాలన్నారు. స్వేచ్ఛ ఇస్తున్నామని.. మీకు ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, చిత్తారి పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డీప్‌ఫేక్ పాలిట్రిక్స్

(మొదటిపేజీ తరువాయి)

పడుతుందో కూడా పాల్ చెప్పారు. " మొత్తం పనిని ఏఐ నిర్వహిస్తుంది కాబట్టి ఇది ఎక్కువ సమయం తీసుకోదు. మేము కేవలం ఆదేశాలను జారీ చేస్తాం. సాధనాలు వాటికవే మిగిలిన పనిని నిర్వహిస్తాయి" అని అతను స్పష్టం చేశాడు.ప్రతి అభ్యర్థి నెలకు రూ. 5 లక్షలు చెల్లిస్తాడని పాల్ చెప్పాడు. అభ్యర్థి ప్రత్యర్థుల ప్రతిష్టను దెబ్బతీసేందుకు డీప్‌ఫేక్ టెక్నాలజీని ఉపయోగించి ఇంటిమేట్ వీడియోలను రూపొందిస్తామన్నాడు. "మేము మొదట వాటిని సోషల్ మీడియాలో ఉపయోగించుకుంటాం. వ్యూహాత్మకంగా డీప్‌ఫేక్‌లు, కాల్ రికార్డింగ్‌లను ఎప్పుడు విడుదల చేయాలనే దానిపై మేము అభ్యర్థుల నుంచి ఆదేశాలు అందుకుంటాం" అని పాల్ వివరించారు. ఈ అప్‌లోడ్‌ల మూలాల గురించి ఆందోళనలు తలెత్తితే.. మేము భారత్‌లో పని చేస్తున్నప్పుడు యూఎస్‌లో ఉన్నాము అనే అభిప్రాయాన్ని సృష్టించటానికి మా ఐపీ చిరునామాను మారుస్తామని తెలిపాడు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థి అభ్యర్థికి చెందిన వాయిస్ ఏదైనా సృష్టించగలమనీ, ఇది కచ్చితంగా సదరు అభ్యర్థి వాయిస్‌ను పోలి ఉంటుందని చెప్పాడు. ఇలాంటి టెక్నాలజీతో ఎన్నికల ప్రసంగాలను తారుమారు చేస్తున్నారని రోహిత్ వివరించాడు. ఇలాంటివి చాలా సులభమని చెప్పాడు.

పొలిటికల్ డీప్‌ఫేక్‌లకు డిమాండ్ ఎక్కువగా ఉన్నదన్నాడు. " విపక్షాలను మట్టికరిపించాలనే డిమాండ్ రాజకీయ పార్టీల్లో ఉన్నది. మీరు వేరొకరి వాయిస్‌ని ట్యాంపర్ చేస్తే, అది పట్టుకోవచ్చు. పూర్తిగా ఏఐతో రూపొందించిన వీడియోలను నకిలీవని గుర్తించటం అంత సులభం కాదు" అని ఆయన వివరించారు. ఈ డిజిటల్ మాయా విద్యకు సంబంధించి అనేక సంస్థలు పని చేస్తుండటం గమనార్హం.

# మన పద్దులో వాస్తవికత ఉండాలి

## అదే అసలైన బడ్జెట్

- కేంద్ర నిధులను నూటికి నూరు పాళ్లూ వాడుకోవాలి
- ప్రజలకు జవాబుదారీగా వార్షిక బడ్జెట్
- ఆర్థిక శాఖ సమీక్షా సమావేశంలో : సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సవాళ్లు, ప్రభుత్వం ముందున్న లక్ష్యాలకు సంబంధించి ఉన్నది ఉన్నట్టుగా ప్రజలకు చెప్పేద్దామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. అసలైన తెలంగాణ ఇప్పుడే వచ్చిందనుకుని బడ్జెట్ తయారు చేయాలంటూ ఆయన వారిని ఆదేశించారు. దుబారా చేయకుండా, వధా ఖర్చులు తగ్గించాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరపు వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆదాయ వ్యయాల వాస్తవికతను ప్రతిబింబించేలా రూపొందించాలని ఆయన సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్... ఆ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లను నూటికి నూరు పాళ్లూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. లేనిపోని గొప్పలు, ఆర్భాటాలకు పోకుండా వాస్తవిక బడ్జెట్‌ను రూపొందించాలని అన్నారు. వాస్తవంగా రాష్ట్ర ఆదాయమెంత..? ఉద్యోగుల జీతభత్యాలు, ప్రభుత్వం



ఇచ్చిన హామీలకు, చేయాల్సిన పనులకు ఎంత ఖర్చవుతుందనే అంశాలపై పక్కాగా అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. అప్పులు, చెల్లించాల్సిన బకాయిలు, నెలవారీ ఖర్చులన్నింటిపై అధికారులకు స్పష్టత ఉండాలని అన్నారు. ఎలాంటి దాపరికం లేకుండా ఆదాయ వ్యయాల ముఖచిత్రం ప్రజలకు అర్థమయ్యేలా ఉండేలా జాగ్రత్త పడాలని సీఎం సూచించారు. ఎవరో కొందరు వ్యక్తులను సంతృప్తిపరచాల్సిన అవసరం లేదనీ, అయితే తెలంగాణ ప్రజలను సంతృప్తి పరచాల్సిన బాధ్యత మాత్రం ప్రభుత్వంపైన్నే ఉందని నొక్కి చెప్పారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలని రేవంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన గురుతరమైన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. అందుకే ప్రజా కోణంలో బడ్జెట్ ఉండేలా ప్రత్యేక కసరత్తులు చేయాలని కోరారు. గతంలో మాదిరిగా అప్పులు దాచి, ఆదాయ వ్యయాలను భూతద్దంలో చూపించాల్సిన అవసరం లేనే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆదాయ స్థితిగతులపై ఉన్నది ఉన్నట్టుగా జనం ముందు ఉంచాలని సూచించారు. అడ్డగోలు ఖర్చులు, అనవసర వ్యయం, దుబారా లేకుండా చూడాలని కోరారు. తప్పనిసరైతే తప్ప ప్రభుత్వం తరపున ఇచ్చే ప్రకటనలు కూడా తగ్గించాలని కోరారు. కొత్త వాహనాలను కొనుగోలు చేయకుండా, ఇప్పుడు ఉన్న వాటినే వినియోగించుకోవాలని సీఎం ఆదేశించారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో గెలవకముందే 22 ల్యాండ్ క్రూయిజర్లను కొనుగోలు చేసిన విషయం ఈ సందర్భంగా చర్చకొచ్చింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనన్ని గ్రాంట్లను రాబట్టేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని రేవంత్ ఆదేశించారు. వివిధ శాఖలు, స్కీముల వారీగా కేంద్రం అందించే మ్యాచింగ్ గ్రాంట్లను నూటికి నూరు పాళ్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొంతమేరకు రాష్ట్రం తన వాటాను చెల్లిస్తే కేంద్రం తన వాటాగా ఇచ్చే నిధులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి పేరు వస్తుందనో లేదా రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దగా పేరు రాదనే విధంగా బేషజాలకు పోవద్దని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, ఇక్కడి ప్రజల సంక్షేమమే అంతిమ లక్ష్యంగా బడ్జెట్ కసరత్తులు చేపట్టాలంటూ సీఎం ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, కార్యదర్శి టీకే శ్రీదేవి, సంయుక్త కార్యదర్శి కె.హరిత, డిప్యూటీ సీఎం ఓఎస్డీ కష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.:

### ఓటాన్ అకౌంట్‌కు రంగం సిద్ధం...

సీఎం రేవంత్ ఆర్థిక శాఖపై సమీక్ష నిర్వహించిన నేపథ్యంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు రంగం సిద్ధమైనట్టేనని ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. బడ్జెట్ ఎలా ఉండాలి? ఏయే ప్రాతిపదికల ఆధారంగా దాన్ని రూపొందించాలనే అంశంపై ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చిన దరిమిలా వాటికి అనుగుణంగా పద్దును రూపొందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పార్లమెంటు ఎన్నిలకు మార్చిలో నోటిఫికేషన్ రాబోతుందనే వార్తల నేపథ్యంలో అంతకుముందే ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఆ క్రమంలోనే సీఎం బడ్జెట్ రూపకల్పనపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## నేడు నాగ్‌పూర్‌కు సీఎం రేవంత్

- 80వేల మంది ర్యాలీలో పాల్గొంటారు : మహేష్‌కుమార్‌గౌడ్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాగ్‌పూర్‌లో ఆ పార్టీ భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, ముఖ్యనేతలు బయలుదేరి వెళుతున్నారు. ఆ ర్యాలీని విజయవంతం చేసేందుకు రాష్ట్రం నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి 80వేల మందిని తరలిస్తున్నట్టు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ నవతెలంగాణకు చెప్పారు. జనసమీకరణ కోసం ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నట్టు తెలిపారు. పార్టీ నేతలు మల్లు రవి, కుసుమ కుమార్, నిజాముద్దీన్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఇప్పటికే నాగ్‌పూర్‌కు చేరుకుని తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

**కాంగ్రెస్ నాయకులు సంధాన కర్తలుగా ఉండాలి**
**టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న తరుణంలో ప్రజలకు, ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకులు సంధాన కర్తలుగా ఉండాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం మొదలైందనీ, ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాలతోపాటు రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పథకాలు అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సహకారం అందించాలని కోరారు. మాజీ ఎంపీ వి హనుమంతరావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలులోకి రాబోతున్నాయన్నారు.

## రైతులకు విత్తన కొరత లేకుండా చూడాలి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రైతులకు ఎలాంటి విత్తన కొరత లేకుండా చూడాలనీ, ఇందుకోసం నిరంతర పర్యవేక్షణ ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను, విత్తన కంపెనీలను ఆదేశించారు. ఇందుకోసం డిమాండ్‌కు తగినట్టు అంచనాలు వేసుకోవాలని సూచించారు. విత్తన ఎగుమతులను తగ్గించి కొరత లేకుండా చూడాలని కోరారు. వచ్చే సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తన సరఫరా చేయాలన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నాణ్యమైన విత్తన సరఫరా, వాటి పర్యవేక్షణపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన సరఫరాలో తెలంగాణ రైతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, మిగతా విత్తనాలను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసుకోవాలని కంపెనీలకు సూచించారు. బినామీ, సరైన మౌలిక సదుపాయాలు కల్పించని కంపెనీలను గుర్తించి వాటిని బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాల సరఫరా లేకుండా చూడాలన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలతో రైతులకు నష్టం జరిగితే విత్తన కంపెనీలు తగిన నష్టపరిహారాన్ని చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ విత్తన రంగ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని వివరించారు. సమీక్షా సమావేశంలో తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ కేశవులు ఉన్నారు.

**పత్తి మార్కెట్లలో తగిన సౌకర్యాలు కల్పించాలి**

పత్తి కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసి మార్కెట్ యార్డుల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని తుమ్మల ఆదేశించారు. పత్తి పండించే రైతుల నుంచే పత్తిని కొనుగోలు చేయాలన్నారు. ఆ సమాచారం లేని రైతుల వివరాలను ఏఈవోలు సేకరించాలని ఆదేశించారు. దేశంలోనే ఆదర్శంగా ఉండేలా కొత్త మార్కెట్లను నిర్మించాలన్నారు. పత్తి గింజల నుంచి నూనే సేకరించే యూనిట్లను స్థాపించేందుకు పరిశ్రమల శాఖతో సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

## గ్రూప్స్ పరీక్షల గందరగోళంపై ప్రభుత్వం

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

గ్రూప్స్ రాతపరీక్షల నిర్వహణ, పరీక్షల రీషెడ్యూల్, జాబ్ క్యాలెండర్ అంశాలపై నిరుద్యోగుల్లో నెలకొన్న గందరగోళంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 పోస్టుల భర్తీ ప్రక్రియ లీకేజీ కారణంగా వాయిదా పడి కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని తెలిపారు. వచ్చేనెల ఆరు, ఏడు తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షలను నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించిందని పేర్కొన్నారు. చైర్మెన్, సభ్యుల రాజీనామాతో ఆ పరీక్షలు జరుగుతాయా? లేదా? అనే ఆందోళనలో నిరుద్యోగులున్నారని తెలిపారు. గ్రూప్-4 ఫలితాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. అభ్యర్థుల్లో ఉన్న అనుమానాలను రాష్ట్ర ప్రభుత్వం నివృత్తి చేయాల్సిన అవసరముందని సూచించారు. గత ప్రభుత్వం మాదిరిగా తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

## గిన్నిస్ బుక్‌లో 'సుస్వితకు' చోటు

**నవతెలంగాణ-మంగపేట**



ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన సుస్విత గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంది. హైదారాబాద్ లోని గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం రాత్రి కూచిపూడి కళా వైభవం పేరిట కూచిపూడి నృత్య ప్రదర్శన 3783 మంది నృత్యకారులతో జరిగింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న నూతక్కి రాము, జయలక్ష్మి దంపతుల కుమార్తె సుశ్వితకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ములుగు జిల్లా కేంద్రానికి చెందిన సుస్విత.. డాక్టర్ స్వేత సీతారత్నం దగ్గర కూచిపూడి నేర్చుకుంది. సుస్విత కమలాపురంలోని ప్రయివేటు స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. గిన్నిస్ బుక్‌లో చోటు దక్కడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సుశ్వితను అభినందించారు.

## ఆశాల పెండింగ్ పారితోషికాల చెల్లింపుపై కమిషనర్ హామీ

- మిగతా సమస్యలనూ పరిష్కరిస్తామని కృషిచేస్తామన్నారు : సీఐటీయూ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఆశావర్కర్లకు నవంబర్ నెల పారితోషికం గురు, శుక్రవారాల్లో జమచేస్తామని వైద్యారోగ్య కమిషనర్ హామీనిచ్చారని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి తెలిపారు. బుధవారం ఈ మేరకు వారు వైద్యారోగ్య శాఖ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అక్టోబర్ 9న హెల్త్ డైరెక్టర్ ఇచ్చిన హామీల గురించి కమిషనర్ వద్ద ప్రస్తావించారు. రూ.18 వేల వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపు, ప్రమాద బీమా రూ.5 లక్షల చెల్లింపు, రిటైర్డ్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, సంక్షేమ పథకాల వర్తింపు, తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఆరు నెలల ఏరియర్స్‌ను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. నవంబర్ నెల పారితోషికాలు వెంటనే అకౌంట్లలో వేస్తామనీ, ఇన్సూరెన్స్, తదితర డిమాండ్లను పరిశీలిస్తామనీ, వాటి పరిష్కారం కోసం కృషిచేస్తామని కమిషనర్ హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.కవిత, ఏ. హేమలత, రాష్ట్ర నాయకులు ఎం.మీనా, ఎం.రేవతి, ఏ.శ్రీదేవి ఎస్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నవతెలంగాణ

పుష్పానికి పరిమళం ఎలాంటిదో మనిషికి వ్యక్తిత్వం అలాంటిది - చార్లెస్ స్పార్

గురువారం 28 డిసెంబర్ 2023
www.navatelangana.com

సంపాదకీయం

# చీకటిపర్వం

పార్లమెంటు శీతాకాల సమావేశాలు షెడ్యూలు కంటే ఒకరోజు ముందుగానే గురువారం ముగిశాయి. హంగులతో అధునాతనంగా నిర్మించిన పార్లమెంటు నూతన భవన సముదాయంలో ఈ నెల 4న ప్రారంభమై 21 వరకు సమావేశమయ్యాయి. మూడు క్రిమినల్ బిల్లులు సహా మొత్తం 19 బిల్లులు ఉభయ సభల్లో ఆమోదం పొందాయి. లోక్‌సభ 74 శాతం, రాజ్యసభ 79 శాతం ఉత్పాదకత సాధించినట్టుగా ప్రభుత్వం ప్రకటించుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో మొట్టమొదటి సారిగా భారతీయత జోడించిన క్రిమినల్ చట్ట బిల్లులను ఆమోదింపజేసుకున్నామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి స్వీయభుజకీర్తులు తగిలించుకొని బాకాలూదారు. కానీ వాస్తవంలో జరిగిందేమిటో దేశమంతా చూసింది. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండగానే 2001 డిసెంబరు 13న పార్లమెంటు పాత భవనంపై ఉగ్రవాదులు దాడి జరిగింది. నాటి దాడిలో అమరులైన వారిని స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్న రోజే పార్లమెంటు కొత్త భవనంలోకి చొరబడి దుండగులు ఎంతటి భయాత్పోతానికి గురి చేశారో చూశాం. బాంబులతో రంగుల పొగ వదిలి అధునాతన భవనమని మోడీ సర్కార్ చెబుతున్న పార్లమెంటు భద్రతా ప్రమాణాల డొల్లతనాన్ని ఈ ఘటన రట్టు చేసింది. చొరబడిన దుండగులకు పాసులిచ్చిన బీజేపీ ఎంపీని కనీసం ప్రశ్నించేందుకు కూడా మోడీ సర్కార్ ఉపక్రమించడం లేదు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై అనర్హత వేటు వేయడంతో మొదలైన బీజేపీ అప్రజాస్వామిక ఎత్తుగడలు శీతాకాల సమావేశాల చివరిరోజు వరకు కొనసాగాయి. భారత పార్లమెంటు చరిత్రలోనే ఒకే సెషన్‌లో 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసి మోడీ సర్కార్ ఒక చీకటి పర్వాన్ని లిఖించుకుంది. నూతన పార్లమెంటు భవనం గాండ్రించే సింహతలాటం, రాజదండాలతో నిరంకుశ రాచరికానికి ప్రతిబింబంగా ఉందని, దాని ఆకారమే 'శవపేటికను తలపిస్తోందంటూ విమర్శకులు సంధించిన వ్యంగాస్త్రాలను రుజువు చేసేలా నిరంకుశ చర్యలతో ప్రజాస్వామ్య విలువలకు బీజేపీ ప్రభుత్వం ఈ శీతాకాల సమావేశాల్లో సమాధి కట్టేసింది.

> భారత శిక్షాస్మృతి, భారత నేర ప్రక్రియా స్మృతి, భారత సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య సంహిత తీసుకొచ్చేందుకు ఉద్దేశించి మూడు బిల్లులను, టెలికమ్యూనికేషన్ల బిల్లును, భారత ఎన్నికల ప్రధాన కమిషనరు, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన సవరణ బిల్లును ఈ సెషన్‌లో ఆమోదింపజేసుకున్నారు. ఇవన్నీ కూడా భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే బిల్లులే.




ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణలో కాంగ్రెస్, మిజోరంలో జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ అధికారంలోకి రాగా మిగిలిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో పార్లమెంటు శీతాకాల సమావేశాలు వాడీవేడీగా జరుగుతాయని భావించినవారికి ఈ సెషన్ తీవ్ర అసంతృప్తిని మిగిల్చిందనే చెప్పాలి. భద్రతా వైఫల్యం, గంపగుత్తగా ప్రతిపక్షాల సభ్యులపై వేటు, క్రిమినల్ చట్టాలకు సంబంధించిన బిల్లులపై మాట్లాడేందుకు తమకు తగినంత సమయం ఇవ్వలేదని అధికారపార్టీ మహిళా ఎంపీలే నిట్టూర్చడం వంటి ఘటనలతో శీతాకాల సమావేశాలు వాస్తవరూపు దాల్చిన పీడకలగా నిలిచిపోయాయి. ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలోనే ప్రతిపక్షాలసభ్యులు నిరసన తెలియజేస్తే దానికి కూడా వక్ర భాష్యాలు అల్లేసి, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌కు అన్యాయం జరిగిపోయిందహో అంటూ పార్లమెంటులో బీజేపీ నేతలు చేసిన చేష్టలు విరక్తి పుట్టించే నాటకాన్ని తలపించాయి.

భారత శిక్షాస్మృతి, భారత నేర ప్రక్రియా స్మృతి, భారత సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య సంహిత తీసుకొచ్చేందుకు ఉద్దేశించి మూడు బిల్లులను, టెలికమ్యూనికేషన్ల బిల్లును, భారత ఎన్నికల ప్రధాన కమిషనరు, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన సవరణ బిల్లును ఈ సెషన్‌లో ఆమోదింపజేసుకున్నారు. ఇవన్నీ కూడా భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే బిల్లులే. ప్రతిపక్షమంటే ప్రజల గొంతుక. ప్రజల సమస్యలను ప్రస్తావించేలా చట్టసభల అధిపతులు ప్రతిపక్షాల హక్కులను కాపాడి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ పార్లమెంటు ఉభయ సభల అధిపతులూ ఈ బాధ్యతను నిర్వహించకపోవడమే గాకుండా ప్రభుత్వానికి వంత పాడి సభా సాంప్రదాయాలను సైతం మంటగల్పారన్న విమర్శలకు శీతాకాల సమావేశాలే తార్కాణం. ఈ నిరంకుశ చర్యలకు చరమగీతం పాడాలంటే మోడీ సర్కార్‌ను సాగనంపడమే మార్గం. ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఇదే లక్ష్యంతోనే ఐక్యం అవ్వాలి.

---



## 'న్యూస్‌క్లిక్'కు అండగా నిలవాలి

స్వతంత్ర వార్తా పోర్టల్ న్యూస్‌క్లిక్‌పై మోడీ ప్రభుత్వం వరుసదాడులు చేస్తున్న తీరు అత్యంత దుర్మార్గం. అక్టోబర్‌లో ఆ సంస్థ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిని ఉపా చట్టం కింద అరెస్ట్ చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆ సంస్థ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసింది. ఏ మాత్రం ముందస్తు హెచ్చరికలు లేకుండా తీసుకున్న ఈ చర్యతో రోజువారీ వ్యవహారాలకు కూడా వెతుక్కోవాల్సిన దుస్థితి ఆ సంస్థకు ఏర్పడింది. ఇక పాత్రికేయులు, వీడియోగ్రాఫర్లు, కార్యాలయ సిబ్బంది, కంట్రిబ్యూటర్ల జీతాల సంగతి చెప్పనవసరం లేదు. నిజానికి వారికి చెల్లింపులు చేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలోనే బ్యాంకు ఖాతాలను ఆదాయ పన్ను శాఖ అధికారులు ఫ్రీజ్ చేసిన విషయం వెల్లడైంది. తిరిగి ఖాతాలను ఎప్పటి నుండి పునరుద్ధరిస్తారన్న అంశాన్ని కూడా ఐటి అధికారులు చెప్పకపోవడంతో అగమ్యగోచర పరిస్థితి ఏర్పడింది. క్రిస్మస్, నూతన సంవత్సరంతో పాటు సంక్రాంతి పండగల వేళ మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య జీతాల మీదనే ఆధారపడి, బతుకులీడ్చే కుటుంబాల్లో ఏ స్థాయిలో బాధను నింపుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయినా ఈ షాక్ నుండి తొందరగానే బయటపడిన న్యూస్ క్లిక్ సిబ్బంది, ఈ తరహా చర్యలు తమ మనోధైర్యాన్ని, అంకితభావాన్ని అణువంత కూడా తగ్గించలేవని, తమ శక్తినంతా ఉపయోగించి చివరి వరకు పని చేస్తామని ప్రకటించడం స్ఫూర్తిదాయకం.

మోడీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి న్యూస్‌క్లిక్‌పై దేశద్రోహ ముద్ర వేయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. 2021 లోనే ఇడి, ఇన్‌కంట్యాక్స్ అధికారులతో పాటు ఢిల్లీ పోలీసులనూ రంగంలోకి దించింది. రకరకాల ప్రభుత్వ ఏజెన్సీలు రోజుల తరబడి విచారణ చేశాయి. అయినా, చైనా నిధులంటూ చేస్తున్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం వీసమంత కూడా నిరూపించలేకపోయింది. న్యూయార్క్ టైమ్స్ అదే ఆరోపణ చేస్తూ ప్రచురించిన బూటకపు కథనాన్ని అడ్డు పెట్టుకుని ఉపా చట్టం కింద అరెస్టులు చేసింది. అరెస్టులు చేసి నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఛార్జిషీట్ కూడా దాఖలు చేయలేదు. మరోవైపు తనకు వచ్చే నిధులన్నీ భారతీయ చట్టాలకు లోబడి, రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం బ్యాంకు అకౌంట్ల ద్వారానే వస్తాయని న్యూస్‌క్లిక్ పదేపదే స్పష్టం చేస్తోంది. ఇప్పుడు ఆ ఖాతాలను స్తంభింపచేయడం ద్వారా గొంతు నులమడానికి మోడీ ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటివరకు దాడులు, అరెస్టులు జరిగినా న్యూస్‌క్లిక్ కార్యక్రమాలు స్థిరంగా సాగుతున్నాయి. ఉద్యోగులు మొక్కవోని దీక్షతో సంస్థను ఎప్పటి మాదిరే ముందుకు తీసుకువెళ్ళారు. కరడుగట్టిన ఆర్థిక నేరగాళ్ల విషయంలోనూ లేని విధంగా బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసే దుర్మార్గానికి మోడీ సర్కారు తెగబడింది. ప్రభుత్వం అనుకున్న విధంగా జరిగితే న్యూస్ క్లిక్‌కు ఇది ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీన్ని గుర్తించే ఆ సంస్థ ఉద్యోగులు తమకు అండగా నిలవాలని పౌర సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఆ దిశలో ముందడుగు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత.

దేశ వ్యాప్తంగా ఉన్న మేధావులను, ప్రజాతంత్ర వాదులను 'ఉపా' చట్టం కింద అరెస్టుచేసి, నాలుగేళ్లుగా నిర్బంధంలో ఉంచినప్పటికీ ఇప్పటివరకు ఒక్క ఆధారాన్ని కూడా మోడీ సర్కారు చూపలేకపోయింది. అటువంటి కుట్రే న్యూస్‌క్లిక్‌పై కేంద్రం చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 'ది ఎకానమిస్ట్' పత్రిక భారత ప్రజాస్వామ్య స్తంభాలను ఒక్కొక్కటిగా కూల గొడుతున్నారు' అని రాసింది. అది అక్షరాల నిజం! ఈ ధోరణిని ఇక ఏమాత్రం అనుమతించ కూడదు. ప్రత్యామ్నాయ మీడియా సంస్థలను అణచివేయడం ద్వారా ప్రజల గొంతు నొక్కడానికి, ప్రజాస్వామ్యాన్ని కూల్చడానికి జరుగుతున్న ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించాలి.. తిప్పికొట్టాలి.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

# విద్యుత్‌రంగ అభివృద్ధికి అంతర్గత సామర్థ్యమే మూలం



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

21 డిసెంబర్ 2023న రాష్ట్ర శాసన సభలో విద్యుత్ రంగంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పత్రంలో ప్రధానంగా విద్యుత్‌చ్ఛక్తి సంస్థ 31 అక్టోబర్ 2023 నాటికి రూ.81,516 కోట్లు రుణపడి ఉన్నదని నివేదించారు. ఈ బాకీలకు సంబంధించిన ఇచ్చిన వివరణలో డిస్కాంల రుణం-62,461 కోట్లుగా ఉంది. ఇవిగాక జెన్‌కో చేసిన ఉత్పత్తి కేంద్రాల బాకీ కూడా కలిపి చెప్పారు. డిస్కాంల బాకీలో ప్రభుత్వరంగ సంస్థలు రూ.28,842 కోట్లు గత పదేండ్లుగా బాకీ పడి ఉన్నాయి. ఈ బాకీలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలం చెందడంతో డిస్కాంల నిర్వహణలో లోపాలు జరుగుతున్నాయి. తలసరి విద్యుత్ 2014లో 1356 యూనిట్లు కాగా 2021-22 నాటికి 2126 యూనిట్లకు పెరిగినట్లు దేశంలో పదో స్థానంలోకి వచ్చినట్లు చెప్పారు. ఆస్ట్రేలియా తలసరి వార్షిక వినియోగం 9,614 యూనిట్లు, దక్షిణ కోరియా 11,705 యూనిట్లు, చైనా 5,331 యూనిట్లు వినియోగిస్తున్నారు. రాష్ట్రంలో తలసరి వినియోగం తగ్గినప్పటికీ ఈ రంగం గత పదేండ్లలో బాగా అభివృద్ధి చెందినట్లు మాజీ విద్యుత్‌శాఖ మంత్రి అసెంబ్లీలో వాదించారు. చివరికి యాదాద్రి, భద్రాద్రి, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసిన మూడు అంశాలపై న్యాయవిచారణకు మాజీమంత్రి జగదీష్‌రెడ్డి ఆహ్వానించడంతో దానిని కాంగ్రెస్ ముఖ్యమంత్రి అంగీకరించి న్యాయ

> **కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన సందర్భంగా 4 వేల మెగావాట్లు ఉచితంగా నిర్మాణం చేసి ఇస్తానని చెప్పి మొదటి దశలో రామగుండంలో 1600 మెగావాట్లు నిర్మాణం పూర్తి చేసింది. రెండో దశలో మరో 800 మెగావాట్లు 2024కు పూర్తి చేస్తానని చెప్పింది. సౌర విద్యుత్ అభివృద్ధి కోసం సబ్సిడీ ఇచ్చినప్పటికీ నేటి వరకు 2,695 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి జరిగింది. కానీ, మరో 3 వేల మెగావాట్ల నిర్మాణాలు జరగాలి. ఇతర ప్రాంతాల నుండి 3000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాం. గ్యాస్ ద్వారా ఉత్పత్తి 2014లో 926 మెగావాట్లు కాగా నేడు 807 మెగవాట్లకు తగ్గింది. దేశవ్యాప్తంగా గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి తక్కువ ఖర్చుతో అవుతున్నది. అలాగే సౌరశక్తి, తదితర పద్ధతులను వినియోగించి ఉత్పత్తి ఖర్చును తగ్గించవచ్చు.**

విచారణకు ఆదేశించారు. ఈ చర్చలో వాస్తవాలు మాత్రం దృష్టికి రాలేదు.

రాష్ట్రంలో మొత్తం కనెక్షన్లు 1.96 కోట్లు ఉండగా, వ్యవసాయ రంగంలో 27.99 లక్షల కనెక్షన్లున్నాయి. మొత్తం విద్యుత్ వినియోగం 2023-24కు 84,156 మిలియన్ యూనిట్లు కాగా, వ్యవసాయరంగానికి 19,810 మిలియన్ యూనిట్లు వినియోగించాలి. దీనిని ఉపసంహరింపచేయటానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. సకాలంలో విద్యుత్ సరఫరా లోపం వల్ల దాదాపు రాష్ట్రంలో విద్యుత్ సరఫరాపై ఆధారపడి ఉన్న మూడు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. 24 గంటల కరెంటు సరఫరా చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారు. డిస్కాంల అస్తవ్యస్థ నిర్వహణ వల్ల ఏటా 700 మంది రైతులతో బాటు 1500 పశువులు మరణిస్తున్నట్లు "విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్" నివేదికలో వెల్లడిస్తున్నారు. ఇందులో దాదాపు సగం మంది తమ లోపాల వల్లనే చనిపోయారని వారికి పరిహారం ఇవ్వ డంలేదు. విద్యుత్‌రంగ బకాయిల గురించి చర్చించిన ప్రభు త్వం విద్యుత్ నిర్వహణలో అంతర్గత నైపుణ్యాన్ని పెంచుకోవ డానికి కనీస నిబంధనలు పాటించడం లేదు. 20, 30 సంవ త్సరాల క్రితం వేసిన కండక్టర్ వినియోగించడం వల్ల ప్రసా రంలో నష్టాలు వాటిల్లుతున్నాయి. సబ్ స్టేషన్‌లో నలుగురు సిబ్బంది పని చేయాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉంటున్నారు. రాష్ట్రంలో 8.79 లక్షల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా వాటి నిర్వహణ అధ్వన్నంగా ఉంది. మెజార్టీ ట్రాన్స్‌ఫార్మర్లకు ఒకటి ఎర్తింగ్, రెండవది ఏ.బి స్విచ్‌ల నిర్వహణ, మూడో ఫీడర్ కనెక్షన్లు సక్రమంగా లేకపోవడం. ఎప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోతుందో తెలియదు. పేలిపోయిన 15 రోజుల వరకు రిపేర్లు ఉండవు. డిస్కాంలలో అవినీతి పెద్ద ఎత్తున కొనసాగు తున్నది. కనెక్షన్ల కొరకు పెట్టుకున్న దరఖాస్తులు మంజూరీ కావడానికి 4,5 మాసాలు పడుతున్నది. 14 శాతం డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్ మిషన్ నష్టాలతో నిర్వహణ సాగుతున్నట్లు నివేదిక చెప్తున్నది. వాస్తవానికి వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు లేకపోవడం వల్ల జరిగిన నష్టాలను వ్యవసాయరంగంపై తోసి వేస్తున్నారు. రాష్ట్రంలోని 3,221 సబ్ స్టేషన్‌లు (33/11 కె.వి) నిర్వహణ సక్రమంగా లేక చాలా సందర్భా లలో సబ్ స్టేషన్లు కాలిపోతున్నాయి. అయినా వాటిని సకాలంలో రిపేర్లు చేయడం లేదు.

### విద్యుత్ కొనుగోలులో కుంభకోణం

2014 నవంబర్ 3న ఛత్తీస్‌గఢ్ నుండి 1000 మెగవాట్ల కొనుగోలుకు పరస్పర ఒప్పందం కుదిరింది. 2017 మే 6 నుండి విద్యుత్ చ్ఛక్తి ఉత్పత్తి చేసి ప్రసారం చేయడం జరిగింది. సహజంగా విద్యుత్ జనరేషన్ కేంద్రాలలో 75 శాతం "ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్" (పిఎల్‌ఎఫ్) ఉత్పత్తి కావాలి. కానీ, ఛత్తీస్‌గఢ్‌లలో కొనుగోలు చేసిన 1000 మెగావాట్లలో 2017-18లో 72.51 శాతం, 2018-19లో 64.39 శాతం, 2019-20లో 27.33 శాతం, 2020-21లో 39.7 శాతం, 2021-22లో 19.71 శాతం మాత్రమే ఉత్పత్తి అయింది. ఏప్రిల్ 21 నుండి ప్రసారం మొత్తం ఆగిపోయింది. విద్యుత్ ఉత్పత్తి కాకున్న ఆ సంస్థకు రూ.638.50 కోట్లు చెల్లించడం జరిగింది. అలాగే యాదాద్రి (4000 మెగావాట్లు) ఉత్పత్తి కేంద్రానికి మూల ధన వ్యయం 2015 జూన్ 1న రూ.25,099 కోట్లు మంజూరీ చేయగా, నేటి వరకు రివైజ్ చేసి రూ.34,543 కోట్లకు పెంచడం జరిగింది. ఒక మెగావాట్లకు మొదట రూ.6.27 కోట్లు కాగా, ప్రస్తుతం రూ.8.64 కోట్లకు పెంచారు. అదే సందర్భంలో ఎన్‌టిపిసి రామగుండంలో మెగావాటుకు రూ.7.63 కోట్లకు నిర్మాణం చేశారు. అలాగే భద్రాద్రి 4క్ష్మ270 మెగావాట్లు,మెగావాటుకు రూ.9.74 కోట్లకు పెంచారు. ఏడేండ్లు గడిచినా ఇంత వరకు పూర్తి కాలేదు.

రాష్ట్ర ఉత్పత్తి మొత్తం 6,485 మెగావాట్లు కాగా, వినియోగం 21,988 మెగావాట్లకు పెరిగింది. మన ఉత్పత్తి పోగా మిగిలిన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నాం. ఈ రోజు బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.3.64 రూపాయల నుండి రూ.4 లకు లభ్యం అవుతున్నది. కానీ, గత రాష్ట్ర ప్రభుత్వం 5,6 రూపాయల చొప్పున యూనిట్ కొనుగోలు చేసింది. ఒప్పందం కుదుర్చుకున్న తరువాత విద్యుత్ సరఫరా కాకున్న ఒప్పందం ప్రకారం కంపెనీలకు చెల్లించడం జరిగింది. రైతులకు, గృహాలకు సబ్సిడీ ఇవ్వడం ద్వారానే నష్టం జరుగుతున్నట్లు ప్రభుత్వం చెప్పింది. వాస్తవానికి వంద యూనిట్ల లోపు వాడకం దారులకు రూ.1,381 కోట్లు, రైతులకు 7,743 కోట్లు మొత్తం 9,124 కోట్లు మాత్రమే సబ్సిడీ చెల్లించారు. అయినా ప్రతియేటా 12వేల కోట్లు ఆదాయ వ్యయాలలో తగ్గుదల ఉన్నట్లు డిస్కాంలు బహిరంగ విచారణలో నివేదికలు ఇస్తున్నాయి. రెగ్యులేటరీ కమిషన్ ప్రతియేటా విద్యుత్ ఉత్పత్తిని, వినియోగాన్ని లెక్కగట్టి వినియోగదారుడు యూనిట్‌కు ఎంత చెల్లించాలో కెటగిరిల వారీగా నిర్ణయిస్తారు. ఆ నిర్ణయాన్ని డిస్కాంలు అమలు జరపాలి. డిస్కాంలకు వచ్చే ఆదాయం నుండి ట్రాన్స్ మిషన్‌కు, జనరేషన్‌కు ఇచ్చుకోవాలి. కానీ, డిస్కాంలకు వచ్చిన ఆదాయంలో తాము అదనంగా వాడుకుంటూ ట్రాన్స్ మిషన్‌లకు, జనరేషన్‌లకు బకాయిలు పెడుతున్నారు. 2018 నుండి 2022 మార్చి వరకు రెగ్యులేటరి కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహించలేదు. ఆ నాలుగేండ్లలో 36 వేల కోట్లు లోటు వచ్చినట్లు బాకీలు చూపుతున్నాయి.

ఒకవైపున విద్యుత్ కొనుగోలులో తక్కువ ధరకు వచ్చే విద్యుత్ కొనకుండా, విద్యుత్ జనరేషన్ కేంద్రాలలో సకాలంలో నిర్మాణం



> **ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు మాఫీ ప్రకటించింది. దాని వల్ల రాష్ట్రంలోని 1.05 కోట్ల కనెక్షన్లకు రూ.3,431 కోట్లు సబ్సిడీ చెల్లించాల్సి వస్తుంది. వీరికి 9,021 మిలియన్ యూనిట్లు అవసరం ఉంటుందని అంచనా వేశారు. అందువల్ల రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచడానికి, అంతర్గత సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కృషి చేయకుండా రుణాలపైననే చర్చలు జరిపి సంతృప్తి చెందడం వల్ల ఉత్పత్తి పెరగదు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందదు. ఈ అంశాలను సమగ్రంగా చర్చించి ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.**


చేయకుండా ఉండడం వల్ల నేడు విద్యుత్ సంస్థ రుణాలు ఊహించనంతగా రూ.81,516 కోట్లకు పెరిగాయి. గతంలో కేంద్ర ప్రభుత్వ పథకాల వల్ల డిస్కాంల బాకీలను మాఫీ చేశారు. అయినా మరల బాకీలు పెరుగుతూనే ఉన్నాయి. విద్యుత్‌శాఖలోని 3 విభాగాలు అంతర్గత సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా రుణాలను చెల్లించడంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను ఇవ్వవచ్చు. శ్వేత పత్రంలో ప్రకటించినట్లు జన్‌కో-ట్రాన్స్‌కో డిస్కాంలకు ప్రస్తుతం

> **రాష్ట్ర ఉత్పత్తి మొత్తం 6,485 మెగావాట్లు కాగా, వినియోగం 21,988 మెగావాట్లకు పెరిగింది. మన ఉత్పత్తి పోగా మిగిలిన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నాం. ఈ రోజు బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.3.64 రూపాయల నుండి రూ.4లకు లభ్యం అవుతున్నది. కానీ, గత రాష్ట్ర ప్రభుత్వం 5,6 రూపాయల చొప్పున యూనిట్ కొనుగోలు చేసింది. ఒప్పందం కుదుర్చుకున్న తరువాత విద్యుత్ సరఫరా కాకున్న ఒప్పందం ప్రకారం కంపెనీలకు చెల్లించడం జరిగింది. రైతులకు, గృహాలకు సబ్సిడీ ఇవ్వడం ద్వారానే నష్టం జరుగుతున్నట్లు ప్రభుత్వం చెప్పింది. వాస్తవానికి వంద యూనిట్ల లోపు వాడకం దారులకు రూ.1,381 కోట్లు, రైతులకు 7,743 కోట్లు మొత్తం 9,124 కోట్లు మాత్రమే సబ్సిడీ చెల్లించారు.**

ఉన్న అప్పులకు సమానంగా ఆస్తులు ఉన్నట్లు నివేదించారు. డిస్కాంల ఆస్తులు రూ.59,132 కోట్లు కాగా, అప్పులు కూడా అంతే ఉన్నాయి. జెన్‌కోకు రూ.53.963 కోట్లు ఆస్తులు కాగా, అప్పులు కూడా సమానంగా ఉన్నాయి. ట్రాన్స్‌కోకు రూ.24,476 కోట్లు ఆస్తులు ఉండగా అప్పులు సమానంగా ఉన్నాయి. 2014లో డిస్కాంల బాకీ 12,186 కోట్లు కాగా, 2023లో రూ.62,461 కోట్లకు పెరిగింది. నిర్వహణ లోపాలను ఈ అప్పులు స్పష్టంగా చెప్తున్నాయి. గత పదేండ్లలో రాష్ట్రంలో 2000 మెగావాట్ల విద్యుత్ మాత్రమే అదనంగా ఉత్పత్తి అయింది. నిర్మాణంలో ఉన్న ఉత్పత్తి కేంద్రాలు ఏళ్ళు గడిచినా పూర్తి కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన సందర్భంగా 4 వేల మెగావాట్లు ఉచితంగా నిర్మాణం చేసి ఇస్తానని చెప్పి మొదటి దశలో రామగుండంలో 1600 మెగావాట్లు నిర్మాణం పూర్తి చేసింది. రెండో దశలో మరో 800 మెగావాట్లు 2024కు పూర్తి చేస్తానని చెప్పింది. సౌర విద్యుత్ అభివృద్ధి కోసం సబ్సిడీ ఇచ్చినప్పటికీ నేటి వరకు 2,695 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి జరిగింది. కానీ, మరో 3 వేల మెగావాట్ల నిర్మాణాలు జరగాలి. ఇతర ప్రాంతాల నుండి 3000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాం. గ్యాస్ ద్వారా ఉత్పత్తి 2014లో 926 మెగావాట్లు కాగా నేడు 807 మెగావాట్లకు తగ్గింది. దేశవ్యాప్తంగా గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి తక్కువ ఖర్చుతో అవుతున్నది. అలాగే సౌరశక్తి, తదితర పద్ధతులను వినియోగించి ఉత్పత్తి ఖర్చును తగ్గించవచ్చు. తెలంగాణలో పారిశ్రామీకరణకు తగినంత విద్యుత్ సరఫరా చేయకపోవడం వల్ల పరిశ్రమల స్థాపనకు ఆటంకం ఏర్పడుతున్నది. వాటికి రూ.7-12ల వరకు యూనిట్ ధర నిర్ణయించడంతో ప్రభుత్వ సంస్థల నుండి కొనుగోలు చేయడానికి నిరాకరిస్తూ సొంత క్యాపిటేషన్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. క్రాస్ సబ్సిడీ లేకుండా వ్యవసాయం, 100 యూనిట్లలోపు వారికి సబ్సిడీ ఇవ్వడం సాధ్యం కాదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు మాఫీ ప్రకటించింది. దాని వల్ల రాష్ట్రంలోని 1.05 కోట్ల కనెక్షన్లకు రూ.3,431 కోట్లు సబ్సిడీ చెల్లించాల్సి వస్తుంది. వీరికి 9,021 మిలియన్ యూనిట్లు అవ సరం ఉంటుందని అంచనా వేశారు. అందువల్ల రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచడానికి, అంతర్గత సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కృషి చేయకుండా రుణాలపైననే చర్చలు జరిపి సంతృప్తి చెందడం వల్ల ఉత్పత్తి పెరగదు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందదు. ఈ అంశాలను సమగ్రంగా చర్చించి ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

---

# పథకాలు సరే! కొనుగోలు శక్తి పెంచేదెప్పుడు?



గీట్ల ముకుందరెడ్డి
94900 98857

అందరికీ సుపరిచితమైన నాటి కిలో రెండు రూపాయల బియ్యం, నేటి ఒక రూపాయి కిలో బియ్యం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆసరా పెన్షన్లు, బీడీ కార్మికులకు జీవనభృతి, రైతుబంధు, దళిత బంధు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ.2500, రూ.500కే గ్యాస్ సిలిండర్, ల్యాడ్లీ బహన్, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఉచిత విద్యుత్, గృహ వినియోగానికి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ వంటి అనేక జనాకర్షణ పథకాలను రాజకీయ పార్టీలు ఎన్నికలలో వాగ్దానం చేస్తున్నది. ప్రజలు విశ్వసించి ఓట్లు వేసిన పార్టీ అధికారంలోకి వస్తున్నది. కొన్ని వాగ్దానాలు అమలు చేయడం కొన్ని విస్మరిస్తున్నది. ఈ పథకాలతో లాభ పడుతున్నది పేద వర్గాలుగా కనబడుతున్నప్పటికీ పరోక్షంగా లాభపడుతున్నది ధనిక వర్గాలే. సంక్షేమ పథకాలు ప్రజా తిరుగుబాట్లు రాకుండా ఉపయోగపడటమే కాదు, పాలకవర్గ బూర్జువా, భూస్వామ్య పార్టీలు ఓట్లు, సీట్లు పొందడానికి, పెట్టుబడిదారీ వర్గాలు తమ దోపిడీని తీవ్రం చేయడానికి ఉపయోగ పడుతున్నాయి. ఉచితాలు అనుచితం అంటూ, పప్పు బెల్లంలా పంచి పెడుతున్నారంటూ దోపిడీ వర్గాలే గగ్గోలు పెడుతున్నాయి. ప్రభుత్వ ఖజానాకు వస్తున్న పన్నులు, రాయితీల రాబడిలో ఎనభై శాతం సామాన్యులదే.

ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాల వలన కార్పోరేట్ హాస్పిటల్స్, ఇంజనీరింగ్ విద్యాసంస్థలు లబ్ధిపొందాయి. ప్రభు త్వాలు చెల్లింపులను బకాయిలు పెడితే సేవలు నిలిపివేస్తున్నారు. ఇవే డబ్బులతో ప్రభుత్వమే నాణ్యమైన, ప్రామాణికమైన విద్యా, వైద్య సౌకర్యాలు ప్రజలకు కల్పించవచ్చును. అందులో పని చేసే డాక్టర్లకు, ఫ్యాకల్టీకి, సిబ్బందికి మంచి వేతనాలు, సౌకర్యాలు కల్పించవచ్చును. ఈ పనిని ప్రభుత్వాలు ఎందుకు చేయడం లేదు? ఆలోచిస్తే సమాధానం తేలికే. కార్పొరేట్ల ప్రయోజనం కోసమేనన్నది వాస్తవం. రేషన్ బియ్యం మనిషి ఆహారానికి కొంతమేరకు ఉపయోగపడుతుంది. అదే సమయంలో తక్కువ జీతానికి, కూలికి మనుషులు దొరకడానికి పరోక్షంగా ప్రయోజనం చేకూర్చుతున్నది. ఈ స్కీం లేకుంటే పరిశ్రమల యజమానులు, భూస్వాములు, వ్యాపార, వాణిజ్య వర్గాలు రోజుకు రూ.50 పైనే అదనంగా చెల్లించవలసి వస్తుంది. ఉచిత బస్సు సౌకర్యం మహిళల సాధికారతకు దోహదం చేసేదే. దీనివల్ల శ్రామిక మహిళలకు నెలకు రూ.300 నుండి 600 వరకు పొదుపు అవుతున్నాయి. కానీ ముందు ముందు యజమానులు చెల్లించే వేతనాల్లో దీన్ని గమనంలో ఉంచుకునే వారి జీతాలు నిర్ణయించే అవకాశాలున్నాయి.

వ్యవసాయంలో వ్యయం, ఇతరులకు సాయం తప్ప రైతులకు ఆదాయం లేక ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, యంత్రాలు వంటి ఇన్‌పుట్స్ ఖర్చులు పెరుగుతున్న క్రమంలో ఈ పథకాలు వచ్చాయి. రైతుల చేతిలో వ్యవసాయం ఉన్నం తవరకు వ్యవసాయ ఉత్పత్తులు తక్కువ ధరలకే లభించాలి. ఇది పరిశ్రమల, వ్యాపార, వాణిజ్య అధిపతుల పాలసీ. ఆహార ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉంటేనే తమవద్ద పనిచేసే ఉద్యోగ, కార్మికులకు తక్కువ జీతాలు ఇవ్వడానికి ఉంటుంది. తమ పరిశ్రమలకు రా మెటీరియల్‌గా ఉపయోగపడే పత్తి, చెరుకు, రబ్బర్ వంటి ఉత్పత్తులను తక్కువ ధరకు రైతుల నుండి పొంది, తమ ఉత్పత్తులను ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు రైతుల ఆదాయం పెంచే విధంగా ఉండాలి. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి. దళిత బంధు పథకం లబ్దిదారులు తమ తమ ఆసక్తిగల ఉత్పత్తి యూనిట్లను, వ్యాపార, వాణిజ్య రంగాల పెట్టుబడి పెట్టి స్వయం ఉపాధి పొందే ఉద్దేశంతో ఈ స్కీమ్‌ను తీసుకువచ్చారు. మార్కెటింగ్ సమస్యను ఎదుర్కొంటున్నారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతం పెరిగింది. ఆధిపత్య భావజాలంగల సమాజంలో స్కీమ్‌పై వ్యతిరేక ప్రచారం నిర్వహించడంలో పాలకవర్గాలు జయప్రదమయ్యాయి. ఆసరా పెన్షన్‌లు పొందేవారిలో వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత వృత్తుల వంటి వారు ఉన్నప్పటికీ ప్రధానంగా వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్న వారే అధిక భాగంగా ఉన్నారు. పనిచేసే వయస్సులో వీరంతా రకరకాల ఉత్పత్తుల్లో పాల్గొన్నారు. అయినా సరే తమ జీవిత చరమాంకంలో వినియోగించుకునేందుకు ఆదాయాన్ని సమకూర్చుకోలేకపోయారు. వారి శ్రమకు తగిన ఫలితం దక్కకపోవడమే దీనికి కారణం. పిల్లలు వారి వద్ద తల్లి దండ్రులను పోషించుకోలేకపోతున్నారు. వీరు కూడా తమ శ్రమకు తగిన ప్రతిఫలం పొందడం లేదు. కన్నవారు పరాయివారుగా పాలకులను పెద్దకొడుకుగా, కన్నవారి కంటే ఎక్కువగా ప్రచారం చేసుకుంటున్నారు. శ్రమకు తగిన ఫలితం కాదు కదా కనీస వేతనం కూడా నిర్ణయించి అమలు చేయకుండా దోపిడీ వర్గాల ప్రయోజనాలను బూర్జువా రాజకీయ పార్టీలు కాపాడుతున్నాయి.

రాష్ట్రంలో కోటి మంది శ్రామికులకు ప్రయోజనం కల్పించే 73 షెడ్యూల్ పరిశ్రమల కనీస వేతనం జీవోలను గత పదిహేనేండ్లుగా సవరించ లేదు. కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాల్సి ఉండగా సగటున 12 గంటలకు పని చేయించుకొని రూ.8 వేల నుండి 12వేలు మాత్రమే ఇస్తున్నారు. కనీస వేతనాల సలహా బోర్డు సూచన మేరకు కార్మిక శాఖ నెలకు రూ.18 వేల కనీస వేతనంతో కూడిన జీవోలను ఐదు రంగాలలో ఇచ్చినప్పటికీ, ఫైనల్ గెజిట్ ఇవ్వకుండా రెండేండ్లకు పైగా ముఖ్యమంత్రి కార్యాలయం నిలిపివేసింది. పది మంది మ్యాన్‌పవర్‌తో పనిచేస్తున్న వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు వారి ప్రోడక్ట్, సర్వీస్‌లలో ఉపయోగిస్తున్న సాంకేతిక, పని



> **తెలంగాణ తలసరి ఆదాయం రూ.3 లక్షల 10 వేలుగా చెప్పబడుతున్నది. ఒక కుటుంబం ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దలు అంటే ఏడాదికి రూ.12 లక్షల 40 వేలు. ఎన్ని కుటుంబాలు ఈ ఆదాయాన్ని పొందగలుగుతున్నాయి. శ్రామికుల శ్రమతో సృష్టించబడుతున్న సంపద పెట్టుబడి దారుల వద్ద పోగుపడుతున్నది. ఇది పంచబడాలి. అప్పుడు ప్రజల ఆదాయం, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెరుగుతుంది. అప్పుడు మరిన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేయగలం.**

సామర్థ్యాన్ని బట్టి నెలకు రూ.2 లక్షల నుండి 10 లక్షల లాభం పొందగలుగుతున్నారు. ప్రభుత్వ ఖజానాపై భారం పడకుండా ప్రజల ఆదాయం పెరిగేందుకు తోడ్పడే కనీస వేతనాలు పెంపు జీవోలను ప్రభుత్వాలు ఎందుకు విడుదల చేయడం లేదు. పైగా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. అభివృద్ధికి, అవసరమైన ప్రజానీకానికి సంక్షేమ పథకాలు చేపట్టడానికి ఆర్థిక ఇబ్బందులు ఉండవు.

స్వాతంత్ర్య తొలినాళ్లలో స్వయం సమృద్ధి దిశగా భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు నెల కొల్పడం, ఉన్నత సాంకేతిక విద్య, రీసెర్చ్ కేంద్రాలు వంటి అనేక రంగాల్లో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టింది. నీటి పారుదల ప్రాజెక్టుల వలన లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చాయి. ఆహారం ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించాము. ప్రజల ఆదాయం కొనుగోలు శక్తి పెరిగింది. హైదరాబాద్ కేంద్రంగా నిర్మించబడిన బీహెచ్‌ఈఎల్, ఐసిఐఎల్, బిడిఎల్, బిఈఎల్, మిధాని, ఐడిపిఎల్, హెచ్‌ఎంటి, ఆల్విన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, వాటికి అనుబంధంగా నిర్మించబడిన అనేక చిన్న పరిశ్రమలతో పెద్ద ఎత్తున శాశ్వత ఉద్యోగాలు లభించాయి. మరోవైపు సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ రంగంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పించబడింది. ప్రభుత్వరంగ సంస్థల ఉద్దేశం ఎక్కువ మందికి మంచి వేతనంతో కూడిన ఉపాధి కల్పించడం. వాటి ఉత్పత్తులను, సేవలను ప్రజలకు తక్కువ ధరలకే అందించడం లక్ష్యంగా ఉండేది. గత రెండు దశాబ్దాల కాలంగా పరిస్థితి తిరగబడింది. ఈ సంస్థలలో పర్మినెంట్ ఉద్యోగిత తగ్గించారు. ఉత్పత్తి టార్గెట్లు పెంచారు. అరకొర వేతనాలతో కూడిన కాంట్రాక్టు కార్మికుల సంఖ్య అమాంతంగా పెంచేశారు. సుమారు పది లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న సాఫ్ట్‌వేర్ రంగంలో కూడా కాంట్రాక్టు ఉద్యోగాలు 30 శాతానికి చేరుకున్నాయని ఒక అంచనా. వీరు అసలు వేతనాల్లో 40 శాతం మాత్రమే పొందుతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి అవకాశాలు ఒక రాష్ట్రానికే పరిమితమైనవి కావు. దేశంలోని అనేక రాష్ట్రాల వాళ్లు ఉపాధి పొందుతున్నారు. దీనికి తోడు అనేక రంగాల్లోకి వలస కార్మికులు పెద్ద సంఖ్యలో ప్రవేశపెట్టబడ్డారు.

తెలంగాణలో వివిధ రంగాల్లో సుమారు 20 లక్షల మంది వలస కార్మికులు పనిచేస్తున్నారని అంచనా. వీరిలో 70 శాతం మంది యువకులు పెండ్లి కాని వారు. రోజుకు 12 గంటలు పనిచేస్తూ సగటున నెలకు రూ.12 వేల జీతం పొందుతున్నారు. రూ.రెండు వేలు లేదా మూడు వేలు ఇక్కడ ఖర్చు చేస్తున్నారు. మిగతావి తమ స్వగ్రామాల్లోని కుటుంబాలకు పంపిస్తున్నారు. వీటన్నిటి నేపథ్యంలో ప్రజల ఆదాయం కొనుగోలు శక్తి పడిపోయింది. ఆదాయమంటే ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయంగా మార్చేశారు. తెలంగాణ తలసరి ఆదాయం రూ.3 లక్షల 10 వేలుగా చెప్పబడుతున్నది. ఒక కుటుంబం ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దలు అంటే ఏడాదికి రూ.12 లక్షల 40 వేలు. ఎన్ని కుటుంబాలు ఈ ఆదాయాన్ని పొందగలుగుతున్నాయి. శ్రామికుల శ్రమతో సృష్టించబడుతున్న సంపద పెట్టుబడిదారుల వద్ద పోగుపడుతున్నది. ఇది పంచబడాలి. అప్పుడు ప్రజల ఆదాయం, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెరుగుతుంది. అప్పుడు మరిన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేయగలం.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
గురువారం | డిసెంబర్ 28, 2023 | www.navatelangana.com

## శ్రీవారి హుండీల ఆదాయం రూ.36, 55,896

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహా దివ్య క్షేత్రమైన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలు మ్రొక్కుబడులకు సంబంధించిన స్వామి వారి హుండీల ఆదాయం బుధవారం లెక్కించగా 36 లక్షల 55 వేల 896 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. దేవదాయ శాఖ ఖమ్మం జిల్లా పర్యవేక్షకురాలు ఆర్.సమత పర్యవే క్షణలో 92 రోజుల కాలానికి గాను ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపర్డెంట్ కె. విజయకుమారి, ఉప ప్రధానార్చకులు విజయదేవశర్మ, ఆలయ సిబ్బంది, అర్చక బృందంతో పాటు మధిర శ్రీ సత్యసాయి సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పాయపూరు మాజీ సర్పంచ్ మృతి

**- పలువురు ప్రముఖులు నివాళి**

**నవతెలంగాణ-కల్లూరు**



మండల పరిధిలోని పాయపూరు గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ఊటుకూరు చంద్రశేఖర్ శర్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మట్టా దయానంద్, విజయకుమార్ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సర్పంచిగా గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని దయానంద అన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ మండల నాయకులు పసుమర్తిచందర్‌రావు, అస్మతి మోహన్రావు, బూదాటి నారపరెడ్డి, భాగం ప్రభాకర్ చౌదరి, హనుమా తండా సర్పంచ్ దరవాత్ మోహన్, శివకుమార్, ఏనుగు సత్యంబాబు, మాదిరాజు అన్నవరం, నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## వైరా ఎమ్మెల్యేను కలిసిన కారేపల్లి నాయకులు

**నవతెలంగాణ-కారేపల్లి**

వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను కారేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిశారు. కొత్తగూడెంలోని ఎమ్మెల్యే స్వగృహంలో కలిసిన నాయకులు ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి శు భాకాంక్షలు తెలిపారు. కారేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలకు వెంటనే పరిష్కార మార్గా చూపాలని కోరారు. మండలంలో రాజకీయ పరిస్థితిపై చర్చించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుగులోత్ హర్షానాయక్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు నునావత్ సాయికిరణ్, నాయకులు లావుడ్యా రాజ్‌కుమార్, బానోత్ వినోద్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## మందు తాగి ప్రాణాపాయ స్థితిలో వ్యక్తి

**- కాపాడిన శ్రీ రక్షా హాస్పిటల్ బృందం**

**నవతెలంగాణ-ఖమ్మం**



ఖమ్మంలోని శ్రీ రక్షా హాస్పిటల్‌కు తిరుమలపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన చెరుకూరు రమేష్ అనే వ్యక్తి కొన్ని వ్యక్తిగత కారణాలవల్ల పారాక్వాట్ అనే గడ్డి మందు తాగి ప్రాణాపాయం స్థితిలో కుటుంబ సభ్యులు శ్రీరక్ష హాస్పిటల్‌ను సంప్రదించంగా వెంటనే అడ్మిన్ చేయించుకుని వెంటనే ఎమర్జెన్సీ డాక్టర్ కన్నేటి సతీష్ నారాయణ చౌదరి, శ్రీ రక్షా హాస్పిటల్ ఎండి గోంగూర వెంకటేశ్వర్లు చికిత్స చేసి మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. ఈ మందు తాగిన వాళ్లలో 100కు 93 శాతం మరణించడం జరుగుతుందని, ఆ ఏడు శాతం మంది కూడా 10 ఎంఎల్ కంటే తక్కువ తాగిన వాళ్లే కాని ఎక్కువ తాగిన వారు మాత్రం బతకడం అసాధ్యం అన్నారు. వైద్యం చేసిన డాక్టర్ కన్నేటి సతీష్ నారాయణ చౌదరి మాట్లాడుతూ ఈ చెరుకూరు రమేష్ అనే వ్యక్తికి మందు తాగిన కొద్ది గంటల్లోనే మేము అత్యాధునిక పరికరాలతో హెూమో పెర్ఫ్యూజన్ అనే అత్యాధునిక చికిత్సలు ఉపయోగించి ఊపిరితిత్తులు ఇతర అవయవాలు పాడుకాకుండా కాపాడి అతని సురక్షితంగా డిశ్చార్జ్ చేసామని సంతోషంగా తెలిపారు. ఈ చికిత్సలో శ్రీరక్ష హాస్పిటల్ ఎండి డాక్టర గోంగూర వెంకటేశ్వరరావు భాగస్వామ్యం అయ్యారు. డ్యూటీ డాక్టర్ సాహితీ , అల్తాఫ్ నిరంతరం పేషెంట్‌ని పర్యవేక్షించారు.

## ఏఐసీసీ మెంబర్ కొప్పుల రాజును కలిసిన యువజన నాయకులు దుర్గ

**నవతెలంగాణ-ఖమ్మం**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ యువజన నాయకులు మధుగాని దుర్గ బుధవారం ఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయంలో ఏఐసిసి మెంబర్, రాహుల్ గాంధీ సలహాదారులు కొప్పుల రాజుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మదుగాని దుర్గా మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన ఎన్నికల గురించి ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో జరిగిన ఎన్నికల గురించి సవివరంగా చర్చించరాని, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలోని సంక్షేమ పథకాలను "ప్రజా పాలన" ప్రోగ్రాం ద్వారా ప్రజలందరికి అందె విధంగా చూడాలని కొప్పుల రాజు సూచించారని తెలిపారు.

## 30న ఆటల పోటీలు

**నవతెలంగాణ-కల్లూరు**

ఈనెల 30వ తేదీ నుండి మూడు నాలుగు ఐదు తరగతుల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ దామోదర్ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు కల్లూరు మినీ స్టేడియం గ్రౌండ్స్ కల్లూరు నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటలు 1.50 మీటర్ల పరుగు పందెం2. 300 మీటర్ల పరుగు పందెం... 3.స్టాండింగ్ లాంగ్ జంప్, ఈ మూడు అంశంలో నిర్వహించబడునని, కల్లూరు మండలంలో ఉన్నటువంటి ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు ఉపయోగించుకోవచ్చు అని తెలిపారు. సహాయ సహకారాలను అందించి కల్లూరు మండల స్థాయి ప్రాథమిక పాఠశాల పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

## క్రిస్టమస్ కానుకలు అందజేత

**నవతెలంగాణ-మధిర**

రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టమస్ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు బుధవారం మధిరలో అంబేద్కర్ లెదర్ పార్క్142 మంది సభ్యులకు క్రిస్మస్ కానుకను మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు రంగా హనుమంతరావు, అంబేద్కర్ లెదర్ ప్రొడక్ట్స్ ఇండస్ట్రియల్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రెసిడెంట్ శ్యామలరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ లెదర్ ప్రొడక్ట్స్ ఇండస్ట్రియల్ కోఆపరేటివ్ డైరెక్టర్లు మోదుగు రాజారావు, కంటెపూడి రెబ్బమ్మ, ఏసుప్రభు జమలయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రి పనులను పరిశీలించిన అభివృద్ధి కమిటీ

**- రోగులకు ఉపయోగపడే పరికరాలు పరిశీలన**

**నవతెలంగాణ-కామేపల్లి**

కామేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ఎంపీపీ బానోతు సునిత, డిప్యూటీ డిఎంహెచ్ఓ బెజవాడ సైదులు ఆకస్మికంగా సందర్శించి అభివృద్ధి పనులను స్వయాన పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సమావేశం మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నెల్లూరి చందన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ, డిప్యూటీ డిఎంహెచ్ఓ మాట్లాడుతూ కామేపల్లి మండల ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి, రోగులసేవలకు ఉపయోగించే పరికరాలు, వైద్యసేవలు భేస్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో డాక్టర్ నెల్లూరి చందన జిల్లాలోనే నెంబర్ 1 అన్నారు. మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్య సిబ్బందిని కోఆర్డినేషన్ చేసుకోవడంతో పాటు మండలంలో ఉన్న ప్రజాప్రతినిధులు ప్రజలతో కలిసి మెలిసి ఉండి ప్రభుత్వ వైద్య సేవలకు ప్రజలకు అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నందుకు వారిని ఈ సందర్భంగా ప్రత్యేకించి అభినందించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సుధాకర్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, హెచ్ ఇఓ ధూఫ్ సింగ్‌తో పాటు ప్రభుత్వ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే అధికారులు

**-ఎమ్మెల్యే మట్టా రాగమయి**

**నవతెలంగాణ-పెనుబల్లి**



కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలకు అధికారులే ప్రజల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు దరఖాస్తులు అందజేస్తారని సత్తుపల్లి శాసనసభ్యులు మట్ట రాగమయి అన్నారు. బుధవారం పెనుబల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలను అమలుపరిచేందుకు లబ్ధిదారులు ఎంపిక ఈనెల ఆరో తారీకు వరకు ప్రభుత్వం ద్వారా లబ్ధిదారులకు అందజేసిన దరఖాస్తులను ఆయా గ్రామాల్లో సంబంధిత అధికారులు సేకరిస్తారన్నారు. రేషన్ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తాసిల్దార్ గంట, ఈఓఆర్‌డి వాల్మీకి కిషోర్, ప్రతాప్, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, జడ్పిటిసి చెక్కిలాల మోహన్‌రావు, కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు, మోరంపూడి బాబురావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, గూడూరు మాధవరెడ్డి, కరిముల్లా, నవజీవన్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

# నేటి నుండి గ్రామ సభల ద్వారా దరఖాస్తుల స్వీకరణ

- ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలో భాగంగా
- రేషన్, ఆధార్ జిరాక్సులు దరఖాస్తుకు జత చేయాలి
- గత దరఖాస్తులు చెల్లవు
- ఇంటింటికీ దరఖాస్తులు ప్రభుత్వమే ఏర్పాటు
- అంగన్వాడీ, గ్రామదీపికలు ఇంటింటి సందర్శన



**నవతెలంగాణ-ఎర్రుపాలెం**

తెలంగాణ రాష్ట్రంలో కొద్ది రోజుల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజులలోపే 6 గ్యారంటీ పథకాలను అమలు పరుస్తామని ఇచ్చిన హామీలో భాగంగా నేటి నుండి 6 గ్యారంటీలకు సంబంధించి ప్రజలకు అవసరమైన పథకాలు ఏమి కావాలో గ్రామ సభల ద్వారా దరఖాస్తులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రకటనతో రాష్ట్ర, జిల్లా, మండల అధికారులు దరఖాస్తుల స్వీకరణకు గ్రామ పంచాయతీలలో గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల నుండి వచ్చే దరఖాస్తుల స్వీకరణకు సమాయత్తం చేశారు. పథకాల అవసరం కోసం ప్రజాపాలన సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఒక పథకం కోసం ఒక్కొక్క దరఖాస్తు వేర్వేరుగా ఇవ్వాల్సిన పని లేదని, ఒకే దరఖాస్తులో అన్ని పథకాలను పొందు పరిచి అందజేయ వచ్చునని అధికారులు తెలిపారు. గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న సదస్సుల కోసం ప్రజా పాలన గ్యారెంటీ దరఖాస్తు నమూనాను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ ఉమ్మడి నమూనా దరఖాస్తును బుధవారం ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో విడుదల చేశారు. అనంతరం రాష్ట్ర వ్యా ప్తంగా అన్ని గ్రామాలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలోని వార్డులకు ప్రొఫార్మాలు చేర వేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

**రెండే పేజీల్లో దరఖాస్తు**

సామాన్య ప్రజలు చాలా సులభంగా అర్థం చేసుకొని, ఐదు నిమిషాలలో నింపేలా దరఖాస్తును రూపొందించారు. మొదటి పేజీలో దరఖాస్తుదారుల వివరాలు, చిరునామా రెండో పేజీలో ప్రభుత్వ అభయ హస్తం గ్యారెంటీ పథకాల లబ్ది పొందడానికి అవసరమైన వివరాలతో ప్రొఫార్మా తయారు చేశారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీలలో తాసిల్దార్ మన్నే ఉష శారద, మండల అభివృద్ధి అధికారి బిక్కంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఏ గ్రామ పంచాయతీలో ఏ రోజు గ్రామ సభ ఏర్పాటు చేయనున్నట్లు ముందుగానే ప్రకటించారు. 28వ తారీకు నుండి ఆరో తారీకు వరకు గ్రామాలలో అంగన్వాడి, గ్రామ దీపికలు ఇంటింటికి తిరిగి దరఖాస్తులను పూరిస్తారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినములు డిసెంబర్ 31వ తారీకు జనవరి ఒకటో తారీకు సెలవు దినాలు మినహాయించి పని చే స్తారని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ప్రతి నెలా 2,500 ఆర్థిక సాయం, 500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకంలో ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇ ళ్లు, చేయూత (దివ్యాంగులకు 6 వేలు, ఇతరులకు 4 వేలు) పథకాలను అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించారు. దరఖాస్తు మొదటి పేజీలో ఎడమ వైపు తెలంగాణ రాష్ట్ర చిహ్నం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో, కుడివైపు అభయహస్తం సింబల్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫొటోను ముద్రించారు. మొదటి పేజీలో దరఖాస్తుదారుని పేరు (ఆధార్ ప్రకారం), తండ్రి/భర్త పేరు, స్త్రీ/పురుషుడు, కులం(ఎస్సీ, ఎస్టీ, బీసీ, జన రల్, మైనారిటీ), పుట్టిన తేదీ (ఆధార్ ప్రకారం), ఆధార్ కార్డు నంబరు, మొబైల్ నంబరు, రేషన్‌కార్డు నంబరు, చిరునామా (ఇంటి నంబరు, వీధి, గ్రామం/వార్డు నంబ రు, మండలం/మున్సిపాలిటీ), జిల్లా, పిన్‌కోడ్ నంబరు వివరాలను ముద్రించారు. దరఖాస్తుదారుని ఫొటో అంటించటానికి గడి వదిలి పెట్టారు. రెండో పేజీలో మహాలక్ష్మి పథకంలో ప్రతి నెల 2,500 ఆర్థికసాయం, 500 గ్యాస్ సిలిండర్ పథకం కోసం గ్యాస్ కనెక్షన్ నంబరు, గ్యాస్ సరఫరా చేస్తున్న కంపెనీ పేరు, సంవత్సరానికి వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్ల సంఖ్య వివరాలను కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటిస్థలం కోసం, గృహజ్యోతి పథకానికి గృహ వినియోగ విద్యుత్తు మీటరు కనెక్షన్ సంఖ్య సేకరించనున్నారు. చేయూత పథకంలో భాగంగా విక లాంగులైతే సదరం సర్టిఫికెట్ నంబరు రాయాల్సి ఉంటుంది. వృద్ధాప్య, వితంతు, గీత- చేనేత కార్మికులు, డయాలసిస్ బాధితులు, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు, బీడీ కా ర్మికుల జీవన భృతి, ఫైలేరియా బాధితులు, ఒంటరి మహిళలు, బీడీ టేకేదారుల జీవన భృతి వివరాలు కోరారు. కొన్నిచోట్ల టిక్ చేయటానికి బాక్సులు పెట్టగా, మరి కొన్ని చోట్ల వివరాలు రాయటానికి గీతలు వదిలి పెట్టారు. ఈ రెండు పేజీల దరఖాస్తును నింపి, సంతకంచేసి, ఫొటోను అంటించి ఆధార్ కార్డు జిరాక్సు, రేషన్‌కార్డు జిరాక్సు కాపీలను జత చేయాల్సి ఉంటుంది. సెల్ నంబరు కూడా తప్పనిసరి రాయాల్సి ఉంటుంది. ఒకవేళ రేషన్ కార్డు లేకపోతే కార్డు లేదని రాసి దరఖాస్తులో రా యాలి, దరఖాస్తును స్వీకరించాక అధికారులు రసీదు ఇస్తారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎప్పటికప్పుడు దరఖాస్తుల వివరాలను క్రోడీకరించి ఆన్‌లైన్ చేస్తారు. గ్రామసభల ప్రారంభానికి ముందే ప్రొఫార్మాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారులకు ఆదేశాలు అందాయి. జిల్లా, డివిజన్ స్థాయిలో నిర్వహించే సన్నాహక సమావేశాలు నేటితో ముగిశాయి. ఇప్పటికే ప్రభుత్వం నుండి పథకాలు పొందే లబ్ధిదారులైతే దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయబోతున్న కొత్త పథకాలకే దరఖాస్తులు సమర్పించాల్సి ఉం టుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి అమలులో ఉన్న పథకాలలో లబ్ధిదారులు ఎవరైనా ఉంటే మళ్లీ దరఖాస్తు పెట్టుకోవలసిన అవసరంలేదు. వృద్ధాప్య, వితంతు, గీత- చేనేత- బీడీ కార్మికులు, డయాలసిస్ బాధితులు, బీడీ టేకేదారులు, ఫైలేరియా బాధితులు, ఒంటరి మహిళలు ఇదివరకే పింఛను తీసుకునేవారు, కొత్తగా దరఖాస్తులు అందించవలసిన అవసరం లేదు. కొత్తగా చేయూత పథకం కింద పింఛను కావాలను కుంటే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పింఛను కోసమో, ఇళ్ల కోసమో దరఖాస్తు చేసుకొని ఉన్నవారు వాటిని పరిగణనలోకి తీసుకోరు. కొత్తగా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తెల్ల రేషన్ కార్డులు ఉన్న వారు మాత్రమే గ్యారెంటీలకు అర్హులనే ప్రచారంలో వాస్తవం లేదని, పథకాలకు అర్హులమని భావించిన వారంతా దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. కొత్త రేషన్ కార్డులిచ్చే ఆలోచన ప్రభుత్వానికి ఉందని, కార్డులు లేని వా రు ఇప్పటికే ఉన్న కార్డులలో కుటుంబ సభ్యుల పేర్లు చేర్పించాలనుకునే వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. ప్రజా పాలనలో పౌరుల నుంచి స్వీకరించే దరఖాస్తులతో డేటా సేకరిస్తామని, ఆ తర్వాతే ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి మార్గదర్శకాలు రూపొందిస్తామని పేర్కొన్నారు. గతంలో రెండు పడకల ఇళ్లు పొందిన లబ్ధిదారుల విషయంలో ఏవైనా ఫిర్యాదులు వస్తే, వెరిఫికేషన్ చేస్తామని స్పష్టం చేశారు. కావల సిన పథకాల కోసం ప్రజలు నేటి నుండి దరఖాస్తు చేసు కోవచ్చని తెలిపారు.

## అభయహస్తం పై ఉన్న భయాందోళనలు నివృత్తి చేయాలి

- గ్రామ, వార్డు సభలు ద్వారా దరఖాస్తులు స్వీకరణ అభినందనీయం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు

**నవతెలంగాణ-వైరాటౌన్**



అభయహస్తం దరఖాస్తులు స్వీకరణ గ్రామ, వార్డు సభలు ద్వారా స్వీకరణ అభినందనీయం.. కానీ ప్రజల్లో ఉన్న భయాందోళనలు నివృత్తి చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. బుధవారం వైరా మండలం పాలడుగు సీపీఐ(ఎం) గ్రామశాఖ సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో భాగంగా గ్రామసభలు, మున్సిపాలిటీ పరిధిలో వార్డు సభలు నిర్వహించి ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరణను సిపిఐ(ఎం) స్వాగితిస్తుందన్నారు. అదే క్రమంలో ఆధార్ కార్డు, రేషన్‌కార్డు కీలకమైన ఆధారంగా ప్రభుత్వం ప్రకటించిన విషయం పునః ఆలోచన చేయాలని కోరారు. కొందరికి ఆధార్, రేషన్‌కార్డులు లేవని, మరికొందరు ఆధార్ అడ్రస్, నివాస ప్రాంతం వేరు వేరుగా ఉంటే ఎక్కడ దరఖాస్తు చేయాలో అర్థం కాక భయాందోళనలో ఉన్నారని, రైతులు భూములు వేరు వేరు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్నాయని, మహిళలకు తమ పుట్టింటి వారు ఇచ్చిన భూములు ఒక్క గ్రామంలో ఉంటే మరో గ్రామంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డులు ఉన్నాయని, రైతు భరోసాకి ప్రత్యేక దరఖాస్తులు స్వీకరణ కాకుండా గత ప్రభుత్వం రైతు బంధు మంజూరు చేసిన విధంగానే రెవెన్యూ రికార్డుల ఆధారంగా రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు మంజూరు వెంటనే చేయాలని కోరారు. సోంత స్థలం ఉన్న దగ్గర ఇందిరమ్మ ఇండ్లు దరఖాస్తు చేయాలా లేక ఆధార్ అడ్రస్‌లో చేయాలా స్పష్టతా ఇవ్వాలని, కిరాయి ఇండ్లలో నివాసం ఉంటున్న వారికి గృహ జ్యోతి దరఖాస్తు చేయాలా లేక స్వంత ఇల్లు ఉన్నవారే చేయాలా మొదలగు అంశాలపై ప్రజల్లో ఉన్న గందరగోళం తొలిగించి అర్హత కలిగిన వారందరికీ అభయహస్తం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మండల సిపిఐ(ఎం) సినీయర్ నాయకులు వనమా చిన్న సత్యనారాయణ, సిపిఐ(ఎం) మండల కార్యదర్శివర్గ సభ్యులు బాజోజు రమణ, శాఖ కార్యదర్శి ఎస్‌కె.మజీద్, మండల కమిటీ సభ్యులు ఎస్‌కె. షైనాబీ, అబ్దుల్ రెహమాన్, రహైనా, మజీద్ బీ, మౌలాలి, బొల్లం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) సానుభూతిపరుడు నున్నా రమణ మృతికి తమ్మినేని నివాళ్ళు

**నవతెలంగాణ-ఖమ్మం**



సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సోదరుడు, జిల్లా కమిటి సభ్యులు బండి పద్మ సోదరుడు, సీపీఐ(ఎం) సానుభూతిపరుడు నున్నా రమణ సోమవారం గుండెపోటుతో మరణించారు. బుధవారం ఖమ్మంలోని బైపాస్ రోడ్‌లో గల ఆయన స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నున్నా రమణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గతంలో వామపక్ష విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. అంతేకాకుండా జిల్లా, రాష్ట్రస్థాయిలో కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయనకు నివాళు లర్పించిన వారిలో ఎంఎల్.న్యూడెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి గాదె మాధవరెడ్డి, న్యూడెమోక్రసీ కేంద్ర కమిటి సభ్యులు నెల్లిమర్ల ప్రసాద్, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి పరకాల నాగయ్య, మాజీ ఎంఎల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పోన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, ఎం.సుబ్బారావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, చింతల చెర్వు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, పి.ఝాన్సీ, ఆర్.ప్రకాష్, పిన్నింటి రమ్య, టి.విష్ణు, ఎం.ఎ.జబ్బార్, దొంగల తిరుపతిరావు తదితరులు నివాళులర్పించారు.

## మోసపూరిత పథకాలతో కాంగ్రెస్ అధికారంలోకొచ్చింది

- మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్

**నవతెలంగాణ-వైరాటౌన్**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరితమైన గ్యారెంటీ పథకాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ విమర్శించారు. బుధవారం వైరా నియోజకవర్గ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బానోత్ మదన్ లాల్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ఓటమికి పార్టీ కార్యకర్తలు నిరాశ పడవద్దని, రాబోయే పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రజా పరిపాలన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరి చేత దరఖాస్తు చేయించాలని కోరారు. వంద రోజుల్లో పథకాలు అమలు చేయకపోతే అధికార పార్టీకి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే అప్పులు చేశారనే పేరుతో గ్యారంటీ పథకాల అమలు చేయకుండా తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో 50 లక్షల కోట్ల విలువైన అభివద్ధి చేసి చూపించారన్నారు. కాంగ్రెస్ పార్టీ పనితీరు మరో ఆరు నెలల్లోనే తెలిసిపోతుందని, రాబోయే స్థానిక సంస్థలు, పార్లమెంటు ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శభాష్ ఖమ్మం టీమ్

- క్రీడా స్ఫూర్తితోనే.. ఈ ఫలితాలు
- విజేతలకు డాక్టర్ కూరపాటి అభినందనలు
- కూరపాటికి ఘన సత్కారం

**నవతెలంగాణ-ఖమ్మం**



ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు మహిళా క్రికెట్ టోర్న మెంట్‌తో వచ్చిందంటే.. అంతటి కృషికి నిదర్శనం ఒక చిన్న పిల్లల వైద్యులు..యావత్ భారత దేశంలోని అన్ని రాష్ట్రాలు సైతం తెలంగాణలోని ఖమ్మం వైపు చూశయంటే.. క్రీడాకారులగడ్డ.. ఉద్య మగుమ్మం..క్రీడాకారులకు కేరాఫ్... సర్దార్ పటేల్ స్టేడియమే...టీ 20 మహిళా క్రికెట్ టోర్న మెంట్‌తో అంతటి గుర్తింపును తీసుకొచ్చిన ఆదర్శ నీయుడు మన డాక్టరే.. ఇంతకీ ఆ డాక్టర్ ఎవరనేదే కదా మీ సందేహం.... మన డాక్టర్ కూరపాటి ప్రదీపే.. గత 4 రోజులుగా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో క్రికెట్ నెట్ సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్సెస్, అకాడమీ ఫర్ క్రికెట్ ఎక్స్ పర్టిస్ మధ్య ఐదు లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. ఏసీఎల్ జట్టుపై ఖమ్మం ఘన విజయం సాధించింది. ఈమేరకు ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్ గెలిచిన టీమ్‌కు ట్రోఫీని అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రీడాకారులు డాక్టర్ కూరపాటిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ్ వేనురెడ్డి, ఎల్లయ్య శివ పాల్గొన్నారు.

## సంత ఆలయ అభివృద్ధికి ఆటంకాలు సృష్టించవద్దు

- సంత ఆలయ చైర్మెన్ అడ్డగోడ ఐలయ్య

**నవతెలంగాణ-కారేపల్లి**



దేవాదాయధర్మధాయశాఖ ఆధ్వర్యంలోని కారేపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి(సంత) ఆలయ అభివృద్ధికి అధికారులు ఆటంకాలు సృష్టించవద్దని సంత ఆలయ చైర్మెన్ అడ్డగోడ ఐలయ్య కోరారు. బుధవారం ఆలయం ప్రాంగణలం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వస్తే ఆలయ మేనేజర్ నల్లమోతు శేషయ్య అడ్డుచెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఆలయం చుట్టు ప్రహరి నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నారని దానిలో దృష్టిలో ఉంచుకోని ప్రహరీ నిర్మాణ అనుమతులకు ఉంచుకోని దేవాదాయ శాఖకు దరఖాస్తు చేశామన్నారు. దానిపై అధికారులు ఇంతవరకు స్పందించక పోవటం విచారకరమన్నారు. దేవాలయ అభివృద్ధికి దాతల ఇచ్చే విరాళాలకు తగిన రశీదులు అందజేస్తామన్నారు. అధికారులు ఆలయం అభివృద్ధికి సహకరించాలే తప్ప అడ్డుకునే ప్రయత్నం చేయవద్దన్నారు. సంత ఆలయం క్రింద సింగరేణి రెవిన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెం.,197 య.3.05 కుంటలు, సర్వేనెంబర్ 202లో య.1.05 కుంటలు మొత్తం య.4.10 కుంటల భూమి ఉందని దానిలో కొంత అక్రమణలకు గురువతుందన్నారు. ఆలయాన్ని, ఆలయ భూములను అధికారులు కాపాడే ప్రయత్నం చేయాలని, భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలన్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా సంత ఆలయ అభివృద్ధికి పాలకవర్గం కట్టుబడి పని చేస్తుందన్నారు.

## పీఎస్ఆర్ ట్రస్టు సేవలు అభినందనీయం

- జిల్లా విద్యాశాఖాధికారి సోమశేకర శర్మ

**నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్**




ఉన్నత చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులకు పరిశ సీతారత్నం ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయం, చిరస్మరణీయమని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ తెలిపారు. బుధవారం ఖమ్మంలోని రిక్కాబజార్ ఉన్నత పాఠశాలలో ఓ కార్యక్రమంలో ఐఐటి, ఎటి లో ప్రవేశం పొందిన ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత చదువులు అభ్యసించేందుకు ట్రస్టు అందిస్తున్న ఆర్థిక సాయం వెలకట్టలేనిదన్నారు. 36 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా సేవలు అందించిన పరిశ పుల్లయ్య విద్యార్థులకు చేస్తున్న కృషి సర్వత్రా ప్రశంసలు పొందుతుందన్నారు. కారేపల్లి మండలం మాణిక్యారంకు చెందిన భూక్యా హేమశ్రీ (ఎస్ఐటి గోవా), ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన మాలోత్ సిద్ది వినాయక్ (ఐఐటి గాంధీ నగర్), ఖమ్మం ఖానాపురంకు చెందిన అంగోతు శ్రావణ్ కుమార్ (ఐఐటీ రూర్కే)కు ఒక్కొక్కరికి రూ. 15వేల చొప్పున రూ. 45 వేలు ఆర్థిక సాయం అందించారు. డిసిఈబి కార్యదర్శి ఎం.నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మెన్ పరిశ పుల్లయ్య హెచ్‌ఎం శాంత, అజితకుమారి, సిసి మాధవరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ చలాన్లపై రాయితీని వినియోగించుకోండి : ఎస్సై రామారావు

**నవతెలంగాణ-కారేపల్లి :** తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ ట్రాఫిక్ చలానలపై 90శాతం వరకు రాయితీ ప్రకటించిందని వాహన దారులు దానిని వినియోగించుకోవాలని కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు కోరారు. బుధవారం కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తెలియక ట్రాఫిక్ రూల్స్ అత్రికమించి జరిమాన బారిన పడ్డారన్నారు. వారికి ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నింబధనలు పాటిస్తే అందరికి క్షేమకరంగా ఉంటుందన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ భద్రతకు ప్రాధాన్యత ఇచ్చి ప్రయణించాలని కోరారు.

## డీసీసీబీ బ్యాంక్ డ్రైవర్ విజయ్ మృతి

- డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం సంతాపం

**నవతెలంగాణ-తల్లాడ**

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ్(38) కొణిజర్లలో జరిగిన యాక్సిడెంట్లో ప్రమాదవశాత్తు మంగళవారం రాత్రి చనిపోయారు. విజయ్ పార్థివ దేహానికి డీసీసీబీ చైర్మెన్ కూరాకుల నాగభూషణం పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో రెహమాన్, కురవల్లి పీఎసిఎస్ చైర్మన్ ప్రదీప్ రెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దకే దరఖాస్తులు

- ప్రజా పాలన కార్యక్రమంపై అవగాహన

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**

మండల పరిషత్ కార్యాలయం నందు మండల స్పెషల్ ఆఫీసర్ వేణు మనోహర్, ఎంపీపీ దేవరకొండ శిరీష అధ్యక్షతన ప్రజా పాలన కార్యక్రమంపై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశం లో జెడ్పీటీసీ శీలం కవిత పాల్గొన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీలలో ఈ నె ల 28 నుండి జనవరి 6 తేదీ వరకు ప్రజల దగ్గర నుంచి 6 గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంపై అధికారులకు ప్రజాప్రతినిధులకు వివరించారు. లబ్ధిదారుల నుండి దరఖాస్తులను గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు ఐకెపి సిబ్బంది చేత దరఖాస్తులను ప్రతి ఇంటికి నేరుగా పంపించబడుతుందని అన్నారు. లబ్ధిదారులకు దరఖాస్తు పూర్తి చేయడం రాకపోతే సంబంధిత అంగన్వాడీ టీచర్, గ్రామ దీపికలు పూర్తి చేస్తారని అన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను గ్రామ సభలలో స్వీకరించ పడుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బెక్కంటి శ్రీనివాసరావు, తాసిల్దార్ మన్నె ఉషా శారద, మండల పంచాయతీ అధికారి గంధం శ్రీలక్ష్మి, మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన గ్రామ పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధి కారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## 28 నుండి 31 వరకు
## ఎస్‌ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నవతెలంగాణ-ఖమ్మం**




జిల్లాలోని 28 నుండి 31 వరకు ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ తెలిపారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాల సారథి ఎస్ఎఫ్ఐ స్వాతంత్రం ప్రజాస్వామ్య సోషలిజం ఆశయాలతో అధ్యయనం పోరాటం అనే నినాదాలతో 1970వ సంవత్సరంలో కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రం అనే ప్రాంతంలో డిసెంబర్ 30, 31 తేదీల్లో ఏర్పడిందని చెప్పారు. ఎస్ఎఫ్ఐ ఏర్పడి 53 ఏళ్ల పూర్తి చేసుకొని 54 వసంతంలో అడుగుపెడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ 54 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వ్యాసరచన పోటీలను, ముగ్గులు పోటీలు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం విద్యారంగ సమస్యలే ధ్యేయంగా విద్యార్థులతో మమేకమవుతూ అలు పెరగని పోరాటాలు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ 54 వసంతంలో అడిగిడుతున్నందుకు విద్యార్థులు అందరూ సంబరాలు నిర్వహించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షురాలు పర్వీన్, జిల్లా సహాయ కార్యదర్శి సాయి, రాజు, వీరేందర్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన నిర్వాహణకు సిద్ధం

- ఏర్పాట్లల్లో నిమగ్నమైన అధికారులు

**నవతెలంగాణ-వైరా**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రజా పాలన ఈ నెల 28న ప్రారంభం కానున్నది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రతి కుటుంబానికి దరఖాస్తు ఫారం ముందుగానే అందించాలని, అందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఆ పరిధిలో ఉండే సిబ్బంది ద్వారా దరఖాస్తు ఫారాలు అందించాలని, ఏ ఒక్కరి నుండి ఫిర్యాదు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ స్థాయి సిబ్బంది కి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ కరుణాకర్ రెడ్డి, మండల నోడల్ అధికారి కస్తాల సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి ఎస్ పవన్ కుమార్, మండల పంచాయతీ అధికారి జ్యోస్నా దేవి, ఎంఈఓ కె వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉదయశ్రీ, డిపిఎం, ఏఈఓలు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం విజయవంతం

**నవతెలంగాణ-బోనకల్**

మండల పరిషత్ కార్యాలయం ముందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు, మండల యువత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ రక్తదాన శిబిరానికి యువత, వివిధ గ్రామాల నుంచి నాయకులు పాల్గొని తమ మానవతాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ పైడిపల్లి కిషోర్ కుమార్, జడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబు రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేశారు.ఈ సందర్భంగా మోదుగు సుధీర్ బాబు మాట్లాడుతూ నిత్యం ఎంతోమంది రక్తం దొరకక తనువు చాలిస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఏడాదిలో రెండుసార్లు రక్తదానం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో బయారపు అశోక్ అశోక్, గిరిదావర్ గుగులోతు లక్ష్మణరావు వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఇరుగు నవీన్, తగరం రమేష్, మండల వైస్ ఎంపీపీ గుగులోతు రమేష్, మహేష్, సాయికిరణ్, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసు నమోదు

**నవతెలంగాణ-ఖమ్మం రూరల్**

ఓ ఇంటి తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డ ఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ లో బుధవారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలో పెద్దతండా పంచాయతీ టీఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్న వేణు ఈనెల 23న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ వరంగల్ వెళ్లారు. 25న రాత్రి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా సుమారు రూ.25 వేల విలువ గల 9గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిసింది. సంఘటనపై బాధితుడు వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## డాక్టర్ కావ్యచంద్ యలమూడికి
## ఉమెన్ ఆఫ్ 2023 అవార్డు

- జాతీయ స్థాయి పురస్కారం పట్ల హర్షం

**నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్**




నగరంలోని కావ్య హాస్పిటల్ లో వైద్యరంగంలో ఎండోక్రినాలజీ, మధుమేహం, జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్ విభాగాల్లో అందిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అత్యాధునిక వైద్య సేవలకు గాను బిజినెస్ మింట్ వారు ప్రకటించిన జాతీయ అవార్డులో కావ్య హాస్పటల్ డాక్టర్ కావ్యచంద్ యలమూడికి ఉమెన్ ఆఫ్ 2023 అవార్డు దక్కింది. జాతీయ స్థాయిలో కూడా పురస్కారం లభించింది. భారతదేశం అంతటా ఈ అవార్డుకు 14 మంది మహిళలకు ఎంపిక కావటం మెచ్చుకోదగిన విషయం అని కావ్య హాస్పిటల్ సీఈవో డాక్టర్ కావ్యచంద్ తెలిపారు. అనంతరం కావ్య హాస్పిటల్స్ చైర్మన్ రవీందర్ యలమూడి, ప్రసూన పారుపల్లి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## బోనోఫిక్స్ మత్తులో యువత

- అధికారులు స్పందించండి

**నవతెలంగాణ-తల్లాడ**

మండల కేంద్రంలో గత కొంతకాలంగా బోనాఫిక్స్ మత్తుకు విద్యార్థులు, యువకులు ఎక్కువగా అలవాటు పడ్డారు. ఇళ్లల్లో ఇచ్చే పాకెట్ మనీతో బోనోపిక్స్ కొనుగోలు చేసి, దానిని పీల్చి మత్తులో మునిగిపోతున్నారు. విద్యార్థులు పాలిథిన్ కవర్స్‌లో బోనోఫిక్స్ రబ్ చేస్తూ శ్వాస ద్వారా, పిలుస్తూ మత్తులో తేలి ఆడుతున్నారు. పాఠశాలల పరిధిలోని ఫాన్సీ షాపులు, మందుల షాపులలో బోనఫిక్స్ విద్యార్థులకు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. విద్యార్థులు మత్తులో జోగుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి విద్యార్థులకు వాటిని అందుబాటులో లేకుండా చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన ఆవశ్యకత ఉంది. సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి. అధికారులు స్పందించి కట్టడి చేస్తారని ఆశిద్దాం. పాఠశాలల యాజమాన్యాలు దీనిపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉంది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోత్రంగా మారే అవకాశం ఉంది.

# 20 క్వింటాళ్ల పత్తి దగ్ధం

- రూ.1.20 లక్షల పంట నష్టం
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన సీఐ, ఎస్ఐలు

**నవతెలంగాణ-బోనకల్**



ఇంట్లో నిల్వ ఉంచుకున్న ఓ కౌలు రైతుకు చెందిన పత్తికి గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో దాదాపు 20 క్వింటాళ్ల వరకు పత్తి పూర్తిగా దగ్ధమైంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోనే గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన ఏసుపోగు వెంకటేశ్వర్లు 20 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశాడు. ఈ 20 ఎకరాలలో వచ్చిన పత్తిని తన ఇంటికి సమీపంలోనే ఓ ఇంటిని కిరాయికి తీసుకొని నిల్వ చేశాడు. సుమారు 60 క్వింటాళ్ల వరకు ఆ ఇంట్లో పత్తిని నిల్వ చేశాడు. అయితే మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులకు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీంతో ఇంట్లో గల పత్తికి మంటలు వ్యాపించాయి. తలుపులు, దర్వాజా పూర్తిగా కాలిపోగా పత్తి సుమారు 20 కింటాళ్ల వరకు దగ్ధమైంది. బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఇంట్లో నుంచి దట్టమైన పొగ వస్తుండటంతో చుట్టుపక్కల వారు గమనించి రైతుకు సమాచారం అందించారు. దీంతో వెంకటేశ్వర్లు తన భార్యను తీసుకొని హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్ళాడు. అప్పటికే పత్తి చాలా వరకు దగ్ధమై ఉంది. చుట్టుపక్కల వారికి విషయం చెప్పడంతో అందరూ వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. 60 క్వింటాళ్ల పత్తిలో సుమారు 20 క్వింటాళ్ల వరకు కాలిపోయిందని రైతు తెలిపాడు. ప్రస్తుతం క్వింటాళ్ల 6వేల వరకు ఉందని 20 క్వింటాళ్ల పత్తి దగ్ధం కావడంతో సుమారు ఒక లక్ష 20 వేల రూపాయల పంట నష్టం జరిగినట్లు రైతు వాపోయాడు. స్థానిక పోలీస్ స్టేషన్లో సంఘటనపై ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. మధిర సీఐ జానోట్ వసంత కుమార్, ఎస్సై బొల్లెద్దు సాయికుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సంఘటనపై రైతుతోపాటు చుట్టుపక్కల వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటన స్థలం వద్ద అగ్గిపెట్టె, పెట్రోల్ డబ్బా ఉన్నట్లు గుర్తించారు. మూడు రోజుల క్రితం గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన కొంతమంది తన పత్తి పంటను దగ్ధం చేయాలని మాట్లాడుకున్న ఆడియో రికార్డు తనకు దొరికిందని ఆ వివరాలను కూడా తాను పోలీసులకు అందజేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా సంఘటన స్థలాన్ని టీపీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, జెడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబు పరిశీలించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

## ప్రతీ ఇంటికి దరఖాస్తులు పంపిణీ జరగాలి

- ఆర్డీవో గుంటుపల్లి గణేష్

**నవతెలంగాణ - బోనకల్**




గ్రామసభల కంటే ముందే ప్రతి ఇంటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కింద చేపట్టిన అభయహస్తం దరఖాస్తులను అధికారులు, సిబ్బంది అందజేయాలని ఖమ్మం ఆర్డిఓ గుంటుపల్లి గణేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలనపై మండల స్థాయి అధికారులకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సులో గుంటుపల్లి గణేష్ మాట్లాడుతూ దరఖాస్తులను ప్రతి ఇంటికి తప్పనిసరిగా సంబంధిత అధికారులు ముందు రోజే అందజేయాలన్నారు. ఒకే దరఖాస్తు ఫారంలో ఐదు పథకాలకు సంబంధించిన వివరాలు ఉంటాయని ఆయన తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను గ్రామసభలో అధికారులు స్వీకరిస్తారని చెప్పారు.

ఒకే కుటుంబంలో వేరువేరుగా రెండు మూడు కుటుంబాలు ఉన్న వారందరికీ తప్పనిసరిగా దరఖాస్తులు అందజేయాల్సిందేనన్నారు. దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఒక పాస్ ఫోటో జత చేయాలని సూచించారు. దరఖాస్తుదారుడికి రేషన్ కార్డు లేకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. రేషన్ కార్డు లేనందున దరఖాస్తు తీసుకోబోమని సంబంధిత సిబ్బంది గానీ, అధికారులు గానీ తిరస్కరించడానికి వీలు లేదన్నారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఈ ప్రజా పాలనలో గ్రామసభలలో కలిగించటం జరిగిందన్నారు. దరఖాస్తుదారులు ఏ పథకానికి అర్హుడు కాదని గ్రామసభలో అధికారులు తేల్చే అర్హత లేదన్నారు. గ్రామసభల అనంతరం దరఖాస్తులను మండల పరిషత్తు కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయాలకు సంబంధిత అధికారులు అందజేయవలసి ఉంటుందన్నారు. అన్ని దరఖాస్తులను ఆన్లైన్ చేయడం జరుగుతుందన్నారు. ఆన్లైన్ అనంతరం రాష్ట్ర ప్రభుత్వమే ఏ పథకానికి ఎవరు అర్హులు స్పష్టం చేస్తుందని స్పష్టం చేశారు. గ్రామ సభ అధికారులకు ఏ పథకానికి ఎవరు అర్హులను నిర్ధారించే హక్కు గాని అర్హతగాని లేదని స్పష్టం చేశారు. గ్రామ సభలు నిర్వహించే సమయంలో, దరఖాస్తులు స్వీకరించే సమయంలో వివాదాలకు తావు లేకుండా, ప్రజల నుంచి వివాదాలు రాకుండా సంబంధిత అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తమకు దరఖాస్తు ఇవ్వలేదని ఏ ఒక్కరూ ఫిర్యాదు చేయటానికి వీలు లేదన్నారు. ఒకే దరఖాస్తు ఫారంలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పథకముల కొరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారంలో ఇచ్చిన అన్ని అంశాలను పూర్తి చేయాలని ఒకవేళ దరఖాస్తుదారులు పూర్తి చేయని ఎడల సంబంధిత అధికారులు వాటిని పూర్తి చేయలని సూచించారు. గ్రామ సభ రోజు ఆ గ్రామస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధులు అందరిని గ్రామ సభకు ఆహ్వానించాల్సిందేనని స్పష్టం చేశారు. తహసిల్దార్ అనిశెట్టి పొన్నం చందర్ మండల స్పెషల్ ఆఫీసర్ వెంగమాంబ ఎంపీడీవో బయ్యారపు అశోక్ జడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు మాట్లాడారు. సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని సర్వశుద్ధి సరిత విద్యుత్ ఏఈ దొండేటి ఉమామహేశ్వరరావు, ఐకెపి ఎపిఎం యద్దనపూడి పద్మలత, డిప్యూటీ తాసిల్దార్ తిరుమల కరుణాకర్, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి రెడ్డి, గిరిధావర్ గుగులోతు లక్ష్మణ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ వీరభద్రమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్, సర్పంచులు భాగం శ్రీనివాసరావు, మర్రి తిరుపతిరావు, కేతినేని ఇందు, నోముల వెంకట నరసింహ, ఆళ్ల పుల్లమ్మ, బుక్య సైదా నాయక్, మలకారపు రవి, నన్నక లక్ష్మి, ఎంపీటీసీ కర్లకుంట దేవమణి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రేషన్ షాప్ డీలర్లు, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలి




**ముదిగొండ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల చేసే ప్రజా పాలన గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని ఎంపిడివో విడివి అశోక్ కుమార్ అన్నారు. ముదిగొండ రైతువేదికలో ప్రజాపాలన గ్రామసభల అవగాహన సమావేశం ఎంపిపి సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరాలు సక్రమంగా నింపి దరఖాస్తులను ఇవ్వాలని కోరారు. దరఖాస్తులు ఉచితంగా అందజేయున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ముదిగొండ మండల జడ్పీటిసి సభ్యురాలు పసుపులేటి దుర్గ, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి(డిటిడబ్ల్యూఓ), ఎంపిఓ పి.సూర్యనారాయణ, తహసీల్దార్ వై.రామారావు, ఏవో మందుల రాధ, ఎస్సై గజ్జెల నరేష్ వైద్యాధికారులు అంకం అరుణాదేవి, కె ధర్మేంద్ర పశువైద్యాధికారి పి.అశోక్, సిడిపిఓ కమలప్రియ, ఈజీఎస్ ఏపిఓ రంగనాయకమ్మ,ఎన్ఎస్పి డిఈ రాంబాబు, ఎంఈఓ బాణాల వెంకటరామాచారి, తదితరులు పాల్గొన్నారు.



**ఖమ్మం రూరల్ :** ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం ఆరు గ్యారంటీల అమలు కోసం స్వీకరించనున్న దరఖాస్తులలో మధ్యదళారీలకు తావు లేదని పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజేశ్వరీ అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంపై మండల పరిధిలో నాయుడుపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండలంలోని అన్ని శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరీ మాట్లాడారు. ని రక్షరాస్యులు ఉంటే వారి కోసం దరఖాస్తులను పూర్తి చేయడానికి పంచాయతీల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటకృష్ణ, ఎంపీఓ రాజారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోండి

- ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ పత్రాలు అవసరం లేవు
- ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు.

**నవతెలంగాణ-తల్లాడ**

ప్రజా పాలన కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రజాపాలన సమావేశాలలో ఆరు గ్యారెంటీ లకు దరఖాస్తులు స్వీకరిస్తారని కొత్త రేషన్ కార్డులు మినహా మిగిలిన పథకాలు అయిన మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, తదితర పథకాలకు దరఖాస్తులు అధికారులు స్వీకరిస్తారన్నారు. కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మాత్రమే అవసరమని ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవికుమార్, ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల అమలు దిశగా ప్రభుత్వం

**నవతెలంగాణ-ఖమ్మం**

ఆరు గ్యారంటీల అమలు దిశగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించి దరఖాస్తులు బుధవారం సాయంత్రం ప్రజలకు అందుతాయని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుండి ప్రారంభం అయ్యే ప్రజా పాలన కార్యక్రమంలో గ్రామ, వార్డు సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ, వార్డు సభలు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలు, తిరిగి మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జనవరి 6 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సభల నిర్వహణ విషయమై ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇస్తామని, దరఖాస్తులు పూరించి, ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో గ్రామ, వార్డు సభలలో సమర్పణకు ప్రజలు సిద్ధంగా ఉండాలని కోరారు.

## హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించిన నేషనల్ క్వాలిటీ ఎస్సెస్మెంట్ టీం

**నవతెలంగాణ-తల్లాడ**

ముద్దునూరు హెల్త్ వెల్నెస్ కేంద్రాన్ని బుధవారం నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ టీం సభ్యులు అఖిల అన్సారీ, సునీల్ కుమార్, శ్రీ వాత్సవ, సందర్శించారు. హెల్త్ వెల్నెస్ సెంటర్ ద్వారా అందించే సేవలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. హెల్త్ వెల్నెస్ కేంద్రం నుండి ప్రజలకు అందించే సేవలు స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. డాక్టర్ రత్న మనోహర్, జిల్లా కమిటీ మేనేజర్ ఉపేంద్ర, పల్లె దవాఖాన వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, మహేశ్వరరావు, హెల్త్ సూపర్వైజర్ భాస్కర్, పెద్ద పుల్లయ్య, మేరమ్మ, భద్రమ్మ వసంతకుమారి, ఎమ్మెల్ హెచ్‌పిలు త్రివేణి కుమారి, రాజశ్రీ, పాల్గొన్నారు.

## భగీరథకు లీక్.. వృథాగా పోతున్న నీరు

**నవతెలంగాణ-కల్లూరు**

మిషన్ భగీరథ పైపు లీకులతో తాగు నీరంతా వృథాగా పోతోంది. పట్టణ పరిధిలోని ఖాన్‌ఖాన్ పేట కెనరా బ్యాంక్ పక్కన గత పది రోజుల నుండి పైపు లీకై తాగునీరు కాలువలకు పోతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదని ప్రజల ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవటం లేదని ఆరోపించారు. సంఘటన ప్రధాన రహదారి పక్కన జరిగినప్పటికీ పట్టించుకోకపోతే మారుమూల గ్రామాల్లో ఏం పట్టించుకుంటారని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఖాన్ ఖాన్ పేట ప్రజలు కోరుతున్నారు.






## జాతీయస్థాయి బ్యాడ్మింటన్‌కు త్రివేణి విద్యార్థి

**నవతెలంగాణ-ఖమ్మం**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో జరిగిన అండర్ 14 బాల బాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలలో త్రివేణి పాఠశాలకు చెందిన అబ్బూరి వినయ్ జాతీయస్థాయిలో జరిగే పోటీలకు జిల్లా జట్టు నుంచి ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయిలో అబ్బూరి వినయ్ బచ్చు విశ్వతేజతో కలిసి తృతీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ విజేతలను అభినందించారు. జాతీయస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతి పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీసీ గురుకుల ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా 'లెవిన్ స్టన్'

**నవతెలంగాణ - బోనకల్**



టీఎస్ యుటిఎఫ్ అనుబంధ బీసీ గురుకుల ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా బోనకల్ బీసీ వెల్ఫేర్ ఉపాధ్యాయుడు లెవిన్ స్టన్ ఎన్నికయ్యారు. లెవిన్ స్టన్ గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే బిసి సంక్షేమ గురుకుల విద్యాలయాల పనివేళలను ఇతర సంక్షేమ గురుకుల విద్యాలయాలతో సమానంగా మార్పు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ( టిఎస్ యుటిఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి డిమాండ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు అనుకూలంగా పనివేళలు మార్చినప్పటికీ, బిసి గురుకులాల్లో మార్చకుండా ఏకపక్ష వైఖరితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీసీ గురుకుల ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఎస్ శ్రీజన అధ్యక్షతన జరిగిందన్నారు. టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారని తెలిపారు. గురుకుల ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని, శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలని, పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని తదితర తీర్మానాలను సమావేశం ఆమోదించినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

**టీఎస్ యుటిఎఫ్ బిసి గురుకుల ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర కమిటీ:**

టీఎస్ యుటిఎఫ్ బిసి గురుకుల ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా ఎస్ శ్రీజన, ప్రధాన కార్యదర్శిగా లెవిన్ స్టన్ ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.కోశాధికారి గా కె ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా జె రామకృష్ణ, సిహెచ్ సతీష్, వి మురళి, ఎ అరుణాదేవి, వి స్వర్ణలత, బి రమేష్ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యదర్శులుగా జి రమేష్, ఎస్ సునీల్, సిహెచ్ కృష్ణయ్య, ఆర్ మధు, వి లింగరాజు, లావణ్యలతో పాటు మరో 15 మందిని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కోశాధికారి వల్లం కొండ రాంబాబు, జిల్లా నాయకులు సధాబాబు, బోనకల్ మండల అధ్యక్షులు భూపతి ప్రీతమ్, ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకష్ణ, కోశాధికారి కే రమేష్ ఉపాధ్యక్షులు ఎంసిఆర్ చంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షురాలు కే .సౌభాగ్య లక్ష్మి హర్షం వ్యక్తం వ్యక్తం చేస్తూ, వారికి అభినందనలు తెలిపారు.

## సింగరేణి ఎన్నికల ప్రచారంలో భద్రాచలం నాయకత్వం

**నవతెలంగాణ భద్రాచలం రూరల్**

సింగరేణి గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భద్రాచలం పట్టణానికి చెందిన సిఐటియు నాయకత్వం చురుగ్గా పాల్గొని సిఐటియు విధివిధానాలను కార్మికులకు తీసుకెళ్లడంలో కృషి చేశారు. ఎన్నికల ప్రచారంలో వ్యవసాయ కార్మిక సంఘం సీఐటియు నాయకులు గడ్డం స్వామి, ఎర్రంశెట్టి వెంకట రామారావు, భూపేంద్ర అజయ్ కుమార్, తదితరులు పాల్గొని కార్మిక సమస్యలపై పోరాడే సిఐటియూని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వ్యకాస నాయకులు గడ్డం స్వామి మాట్లాడుతూ సిరుల తల్లి సింగరేణిని పాలకులు స్వలాభం కోసం ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గతంలో గెలిచిన గుర్తింపు సంఘాలు ఏవి కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో కార్మిక సంక్షేమం కోసం సిఐటియును గెలిపించాలని కోరారు.

## నేటి నుంచి ప్రజాపాలన గ్రామసభలు


**నవతెలంగాణ-బోనకల్**

ప్రజాపాలన గ్రామసభలను ఈ నెల 28 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తహసిల్దార్ అనిశెట్టి పొన్నం చందర్ ఎంపీడీవో బయ్యారపు అశోక్ బుధవారం విలేకరులకు తెలిపారు. మండలంలో 22 గ్రామపంచాయతీలో ఉన్నాయని, ప్రజాపాలన గ్రామసభల కోసం ప్రత్యేకంగా రెండు టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక టీం కి ఎంపీడీవో, రెండవ టీం కి తహసిల్దార్ లీడర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. గ్రామ సభలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే నిర్వహిస్తారని చెప్పారు. గ్రామ సభలలో ఎవరైనా దరఖాస్తులు అందజేయలేని ఎడల తర్వాత కూడా మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయాల్లో అందజేయవచ్చునని వారు తెలిపారు. 28న రామాపురం, నారాయణపురం, 29న సీతానగరం, రాపల్లి, 30న బోనకల్, ముష్టికుంట్ల జనవరి 2న చిన్న బీరవల్లి, గోవిందాపురం ఎల్ గ్రామాలలో 3న రాయన్నపేట, మోటమర్రి గ్రామాలలో గ్రామసభలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ గ్రామ సభలు తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ ఆధ్వర్యంలో జరుగుతాయని వారు తెలిపారు. 28న గోవిందాపురం ఏ, లక్ష్మీపురం గ్రామాలలో గ్రామసభలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 29న గార్లపాడు, పెద్ద బీరవల్లి గ్రామాలలో 30 న చిరునోముల, చొప్పకట్లపాలెం గ్రామాలలో జనవరి 2న రావినూతల, జానకిపురం గ్రామాలలో 3న బ్రాహ్మణపల్లి, కలకోట గ్రామాలలో 4న తూటికుంట్ల, ఆళ్లపాడు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## వైరాలో పలువురిని పరామర్శించిన మదన్ లాల్

**వైరాటౌన్ :** వైరా మున్సిపాలిటీ పరిధిలో బుధవారం బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్చార్జి, వైరా మాజీ శాసనసభ్యులు బానోత్ మదన్ లాల్ పర్యటించారు. ఈ సందర్భంగా పలువురిని పరామర్శించారు. బీసీ కాలనీలో ఇటీవల చనిపోయిన దాసరి క్రిష్టా దశ దిన కార్యక్రమంలో పాల్గొని దాసరి క్రిష్టా చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం మూడో వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న తాళ్లూరు కొండను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అదే వార్డులో ఇటీవల మరణించిన ఏదునూరు పెద్ద కోటయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, కట్టా కృష్ణార్జునరావు, వర్తక సంఘం అధ్యక్షులు, కౌన్సిలర్ వనమా విశ్వేశ్వరరావు, ఏదునూరు శ్రీనివాసరావు, కొత్తా వెంకటేశ్వరావు, మాదినేని దుర్గాప్రసాద్, మరికంటి శివ, మోరంపూడి ప్రసాద్, నల్లబోలు వెంకటరెడ్డి పాల్గొన్నారు.




అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
# భద్రాద్రి కొత్తగూడెం
గురువారం 28, డిసెంబర్ 2023
7


## ఎస్సైకు సర్పంచ్ల సంఘం సన్మానం

నవతెలంగాణ-ములకలపల్లి



ములకలపల్లి నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎం.రాజమౌళిని బుధవారం మండల సర్పంచ్ల సంఘం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. గురువారం నుంచి జరిగే ప్రజాపాలన గ్రామసభల్లో ఎలాంటి గొడవలు తలెత్తకుండా చూడాలని ఎస్సైను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు బైటి రాజేష్, ములకలపల్లి, కమలాపురం, జగన్నాథపురం, పొగళ్లపల్లి, పాతగంగారం, సీతారాంపురం సర్పంచ్లు బీబినేని భద్రం, గొల్ల పెంటయ్య, గడ్డం భవానీ, వగెల రమణ, వాడె లక్ష్మి, సున్నం సుశీల తదితరులు పాల్గొన్నారు.

## ఆదేశిస్తే ఎంపీ బరిలో వుంటా

- మల్లు నందిని

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్య క్షేత్రాలు అయిన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి, భ్రమరాంబా మల్లిఖార్జున స్వామినీ రాష్ట్ర ఉప ముఖ్యంత్రి సతీమణి మల్లు నందిని, వైరా శాసన సభ్యులు రామదాసు నాయక్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆమె శివాలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి పలువురుకి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శివాలయంలో కర్యకర్తలతో ఆమె మాట్లాడుతూ పార్టీ ఆదేశిస్తే ఖమ్మం పార్లెంట్ ఎన్నికల బరిలో వుంటాను అని రాష్ట్ర ప్రభుత్వం వచ్చేందుకు బట్టి విక్రమార్క పాదయాత్ర 1400 కిలోమీటర్లు చేసి ప్రజలు కష్టాలను తెలుసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తోందని రేవంత్ రెడ్డి చెప్పారని, దానిలో భాగంగా నేటి నుండి గ్రామాల్లో దరఖాస్తులు అధికారులు స్వీకరిస్తారని అన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి అడ్డా అని, ఖమ్మం నుండి యంపిగా పోటీ చేసేందుకు అవకాశం వస్తే జిల్లా ప్రజలకు సేవ చేస్తా అని అన్నారు. ఆమె ఎంపీ బరిలో అవకాశం వుంటా అని అంటుంటే కార్యకర్తలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వనమా గాంధీ, భీముడు, పర్స వెంకట్, ప్రసాద్, లాలయ్య,రాము తదితరులు పాల్గొన్నారు.

## మాధారం పాఠశాలను సందర్శించిన సీఎంవో

నవతెలంగాణ-ములకలపల్లి

మండల పరిధిలోని మాధారం యూపీఎస్ పాఠశాలను సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ (సీఎంవో) సైదులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న ఉన్నతి (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంపై ఆరాతీశారు. ఇందులో భాగంగా పిల్లల సామర్థ్యాలను పరిశీలించి పిల్లల ప్రగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో పిల్లల హాజరుశాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. సీతారాంపురంలో ఇంటి వద్ద జరుగుతున్న ఫిజియోథెరపీ క్యాంపును సందర్శించారు.

## సీఐటీయూ గెలుపు కోరుతూ ప్రచారం

నవతెలంగాణ-టేకులపల్లి



కోయగూడెం ఓపెన్ కాస్ట్లో సిఐటియు గెలుపు కోరుతూ బుధవారం కార్యకర్తలు ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థుల విజ్ఞప్తి చేశారు. సీఐటీయూను గెలిపించుకుని సింగరేణి సంస్థను పరిరక్షించుకుందామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ కార్మికులను కోరారు. గుర్తింపు సంఘ ఎన్నికల ప్రచారం కోయగూడెం ఓసిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సభ్యులు రేపాకుల శ్రీనివాస్, మండల నాయకులు ఫిట్ కార్యదర్శి చందర్, ఈసం నర్సింహారావు, కడుదుల వీరన్న, కుంజ రమేష్, పూనెం చంద్రశేఖర్, రామయ్య, ప్రేమ్ కుమార్, జోగయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో డాక్టర్ శ్రీనివాస్ తల్లి మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-ఇల్లందు



పట్టణంలోని కొత్త బస్టాండ్ సెంటర్లో ఉన్న డాక్టర్ శ్రీనివాస్ తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు పూలమాలవేసి వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వార్డు కౌన్సిలర్లు అంకె పాక నవీన్ కుమార్, కుమ్మరి రవీందర్, ఏజీపీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయ కమిటీలు పారదర్శకంగా ఉండాలి

నవతెలంగాణ-దమ్మపేట

దేవాలయ కమిటీలు పారదర్శకంగా పనిచేయాలని గ్రామాలకు ఆదర్శంగా ఉండటమే కాకుండా అవకాశం ఉన్నంత వరకు సామాజిక సేవ కూడా చేయవలసిన ఆవశ్యకత ఉందని దమ్మపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ పేర్కొంది. బుధవారం కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ కమిటీలను నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని, కొంతమంది నైతికంగా బీఆర్ఎస్ పార్టీ పరాజయం అవటంతో రాజీనామాలు చేశారని పేర్కొన్నారు. దమ్మపేట పట్టణంలో ఉన్న పురాతన శివాలయం సంతాన వేణుగోపాల స్వామి దేవాలయాల కమిటీలు కమిటీలను వెంటనే రద్దు చేయాలని, నూతనంగా ఏర్పడే పాలకవర్గ కమిటీలు పారదర్శకంగా దేవాలయాల అభివృద్ధికి తోడ్పడుతూ సమాజంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించే విధంగా ఉండాలన్నారు. ఏక వాక్య తీర్మానాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తులూరి వెంకట రామారావు, చిన్న శెట్టి యుగంధర్ రావు, పార్టీ మండల యువజన నాయకుడు చామర్తి గోపి శాస్త్రి, పోతినేని శ్రీరామ, వెంకటరావు చౌదరి, అచ్చం శేఖర్, చిన్నశెట్టి చిట్టిబాబు, చక్రాల నాగమల్లేశ్వరరావు, పసుమర్తి కృష్ణారావు, సీపీఐ నాయకులు యార్లగడ్డ భాస్కరరావు, సుంకిపాక ధర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రశాంతంగా సాగేందుకు సహకరించాలి

- ఈ బయ్యారం ఎస్సై నాగుల్ మీరా ఖాన్

నవతెలంగాణ-పినపాక




నేటి నుంచి జనవరి 6 వరకు మండలంలో ప్రజాపాలన పేరుతో నిర్వహించనున్న కార్యక్రమాలకు ఎటువంటి అవాంతరాలు కలిగించకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ బయ్యారం ఎస్సై నాగుల్ మీరా ఖాన్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఈ బయ్యారం పోలీస్ స్టేషన్లో మాట్లాడుతూ మండలంలోని వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వం అమలు చేయనున్న మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, చేయూత వంటి పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు గ్రామపంచాయతీల వారీగా ఏర్పాటు చేసే కేంద్రాలలో నేరుగా వెళ్లి దరఖాస్తులను అందజేయాలని ఆయన సూచించారు. ఎవరైనా అధికారుల విధులకు ఆటంకం కలిగించడం వంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు కే.రేగుబల్లి ఆశ్రమ విద్యార్థి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని కే రేగుబల్లి గిరిజన బాలికల వసతి గృహానికి చెందిన జలకం అరుణ ఎనిమిదవ తరగతికి చెందిన విద్యార్థినీ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైంది. ఈ నెల 14, 15, 16 తేదీలలో ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కిన్నెరసానిలో జరిగిన అండర్ 14 కబడ్డీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికైన అరుణ నేటి నుండి కిన్నెరసానిలో జరిగే ప్రత్యేక శిక్షణకు హాజరుకానుంది. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన అరుణను ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.భారతమ్మ, పీఈటి టి.విజయతో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు.

# నేటి నుంచి 6 గ్యారెంటీల దరఖాస్తులు స్వీకరణ

- దరఖాస్తు ప్రతి కుటుంబానికి చేరాలి
- కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజా పాలన, అభయ హస్తం గ్యారెంటీలకు డిసెంబర్ 28 గురువారం నుండి గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకొస్తున్న ప్రజాపాలన కార్యక్రమంపై గురువారం కలెక్టర్ నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల స్థాయిలో పర్యవేక్షణకు ఐదుగురు ప్రత్యేక అధికారులు, 22 మండలాలకు మండల ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. గ్రామపంచాయతీ, వార్డులల్లో నిర్వహించే గ్రామ సభలపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. టాం... టాంలతో పాటు లౌడ్ స్పీకర్లు ద్వారా ప్రచారం గావించాలని చెప్పారు. ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహణ సమాచారం, దరఖాస్తు ప్రతి కుటుంబానికి చేరాలని చెప్పారు. దరఖాస్తులు పూర్తి చేయుటకు హెల్ప్ డెస్కులు ఏర్పాటుతో పాటు విధులు నిర్వహించు సిబ్బందికి సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. 28 నుండి వచ్చే నెల 6వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన గ్రామసభలు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని సిబ్బంది నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామసభలకు సకాలంలో చేరుకోవాలని చెప్పారు. ప్రతి గ్రామానికి ఈ కార్యక్రమం సమాచారం చేరాలని, ప్రతి దరఖాస్తుకు నంబర్ వేసి అదే నంబరు రిజిస్టర్లో నమోదు చేయాలని చెప్పారు. దరఖాసుదారుడు ఏ అంశంపై దరఖాస్తు చేసుకున్నాడో దరఖాస్తులో టిక్ చేయాలని ఆమె ఆదేశించారు. మండల స్థాయి సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వాలని, గ్రామసభ నిర్వహించు ప్రాంగణంలో టేబుల్స్, కుర్చీలు మంచినీటి సౌకర్యం ఏర్పాట్లను నోడల్ ఆఫీసర్లు స్వయంగా పరిశీలించి నివేదిక అందజేయాలని స్పష్టం చేసారు. అశ్వరావుపేట మండలంలోని కొండారెడ్ల ఆవాసాల వద్ద గ్రామసభ నిర్వహించి దరఖాస్తులు తీసుకోవాలని చెప్పారు. ప్రజాపాలన దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, కుటుంబ పెద్ద పాస్ ఫోటో జత చేయాలని కలెక్టర్ సూచించారు.

## ఆరు గ్యారెంటీ స్కీములకు అర్హులను గుర్తించడమే లక్ష్యం

నవతెలంగాణ-దమ్మపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఆరు గ్యారెంటీ స్కీములను అందజేయడం కోసమే ప్రజా పాలన ముఖ్య ఉద్దేశమని దమ్మపేట ఎంపీపీ సోయం ప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారం దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ఈనెల 28వ తేదీ నుండి 2024 జనవరి 6వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వివిధ శాఖల మండల స్థాయి అధికారుల బృందాలు పర్యటించి అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తారని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతోనే ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో ఆర్సి హెచ్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజలు తమ గ్రామాలకు అధికార బృందాలు వచ్చినప్పుడు అందుబాటులో ఉండి దరఖాస్తులు అధికారులకు అందజేయాలని, మండలంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన క్రీడలను విజయవంతం చేయండి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని నాలుగు ఐటీడీఏ పరిధిలోని గిరిజన బాలబాలికలకు జోనల్ లెవెల్లో ఎంపిక చేయబడిన క్రీడాకారులకు జరుగు ఆటల పోటీలను విజయవంతంగా అయ్యేలా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం తన ఛాంబర్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏటీడీవోలతో వచ్చేనెల 4 జనవరి 2024 నుండి 6 జనవరి 2024 వరకు కిన్నెరసానిలోని క్రీడా పాఠశాలలో జరుగు రాష్ట్రస్థాయి గిరిజన క్రీడలకు ఏర్పాట్లపై సంబంధించిన ప్రత్యేక సమావేశమును ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ పరిధిలోని గిరిజన బాలబాలికలకు జోనల్ లెవెల్లో జరిగిన క్రీడలలో గెలుపొందిన వారికి క్రీడలు నిర్వహిస్తున్నందున దాదాపు 2000 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారనిత తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొను క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించే విధంగా కమిటీలు ఏర్పాటు చేసుకుని వారికి మంచి పుష్టికరమైన భోజనంతో పాటు వసతి కల్పించాలన్నారు. అలాగే క్రీడాకారులు ఏఏ క్రీడలలో పాల్గొంటారో వాటికి సంబంధించిన క్రీడా స్థలాలు వారికి అనుకూలంగా సిద్ధం చేయాలని సంబంధించిన క్రీడల అధికారి క్రీడాస్థలాలు ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ దృష్టికి తీసుకొని వెళ్లి మరమ్మతులు చేయించుకోవాలన్నారు. క్రీడాకారులకు అనువుగా ఉండే క్రీడా స్థలాలు సిద్ధం చేయాలని ఆయన అన్నారు. ఏమాత్రం అశ్రద్ధ వహించిన మన నిర్వహించే క్రీడల పట్ల రాష్ట్రంలో చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉన్నందున, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతుల దృష్టిలో పెట్టుకొని సౌకర్యాలు కల్పించాలని, అందుకు సంబంధిత ఏటీడీవోలు, కమిటీ మెంబర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్రీడలలో పాల్గొను బాల బాలికలతో పాటు వారి వెంట వచ్చే లైజన్ ఆఫీసర్లు, కోచ్లు, పీడీలు, పీఈటీలకు ఉండడానికి సరిపడా సౌకర్యాలు కల్పించాలని, చలికాలం నడుస్తున్నందున ప్రతి ఒక్కరికీ రగ్గులు, జంఖానాలు, క్రీడలలో పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేకమైన మెనూ ఏర్పాటు చేయాలని అన్నారు. అందుకు డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారినితో పాటు సంబంధిత పీడీలు, పీఈటీలు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, ఏసీఎంఓ రమణయ్య, బి.గోపాలరావు క్రీడల అధికారి, ఏటీడీవోలు నర్సింగరావు, చంద్రమోహన్, జహీరుద్దీన్, రూపా దేవి, ఏఎస్ఓ వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీలు బూత్ ఏజెంట్లను నియామకం చేయాలి

- 2024 జనవరి 1 తేదీకి 18 ఏళ్ళు నిండిన వారందరికీ ఓటు హక్కు
- అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు

నవతెలంగాణ-అశ్వారావుపేట



పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలక్టర్ పి.రాంబాబు రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీలతో పార్లమెంటరీ ఎన్నికల ఓటర్ల జాబితా తయారీ కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలు కాని, ఓటర్లు తమ ఓట్లను చూసుకుంటున్నారని, ఆ తరవాత వాటిని పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే పార్లమెంటరీ ఎన్నికల కోసం మరోసారి ఓటర్ల జాబితాలను ఎన్నికల కమీషన్ సవరణలు చేస్తుందని, ఇందుకోసం కొత్త ఓట్లు నమోదు, తప్పుల సవరణ, తొలగింపునకు ఫారం 6,7,8ల ద్వారా అవకాశం ఉందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారీ కోసం ప్రతి ఒక్క రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో ఏజెంట్లు నియమించుకుని ఓటరు జాబితాను పరిశీలించి, అవసరమైన చేర్పులు, మార్పులు, తప్పొప్పులను పరిశీలించి తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. బూత్ స్థాయిలో నియమించిన ఏజెంట్ల జాబితాను వచ్చే బుధవారం కల్లా తమకు అందజేయాలని కోరారు. జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓటు చేర్పులు, మార్పుల కోసం జనవరి 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఇప్పటికే ఫారం 6,7,8 ప్రకారం 3260 క్లెయిమ్లు తమ వద్ద ఉన్నాయని, వాటిని విచారించి చర్యలు చేపడతామన్నారు. తాజాగా నియోజకవర్గంలో రెండు కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు, 10 పోలింగ్ స్టేషన్ల పేరు మార్పిడి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు సహకరించాలని, గ్రామాల్లో ఓటర్లను చైతన్య పరచాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. ఇందులో టీడీపీ నుండి కట్రం స్వామి, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి చిరంజీవి నాయుడు, సీపీఐ నాయకులు సలీం, రామకృష్ణ, బీఆర్ఎస్ నుండి సత్యవరపు సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనకు ప్రత్యేక అధికారుల నియామకం

- కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ

నేటి నుండి జనవరి 6వ తేదీ వరకు జరుగుతున్న ప్రజా పాలన కార్యక్రమం పర్యవేక్షణకు జిల్లాలోని 23 మండలాల పరిధిలోని 481 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీలల్లో ప్రజా పాలన కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడానికి నియోజక వర్గం, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ఐదుగురు ప్రత్యేక అధికారులు, అలాగే 23 మండలాలకు 23 మంది జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు కలెక్టర్ చెప్పారు.



## ప్రజా పాలన గ్రామసభలు పటిష్ఠంగా నిర్వహించాలి

- జెడ్పీ చైర్మెన్ కంచర్ల చంద్ర శేఖర్‌రావు

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రజా పాలన గ్రామసభలు పటిష్ఠంగా నిర్వహించాలని జెడ్పీ చైర్మెన్ కంచర్ల చంద్ర శేఖర్‌రావు తెలిపారు. బుధవారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశం మందిరం నందు గురువారం నుంచి జరగబోవు ప్రజా పాలన గ్రామసభల ముందస్తు సన్నాహా సభ ఏర్పాటు చేశారు. ఇట్టి సన్నాహ సభకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామ సభల వివరాలను వివరించి ఏర్పాటు చేయాల్సిన కౌంటర్లు, దరఖాస్తు స్వీకరణ, హెల్ప్ డెస్కులు, మెడికల్ క్యాంపులు, ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేయాల్సిన టేబుల సంఖ్య, సిబ్బంది, అప్లికేషన్లు ఏ విధంగా ఫిలప్ చేయాలి ఏ విధంగా ఇవ్వాలి, ఏ విధంగా రసీదు ఇవ్వాలి అనే అంశాలపై సంక్షిప్తంగా సమావేశం ఏర్పాటు చేసి ఒక ట్రైనింగ్ ప్రోగ్రామ్ లాగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహకారం సంఘం చైర్మెన్ మండే వీర హనుమంతరావు, చుంచుపల్లి మండల ప్రత్యేక అధికారిని బి.సులోచన, ఎంపీడీవో మందా మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, గ్రామ సభల టీం లీడర్లు, మెంబర్లు, అందరు గ్రామ పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాపాలన

- అభయ హస్తం దరఖాస్తులు అధికారులే ఇస్తారు
- మధ్యవర్తులను నమ్మకండి
- ఎమ్మెల్యే కోరం కనకయ్య

నవతెలంగాణ-ఇల్లందు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన ప్రజా పాలన అభయ హస్తం గ్యారంటీల దరఖాస్తు స్వీకరణ పై నియోజకవర్గస్థాయి అవగాహన కార్యక్రమం మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజలకు ఆరు గ్యారెంటీలు అందే విధంగా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మధ్యవర్తులు నమ్మి ప్రజలు ఎవరూ కూడా మోసపోవద్దన్నారు. అభయా హస్తం గ్యారంటీల దరఖాస్తు సైతం అధికారులే ఇస్తారన్నారు. నేడు బుధవారం నుంచి వచ్చే నెల ఆరు వరకు అభయ హస్తం గ్యారంటీలు దరఖాస్తు స్వీకరిస్తారని తెలిపారు. అనంతరం ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో ఉదయం 8 గంటలకు 1,19,20 వార్డులలో అభయ అస్తం గ్యారెంటీల దరఖాస్తు స్వీకరణ కార్యక్రమం ప్రారంభం కానుంది అని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో పాల్వంచ సబ్ కలెక్టర్ కాశయ్య, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ విజేత తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 5నుంచి వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-చర్ల

మండల పరిధిలోని సుబ్బంపేట గ్రామంలో నాలుగు మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు సుబ్బంపేట గ్రామస్తులు, యువత తెలిపారు. చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు మండల స్థాయిలలోనీ నూతన సంవత్సర శుభాకాంక్షలతో జనవరి 5వ తేదీ నుంచి టోర్నీ ప్రారంభం అవుతుందని ఈ టోర్నీలో పాల్గొనే జట్లు జనవరి రెండోతారీకు లోపు 8897529795, 9014065937 ఫోన్ ద్వారా తమ తమ రాజకీయ టీమ్ ఎంట్రీ నమోదు చేసుకోవాలని నిర్వాహకులు వాసం ముసలయ్య, కుర్సం రాంబాబు, ఉబ్బ చంటి, కాక చందు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.800, ఈ టోర్నీ లో మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు, నాలుగవ బహుమతి రూ.5 వేలతో పాటుగా షీల్డ్ ఇవ్వడం పడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సమ్మక్క-సారక్క వాలీబాల్ టోర్నీలో క్రీడాకారుల జట్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యువత కోరారు.

## అంతర్జాతీయ తెలుగు మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించిన డీఎస్పీ

నవతెలంగాణ-కొత్తగూడెం



ఆంధ్రప్రదేశ్ రాజమండ్రిలో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 2024 జనవరి 5,6,7 తేదీలలో నిర్వహిస్తున్న రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభల గోడపత్రికను కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు మహాసభల నిర్వాహకులకు కవులకు, కళాకారులకు డీఎస్పీ రెహమాన్ అభినందనలు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ తెలుగు మహాసభల సంచాలకులు, గజల్ కవి రాజేష్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే మహాసభలలో ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ నిర్వహణలో వివిధ సాహితీ ప్రక్రియలపై సదస్సులు, కవిసమ్మేళనం, కథా పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు వంటి అనేక కార్యక్రమాలు వుంటాయని, సుమారు 70 దేశాల నుండి ప్రతినిధులు, లక్షల మంది సాహితీ ప్రియులు పాల్గొంటారని, నాలుగు రాష్ట్రాల గవర్నర్లను, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, మంత్రులను, చలన చిత్ర ప్రముఖులను, సాహితీ వేత్తలను ఆహ్వానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత దర్శకులు కొత్తపల్లి శేషు, తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుల రికార్డులను 29న అందజేయాలి

- ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-పాల్వంచ



శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన ఐదు నియోజకవర్గాల్లో అభ్యర్థులు వారి ఎన్నికల ఖర్చులకు సంబంధించిన రికార్డులను 29వ తేదీన జిల్లా ఎన్నికల అధికారి, వ్యయ పరిశీలకులు నిర్వహించే అకౌంట్స్ రీ కన్సులేషన్ మీటింగ్లో అందచేయాలని జిల్లా సహకార అధికారి, ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో ఎన్నికల వ్యయ నివేదికలు సమర్పణపై ఎన్నికల అకౌంట్స్ రీ కన్సలేషన్ పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ 29వ తేదీన ఎన్నికల వ్యయ పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టరేట్లో నిర్వహించే రీ కన్సలేషన్ సమావేశానికి హాజరై అభ్యర్థుల ఎన్నికల ఖర్చులకు సంబంధించిన రికార్డులను అందచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో సహాయ వ్యయ పరిశీలకులు వేల్పుల శ్రీనివాస్, దాసరి మహేష్ కుమార్, సీహెచ్ కోటయ్య, అంచ నాగరాజు, కే.శంకరాచారి, పోటీ చేసిన అభ్యర్థులు పోడియం బాలరాజు, కారం పుల్లయ్య, అభ్యర్థుల ఏజంట్లు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు లేని మున్సిపాలిటీని నిర్మించుకుందాం

- మౌలిక వసతుల కల్పనకు కౌన్సిల్ ప్రాధాన్యత ఇవ్వాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**నవతెలంగాణ-కొత్తగూడెం**

సమస్యలు లేని మున్సిపాలిటీగా కొత్తగూడెం పట్టణాన్ని నిర్మించుకుందామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణ ప్రజలు ప్రధానంగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యకు శ్వాశ్వత పరిష్కారం అన్వేషించాలి సూచించారు. ప్రజల మౌలిక అవసరాలైన తాగునీరు, అంతర్గత రోడ్లు, పారిశుద్యం, వీధి దీపాల వంటి సమస్యల పరిష్కారంకోసం పాలకవర్గం తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు నీటి పథకాలు ఏర్పటికోసం నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు ప్రతి పేదవాడి దరి చేరే వేదంగా చొరవ చూపాలని, పథకాల అమలులో పైరవీలకు తావులేకుండా రాజకీయాలకతీతంగా ప్రజలకు అందించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జి అర్జున్, మున్సిపల్ కమిషనర్ రఘు, తహసీల్దార్ పుల్లయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఎన్నికలను పరిశీలించిన కోరం



**నవతెలంగాణ-టేకులపల్లి**

కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో జరుగుతున్న సింగరేణి అనుబంధ సంఘాల ఎన్నికలను బుధవారం ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిశీలించారు. ప్రశాంతంగా కొనసాగుతున్న పోలింగ్ పై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువులు నాయకులు పాల్గొన్నారు.

**ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు**

**నవతెలంగాణ-అశ్వారావుపేట**

ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడేనికి చెందిన రావూరి వంశీ (24) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. రోజు లానే పనికోసం ఇంటి నుండి బయలు దేరి వెళ్ళి స్థానిక కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీ వెనుక ప్రాంతంలోగల ఓ మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటువైపుగా వెళ్లిన కొంతమంది పశువుల కాపరులు మామిడీ చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న అదనపు ఎస్సై శివరామకృష్ణ ఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. కాగా యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. దీనిపై కుటుంబీకుల నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు రాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు వంశీ అవివాహితుడు కాగా, ఇతనికి తల్లిదండ్రులు ముత్తయ్య, అలివేలు, అన్న, చెల్లి ఉన్నారు.

## ఉప మార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్‌గా ప్రకటించాలి

- ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కృష్ణ



**నవతెలంగాణ-జూలూరుపాడు**

జూలూరుపాడు ఉప మార్కెటను ఏన్కూర్ మార్కెట్ యార్డ్ నుంచి విడగొట్టి, శాశ్వత వ్యవసాయ మార్కెట్‌గా ప్రకటించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం జూలూరుపాడు ఉప మార్కెట్ యాడ్‌లో జూలూరుపాడు వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజాపంథా మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తహసిల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి భానోత్ ధర్మ, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జిల్లా సహాయ కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు, నాయకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో జ్యోతిర్లింగాల ప్రతిష్టాపన మహోత్సవం



**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

మండలంలోని సీతారాంపురం గ్రామంలో గల ద్వాదశ జ్యోతిర్లింగ శివాలయంలో బుధవారం ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దంపతులు పాలడుగు శివరామకృష్ణ, పద్మజ, మురుగొండ, శివ రామక్రిష్ణ, సరోజిని, వీయ్యాపు, రాంబాబు, అనీల్, రేణుక, గోగినేని, శ్రీనివాస్, భారతి, విజయవాడ వాస్తవ్యులు లక్ష్మి విజయ కుమారి, నర్సాపురం గ్రామస్తులు వినీల్ కుటుంబ సభ్యులు, పుణ్య దంపతుల చేతుల మీదుగా జ్యోతిర్లింగాలను ఉదయం 11:39 శివుని జన్మ నక్షత్రం శివ ముక్కోటి సందర్భంగా నర్మద నది తీర ప్రాంతాల్లో ఉండే కాశీ నుండి తీసుకువచ్చిన బ్రహ్మ సూత్రం కలిగిన బ్రహ్మసూత్ర మహిమ కలిగిన 12 శివ జ్యోతిర్లింగాలను వేద మంత్రాలతో, మంత్రోచ్చారణతో, ఆలయం ప్రాంగణంలో ఘూర్తన్యాసం, ఘాతన్యాసం, రత్నం యాసం, యంత్ర ప్రతిష్టాపన, విగ్రహ ప్రతిష్ట, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు మండలంలో ఉన్న చుట్టూ ప్రక్కల గ్రామాల వారు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి 12 బ్రహ్మ సూత్ర జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు. జ్యోతిర్లింగాలను దర్శించి మంచి నీళ్ళతో, లేక ఆవు పాలతో పాలాభిషేకం చేసినట్లైతే, బ్రహ్మాండమైన శుభ ఫలితాలు కలుగుతాయని శివుని అనుగ్రహం పొందుతారని పండితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు రాఘవ శర్మ యశ్వంత్ శర్మ, నూతన శర్మ, జోజి శర్మతో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోండి

**ములకలపల్లి :** ప్రజాపాలన గ్రామసభలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయని, గ్రామసభల్లో ప్రజలు వివిధ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, మాజీ సొసైటీ అధ్యక్షులు కరుటూరి కష్ణలు కోరారు. బుధవారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ ప్రజల కష్టాలను తీర్చడానికి ఆరు గ్యారెంటీలను తెచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి జరిగే ప్రజాపాలనలో భాగంగా మండలంలో ముత్యాలంపాడు. రామచంద్రాపురం, వీకే.రామవరం, గుట్టగూడెం పంచాయతీల్లో గురువారం జరిగే సభల్లో ప్రజలు అభయహస్తం దరఖాస్తులను సమర్పించుకోవచ్చని, ఆయా పంచాయతీల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధికారులతో మాట్లాడి అన్ని సౌకర్యాలు కల్పించారని తెలిపారు. ఈ సమావేశంలో రాజేష్, సాదం శ్రీనివాస్, కొర్రి శివ తదితరులు పాల్గొన్నారు.

**అన్నపురెడ్డిపల్లి :** ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించేందుకు గురువారం నుండి ఏర్పాటు చేసిన ప్రక్రియను మడలంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలో గల రైతు వేదిక నందు తహశీల్దార్ జగదీశ్వర ప్రసాద్, యంపిడిఓ అన్నుపూర్ణ ఆధ్వర్యంలో మండలంలో గల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరి దగ్గర నుండి దరఖాస్తు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులును ఆదేశించారు. అదేవిధంగా డిఎస్పీ అబ్దుల్ రెహమాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్య శాఖ అధికారి సత్యనారాయణ, ఎపియం రామబద్రయ్య, జడ్పీటిసి లాలమ్మ(లావణ్య), వైస్ యంపిపి రామారావు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్‌పై బస్సు డ్రైవర్ ఫిర్యాదు

**నవతెలంగాణ-కొత్తగూడెం**

ఆర్టీసీ బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుండగా కొంత మంది ఆటో డ్రైవర్లు బస్సుకు అడ్డం తిరిగి బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. బుధవారం కొత్తగూడెం నుండి ఖమ్మం వెళ్లే ఆర్డినరీ ఆర్టీసీ బస్సు కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్తుండగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో మధ్యాహ్నం బస్సు డ్రైవర్ కుంభం నాగరాజు బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుండగా కొంతమంది ఆటో డ్రైవర్లు బస్సుకు అడ్డం తిరిగి డ్రైవర్ పైకి దాడికి దిగారని, డ్రైవర్ సీట్లో కూర్చుండగా కింద ఆటో డ్రైవర్లు వాటర్ బాటిల్‌లోని నీళ్లు డ్రైవర్‌పై పోసి, డ్రైవర్‌ని కిందికి దించి బూతులు తిడుతూ కొట్టడం జరిగిందని డ్రైవర్ ఆరోపించారు. బస్సులో ఉన్న కండక్టర్ వి.సరస్వతి, బస్సులో ఉన్న ప్రయాణికులు ఆటో డ్రైవర్ను ఆపుతున్న ఆగకుండా బస్సు డ్రైవర్‌పైకి దాడికి దిగారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ సంఘటనపై కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వడం జరిగింది. ఆర్టీసీలో ప్రజలకు సేవ చేస్తుండగా మాపై దాడులు జరుగుతున్నాయని ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. జరిగిన సంఘటనపై కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు నేరుగా పోలీస్ స్టేషన్ వెళ్ళి దాడి చేసిన ఆటో డ్రైవర్స్‌పై కంప్లైంట్ చేశారు. ఇలాంటి సంఘటన మరొకసారి జరగకుండా చూడాలని పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులను కోరారు.

## సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో
# ఐఎన్‌టీయూసీ విజయం



**నవతెలంగాణ-ఇల్లందు**

హెూరాహెూరీగా జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో ఇల్లందు ఏరియాలో ఏఐటియుసి పై 46 ఓట్ల తేడాతో ఐఎన్టీయూసీ విజయం సాధించింది. మొత్తం 614ఓట్లు పోల్ కాగా ఐఎన్టియుసికి 311 ఏఐటియుసికి 264 ఓట్లు వచ్చాయి. ఐఎన్టియుసి 311, ఏఐటియుసి 264, సిఐటియు 7, టీబీజీకేస్ 1, ఎస్యుఎస్ 1, ఎస్ఎంఈ 3, గోదావరిఖని లోయ బొగ్గు గని కార్మిక సంఘం 7, సింగరేణి కోల్ మైండ్స్ కార్మిక సంఘం 9, ఇన్వాల్డ్ 1 ఓట్లు నమోదు అయ్యాయి.

# కార్పొరేట్‌లో ఐఎన్‌టీయూసీ గెలుపు



**నవతెలంగాణ- కొత్తగూడెం**

కొత్తగూడెం సింగరేణి కార్పొరేట్ పరిధిలో జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్ టియూసీ విజయం సాధించింది. సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాలో బుధవారం జరిగిన ఎన్నికల్లో వివిధ ప్రాంతాల్లో ఐఎన్టీయూసీ ఆధిపత్యం కొనసాగింది. కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయం పరిధిలో ఐఎన్టియుసి గెలుపొందింది. కార్పొరేట్ పరిధిలో 1191 ఓట్లకు గాను, 1146 కోట్లు పోలయ్యాయి. ఇందులో ఐఎన్టీయూసీకి 549 కోట్లు రాగా, బి ఎంఎస్ 263 ఓట్లు సాధించింది. ఏఐటీయూసీకి 253 ఓట్లు పోలయ్యాయి. మిగతా కార్మిక సంఘాలకు నామమాత్రం ఓట్లు పోలయ్యాయి. సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపులో రాత్రి 10 గంటల వరకు లెక్కింపు చేసి ఫలితాలు వెల్లడించారు.

# ప్రశాంతంగా సింగరేణి ఎన్నికలు

- గుర్తింపు కోసం కార్మిక సంఘాల పోటా పోటీ
- ఓటు హక్కు వినియోగించుకున్న కార్మికులు



**నవతెలంగాణ-కొత్తగూడెం**

సింగరేణి సంస్థలో నిర్వహించిన గుర్తింపు సంఘం ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల్లో 13 కార్మిక సంఘాల పోటీ పడ్డాయి. ప్రధానంగా నాలుగు కార్మిక సంఘాలు నువ్వా... నేనా... అన్న తీరుగా పోటీపడి ప్రచారం నిర్వహించారు. అధికార కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టియుసి, సిపిఐ అనుబంధ కార్మిక సంఘం ఏఐటీయూసీ, సీపీఐ(ఎం) అనుబంధ కార్మిక సంఘం సిఐటియు, హెచ్ఎంఎస్, బిఎంఎస్, టిఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం టీబీజీకేఎస్‌లు పోటీలో ఉన్నాయి. బుధవారం సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ఎన్నికల అధికారులు, సింగరేణి యాజమాన్యం, పోలీస్, రెవెన్యూ యంత్రాంగం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరిగింది. సాయంత్రం ఐదు గంటల నుండి ఏరియాల వారీగా అదే ప్రాంతాల్లో కౌంటింగ్ ప్రారంభించారు. అత్యధికంగా శ్రీరాంపూర్‌లో 9127 మంది కార్మికులు ఉన్నారు. అత్యల్పంగా ఇల్లందులో 614 మంది కార్మికులు ఉన్నారు. మొత్తం 39773 మంది ఉన్నారు. మొత్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. కౌంటింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభించారు.

**ఎన్నికల తాయిలాలు :** సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్నికల తాయిలాలు ఆయా కార్మిక సంఘాలు కార్మికులకు అందజేశాయి. ఐఎన్‌టియూసీ సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాలలో తన ఆధిపత్యంతో కార్మికులను ప్రలోభాలకు గురిచేసింది. మద్యం, మాంసం పంపిణీ చేశారు. రాత్రిపూట మందుతో డిన్నర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఒక్కొక్క కార్మికుడికి రూ.5000లు పంపిణీ చేశారని సమాచారం. బిఎంఎస్ కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో రెండు స్టీల్ ప్లేట్లు, వెయ్యి రూపాయలు పంపిణీ చేశారని ప్రచారం. గుర్తింపు సంఘంగా నిలబడేందుకు అధికార కాంగ్రెస్ అనుబంధం కార్మిక సంఘమైన ఐఎన్‌టియూసీ బరితెగించిందని కార్మికుల ఆరోపిస్తున్నారు. కార్మికులను పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురిచేసిందని, గత నాలుగు రోజుల నుండి మందు, విందు లాంటి డిన్నర్లు విచ్చల విడిగా ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ నెల 23వ తేదీన సింగరేణి ఆవిర్భావ దినోత్సవం వేడుకల వంకతో మొదలైన మందు, విందుల పరంపర ఎన్నికల ముగిసే వరకు సాగింది. ఈ విషయంలో ఇతర కార్మిక సంఘాలు, కార్మికులు, స్థానిక ప్రజలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేందుకు 12 ఏరియాలలో పోలీస్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఘర్షణ వాతావరణం జరగకుండా ఎన్నికల ప్రశాంతంగా జరగడంతో యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది.

**ఓటింగ్ సరళి :** గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో మొత్తం 39773 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకు మొత్తం 84 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11 కౌంటింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేశారు. సింగరేణిలో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సరళి మందకొడిగా సాగింది. ఓటర్లు మొదటి రెండు గంటల వరకు ఆసక్తిగా ఓట్లు వేసినట్టు కనబడలేదు. 8 గంటల వరకు 14.9 శాతం మాత్రమే నమోదు అయింది. మధ్యాహ్నం 11 గంటల తర్వాత ఓటింగ్ సరళి పెరిగింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు 30009 మంది ఓట్లు వేశారు. 75శాతం పోలింగ్ జరిగినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. సాయంత్రం 3 గంటలకు 34,128 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85.80 శాతం నమోదు అయింది.

సాయంత్రం4 గంటలకు 37026 ఓట్లు పోలయ్యాయి. 93.09 శాతం నమోదు అయింది. ఇదిలా ఉండగా కొత్తగూడెం సింగరేణి ప్రాంతంలో సాయంత్రం 5 గంటలకు సింగరేణి కొత్తగూడెం ఏరియాలో 2326కి గాను 2207 మంది కార్మికులు, ఇల్లందులో 614 మంది కార్మికులకు గాను 604, మణుగూరు ఏరియాలో 2450 ఓటర్లకుగాను 2378, కార్పొరేట్ ఏరియాలో 1191కి గాను 1149 ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 5 గంటలకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో 39773 మంది కార్మికులకు గాను, 37468 మంది కార్మికులు వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మొత్తంగా 94.20 శాతం నమోదు అయింది. అధికారుల విడుదల చేసిన వివరాల ప్రకారం వివిధ కారణాల రీత్యా 2305 మంది కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారు.

### మణుగూరులో 97.06 పోలైన ఓట్లు

**మణుగూరు :** మణుగూరు ఏరియా సింగరేణిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 97.06 ఓట్లు పోలైనాయి. మణుగూరు ఏరియాలో మొత్తం 2450 ఓట్ల గాను 2378 ఓట్లు పోలైనాయి. ఏరియా వ్యాప్తంగా ఏడు బూతులలో ఓటింగ్ జరిగింది. పీకే ఓ 2 రెండో బూతులు 639 కోట్ల గాను 619 ఓట్లు పోలైనాయి. పీకే ఓ సీ2 రెండవ బూతులో 489 ఓట్ల గాను 474 ఓట్లు పోలైనాయి. కేసిహెచ్‌పి 426 ఓట్ల గాను 418 ఓట్లు పోలైనాయి. పీకే ఓసి4లో 193 ఓట్ల గాను 192 ఓట్లు పోలయినాయి. కేపియుజి భూగర్భ గనుల 254 ఓట్ల గాను 242 ఓట్లు పోలైనాయి. జిమ్ ఆఫీస్ కార్యాలయంలో 260 ఓట్ల గాను 248 మణుగూరు ఓసీలు 189 ఓట్ల గాను 185 పోలయినాయి. డిఎస్‌పి రాజేందర్ నాయకత్వంలో ఎన్నికల నిర్వహణ జరిగింది. కార్మికులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.



## సింగరేణి ఎన్నికల బూతుల వద్ద సీఐటీయూ విస్తృత ప్రచారం

- భారీగా కదిలిన సీఐటియూ శ్రేణులు



**నవతెలంగాణ-కొత్తగూడెం**

సింగరేణిలో బుధవారం జరిగిన సింగరేణి ఎన్నికల సమయంలో కార్మిక సంఘాల నాయకుల స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొన్నారు. కొత్తగూడెం కార్పొరేట్, ఏరియాలోని పోలింగ్ బూత్‌ల వద్ద సిఐటియు శ్రేణులు టెంట్లు వేసుకొని బహిరంగంగా కార్మికులను కలుసుకొని, 'ఉదయించే సూర్యుడికి' గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బొగ్గు బావుల వద్ద, వివిధ సింగరేణి డిపార్ట్మెంటల్‌ల వద్ద భారీగా సిఐటియు శ్రేణులు చేరుకొని ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ బూత్‌ల వద్ద ప్రచారం చేశారు. కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద, సింగరేణి ప్రధాన ఆసుపత్రి, వర్క్‌షాప్, ఏరియాలోని జిఎం కార్యాలయం ఇరత పోలింగ్ బూత్‌ల వద్ద ప్రచారంలో భాగంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మంద నరసింహారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్‌లు ఎన్నికల సర్వే పరిశీలిస్తూ బూతుల వద్ద కార్మికులను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్యకర్తలు సిఐటియు అనుబంధంగా ఉన్న ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో ప్రచార నిర్వహించారు.

## ప్రభుత్వ కార్యక్రమాలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



**నవతెలంగాణ-ఆళ్ళపల్లి**

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల జారీ మేరకు జరిగే ప్రజా పాలన కార్యక్రమాలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లందు డీఎస్పీ రమణమూర్తి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాల సర్పంచ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజా పాలన సభలు నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం సామాన్య ప్రజలకు మాత్రమేనని, నేరస్తులకు కాదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు పోలీసులకు, మిగతా శాఖల అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ ఇంద్ర సేనారెడ్డి, స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్, పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



## ఆసక్తి రేకెత్తించిన సింగరేణి ఎన్నికలు



**నవతెలంగాణ-మణుగూరు**

మణుగూరు ఏరియా సింగరేణి ఎన్నికలు ఆసక్తికరంగా జరిగాయి. సింగరేణి కల్పించిన ఆయా ప్రచార ఏరియాలలో మొత్తం ఏడు బూతులలో సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎన్‌టియుసి, టీబీజీకేఎస్ అనుబంధ రాజకీయ పార్టీల నాయకులు ఆయా గనులలో కార్మికులను ఉత్సాహంగా చూపించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరం కనకయ్య, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మధు, రాష్ట్ర నాయకులు బ్రహ్మాచారి, గద్దల శ్రీనివాసరావు, నిమ్మల వెంకన్న, పినపాక శాసనసభ్యులు వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చారి అన్ని బూతులలో ప్రచారం నిర్వహించారు. సీపీఐ(ఎం) అన్ని బూతులలో ఉదయించే సూర్యుని గుర్తుపై ఓటు వేసి ఎందుకు ప్రసారం నిర్వహించడంలో అగ్రభాగాన ఉన్నారు. ప్రతి ఓటర్ని ఓటు వేయాలని కోరారు.

# మున్సిపల్ పరిధిలో ప్రజా పాలనా కార్యక్రమాలు

- వార్డుల వారీగా ఏర్పాటు
- మున్సిపల్ కమిషనర్ జి.రఘు

**నవతెలంగాణ-కొత్తగూడెం**

ప్రజాపాలన దరఖాస్తులు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు ఉచితముగా పంపిణీ చేయబడునని మున్సిపల్ కమీషనర్ రఘు తెలిపారు. 28, 29 తేదీలలో వార్డు నెం.1, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బూడిదగడ్డలో, వార్డు నెం.5, శాదిఖాన, ప్యూన్ బస్తి, వార్డు నెం.9, గణేష్ చమన్, రామవరం, వార్డు నెం.13, కమ్యునిటి హాల్, బాబు క్యాంపులో ఉంటుంది. వార్డు నెం.17, హనుమాన్ టెంపుల్, న్యూ గొల్లగూడెం, వార్డు నెం.21, ముస్సిపల్ క్యాటర్, మేదర బస్తి, వార్డు నెం.25, సి.అర్.సి. బిల్డింగ్, హనుమాన్ బస్తీ, వార్డు నెం.29, సన్యాసి బస్తి జంక్షన్, రామయలం వద్ద, వార్డు నెం.33, కూలీలేన్, క్రీడా ప్రాంగణమ్ వద్ద, వార్డు నెం.2, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా, బూడిదగడ్డ, వార్డు నెం.6, పాత పోస్ట్ ఆఫీస్ సెంటర్, రామవరంలో ప్రజా పాలన సదస్సు వేదికలు ఏర్పాటు చేశారు. 30వ తేదీ, జనవరి 2వ తేదీ 2024న వార్డు నెం.10, అంగన్ వాడీ సెంటర్, వనం దాస్ గడ్డ, వార్డు నెం.14, సున్నం బట్టి జంక్షన్, బాబు క్యాంపు, వార్డు నెం.18, అర్బన్ హెల్త్ సెంటర్, సఫాయి బస్తి, వార్డు నెం.22, కమ్యునిటి హాల్, సఫాయి బస్తి, జనవరి 3వ తేదీన 4వ తేదీన వార్డు నెం.26, అంగన్ వాడి కేంద్రము, హనుమాన్ బస్తీ, వార్డు నెం.30, కమ్యునిటి హాల్, మధుర బస్తీలో, వార్డు నెం.34, కూలీలేన్ వ్యాయామ శాల వద్ద వార్డు నెం. 3, తెలంగాణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, పాత కొత్తగూడెంలో, వార్డు నెం.7, రామవరం 7నంబర్ బజార్‌లో, వార్డు నెం.11, పట్టణ ప్రకతి వనము, వన్నందాస్, చిట్టి రామవరం, వార్డు నెం.15, కమ్యునిటి హాల్, ప్రకాష్ నగర్, వార్డు నెం. 19, రవి బాల నికేతన్ స్కూల్, ప్రగతి నగర్.వార్డు నెం.23, కమ్యునిటీ హాల్, కూలిలైన్, వార్డు నెం. 27, పోచమ్మ గుడి జంక్షన్, గ్యాస్ ఆఫీస్ దగ్గర, ఏ-పవర్ హౌస్ బస్తి, వార్డు నెం.31, రైటర్ బస్తీ జంక్షన్ వద్ద, వార్డు నెం.35, సఖీ భావన్ వద్ద, కూలీలేన్‌లో ఏర్పాటు చేశారు. జనవరి 5, 6వ తేదీలలో వార్డు నెం. 4, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గంగాహుస్సేన్ బస్తి, వార్డు నెం.8, రామాలయం, పంజాబ్ గడ్డ, వార్డు నెం. 12, సాయిబాబా కమ్యునిటి హాల్, సి.అర్.పి.క్యాంప్, రామవరం, వార్డు నెం.20, మురళీ కృష్ణ రైస్ మిల్, మేదర బస్తీ, వార్డు నెం.16, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, న్యూ గొల్లగూడెం, వార్డు నెం. 24, అృత్ కిరాణా, కూలిలేన్, వార్డు నెం.28, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల క్రీడా ప్రాంగణం దగ్గర, దుర్గన్ బస్తి, వార్డు నెం.32, కమ్యునిటి హాల్, నేతాజీ మార్కెట్, వార్డు నెం.36, పాత హెూల్ సెల్ మార్కెట్ గ్రౌండ్, కూలీలేన్‌లో ఏర్పాటు చేసినట్లు కమీషనర్ జి.రఘు తెలిపారు.

# సింగరేణి ఎన్నికల ప్రచార దృశ్యాలు







## ఇల్లందులో భారీగా పోలింగ్

**- 614 ఓట్లకు 604 ఓటింగ్**

**ఇల్లందు :** ఏడవ విడత నిర్వహించిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముశాయి. మూడు పోలింగ్ కేంద్రాల్లో భారీగా ఓటింగ్ శాతం నమోదయింది. మొత్తం 614 ఓట్లు కాగా 604 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇల్లందు ఉపరితల గని పోలింగ్ కేంద్రంలో 218 ఓట్లు కాగా 218 పోల్ అయ్యాయి. 100% నమోదైన ఓటింగ్ నమోదైంది. జీఎం కార్యాలయంలో 274 కాగా 268 పోలయ్యాయి. కోయగూడెం ఓసిలో 122 ఓట్ల గాను 118 ఓట్లు పోలయ్యాయి. 614 ఓట్లకు 604 ఓటింగ్ కాగ 10 మంది కార్మికులు ఓటింగ్‌లో పాల్గొనలేదు. సీఐటీయూ, ఏటియూసి, ఐఎన్టియుసి, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో నేతలు కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు. డిఎస్పి రమణమూర్తి ఆధ్వర్యంలో గనుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అంవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రశాంతంగా ముగిశాయి.

## ప్రజాపాలన ఉమ్మడి జిల్లా అధికారిగా రఘునందన్‌రావు

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి పది జిల్లాలకు ప్రజా పాలన కార్యక్రమం కోసం ప్రభుత్వం పది మంది ఐఎఎస్ లను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు నోడల్ అధికారిగా ఎం. రఘునందన్ రావును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఆదేశాలు ఇచ్చారు. గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు అభయహస్తం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, గ్రామ, బస్తీ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారనే విషయం విదితమే.






## దరఖాస్తుల స్వీకరణలో పక్షపాతం వద్దు

**- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**

**- ప్రజాపాలన దరఖాస్తులపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష**

**నవతెలంగాణ-సత్తుపల్లి**

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణపై ఎలాంటి పక్షపాతం చూపవద్దని, ప్రజలందరి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అధికారులను కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో ప్రత్యేక అధికారి సునీల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజాపాలన కార్యక్రమం అభయహస్తం గ్యారంటీ పథకాలైన మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాల అమలుకు సంబంధించి గురువారం (నేటి) నుంచి అర్హత ఉన్న లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామ సభల ద్వారా వచ్చేనెల 6వ తేదీ వరకులాయా దరఖాస్తులను అధికారులు స్వీకరించడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల పరిధిలో దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ప్రజాపాలన గ్రామ సభల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. వృద్ధులు, గర్భిణులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, కమిషనర్ కోడూరు సుజాత, వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, తహసీల్దారు కూర్మా యోగేశ్వరరావు, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, దూదిపాల రాంబాబు, నాగుల్‌మీరా, పద్మజ్యోతి పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**నవతెలంగాణ-సత్తుపల్లి**



కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ ప్రయివేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఒకరు ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సత్తుపల్లిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన కుసుమరాజు సురేశ్ (34) అనే ప్రయివేట్ లెక్చరర్ సురేశ్ కుటుంబంలో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం సురేశ్ భార్య దుర్గ వాళ్ల బంధువుల్లో ఒకరికి ఒంట్లో బాగోలేదని చూడటానికి వాళ్లింటికి వెళ్లింది. అక్కడికి వెళ్లాక ఆమె భర్త సురేశ్‌కు ఫోన్ చేసింది. అతను ఎంతకీ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో పక్కింటి వాళ్లకి ఫోన్‌చేసి చూడమని చెప్పింది. వాళ్లొచ్చి చూసేసరికే సురేశ్ ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. మృతుడి సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**- గుండాల సీఐ రవీందర్**

**నవతెలంగాన-గుండాల**

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రవీందర్ హెచ్చరించారు. గుండాల పోలీస్ స్టేషన్ నందు ప్రజాపాలనపై మండలంలోని ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. నేటి నుంచి ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరిస్తారని, గ్రామస్తులు అందరు సహకరించాలన్నారు. ప్రభుత్వ ప్రోగ్రామ్ లకు అనవసరం గా అవంతరాలు సృష్టిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

**- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా**

**అధికారులకు ఆదేశం**

**- ప్రజాపాలనకు ఎలాంటి పొరపాట్లకు**

**- తావు లేకుండా చూడాలి**

**- టెలి కాన్ఫరెన్స్‌లో అధికారులకు దిశా నిర్దేశం**



**నవతెలంగాణ-పాల్వంచ**

ప్రజా పాలన కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లుకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణపై బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమ ప్రారంభించడానికి ముందు ముఖ్యమంత్రి సందేశం సభలో చదివి వినిపించాలని చెప్పారు. దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలతో అధికారులు, సిబ్బంది మర్యాదగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని చెప్పారు. 28వ తేదీ నుండి వచ్చే నెల 6వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజా పాలన కార్యక్రమంలో అభయహస్తం ఆరు గ్యారెంటీలైన మహాలక్ష్మి గృహ జ్యోతి, రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరిస్తారని చెప్పారు. వచ్చే నెల 6 వరకు కొనసాగే ప్రజా పాలన కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులలో ప్రతి రోజు రెండు పూటలా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. నిర్దేశించిన సమయం ప్రకారం గ్రామసభ ప్రారంభించాలని చెప్పారు. సిబ్బంది ముందుగానే సభా కార్యక్రమనికి చేరుకోవాలని చెప్పారు. ప్రజా పాలన కార్యక్రమంలో నిర్వహిస్తున్న గ్రామ, వార్డుల సభలలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రజా పాలన నిర్వహణపై ప్రభుత్వ సూచనలు, సలహాలు తప్పక పాటించాలన్నారు. ప్రజాపాలన బృందాలు సమయ పాలన పాటించాలని, షెడ్యూల్ ప్రకారం గ్రామాలు, వార్డులకు ముందుగానే చేరుకోవాలని చెప్పారు. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. గ్రామసభలు నిర్వహించే గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డుల వద్ద మహిళలకు, వయోవృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుతో పాటు రద్దీ నియంత్రణకు కూపన్లు జారీ, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. కౌంటర్ల వద్ద సురక్షిత తాగునీరు, టెంట్లు, క్యూ లైన్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజా పాలన సందర్భంగా మండల స్థాయి బృందాల ఏర్పాటు, గ్రామ సభ నిర్వహణపై ప్రతి ఇంటికి సమాచారం అందే విధంగా ముందుగానే గ్రామాలు, వార్డుల్లో దండోరా, సోషల్ మీడియా, ఫ్లెక్సీలు, సైన్ బోర్డ్స్, లౌడ్ స్పీకర్ల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవోలు స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని కార్యక్రమం విజయవంతమయ్యేలా చూడాలని సూచించారు. ప్రజా పాలన దరఖాస్తులను పూరించడంలో అనుమానాలు నివృత్తికి హెల్ప్ డెస్క్ లతో పాటు విధులు కేటాయించిన సిబ్బంది దరఖాస్తు దారులకు సహకరించాలని సూచించారు. దరఖాస్తులు ఉచితంగా అందచేస్తున్నామని చెప్పారు. దళారుల బారిన పడొద్దని ప్రజలకు సూచించారు. ప్రజలను, ప్రలోభాలకు గురి చేసినా, దరఖాస్తులకు డబ్బులు తీసుకున్నా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎలాంటి సందేహాలున్నా సమీపంలోని కేంద్రాలను కానీ గ్రామ, వార్డు ప్రత్యేక అధికారులను సంప్రదించాలని చెప్పారు. ఒక వేళ జిరాక్స్ అవసరమైన సందర్భంలో నామ మాత్రపు ధరను మాత్రమే తీసుకోవాలని, ఎక్కువ తీసుకుంటే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

ప్రభుత్వ యంత్రాంగం ప్రజలతో మమేకమై సమన్వయంతో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు దరఖాస్తు నెంబర్ నమోదు చేయాలని అలాగే ప్రతి దరఖాస్తుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఆమె తెలిపారు.

## ప్రతీ కుటుంబానికి దరఖాస్తు

**- ప్రజల వద్దకే పాలన..**

**నవతెలంగాణ-అశ్వారావుపేట**



ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువలోకి తేవడానికి నేటి నుంచి మండలం లోని 30 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామని ఎం.పి.డి.ఒ జి.శ్రీనివాసరావు తెలిపారు. సభల నిర్వహణకు గాను మండలంలో ఐదురుగు అధికారులు మండల స్థాయి అధికారులతో ఏడుగురు సభ్యులు ఉండే విధంగా అయిదు బృందాలను ఏర్పాటు చేసామని ఆ బృందాలకు తహశీల్దార్ వి.క్రిష్ణ ప్రసాద్, ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, ఎంపిఈవో సీతారామరాజు, వ్యవసాయాధికారి వై.నవీన్, ఐ.బి ఏఈ కేఎస్పీ క్రిష్ణలు నాయకత్వం వహిస్తారని అన్నారు. దరఖాస్తునకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులను జతచేసి గ్రామసభ జరిగే రోజున కౌంటర్ నందు సమర్పించి రసీదును పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

**ప్రజాపాలన షెడ్యూల్ ఇదే....**

ఆరు రోజులు పాటు జరిగే ప్రజా పాలన కార్యక్రమానికి ఒక్కో రోజూ 5 పంచాయతీలు చొప్పున నిర్వహించనున్నారు.

- 28న అచ్యుతాపురం, రామన్నగూడెం, పాత రెడ్డి గూడెం, మొద్దులు మడ, కేసప్పగూడెం.
- 29న మద్దికొండ, పాత అల్లి గూడెం, నందిపాడు, అనంతారం, జమ్మిగూడెం.
- 30న నారంవారిగూడెం కాలనీ,గుర్రాలుచెరువు,కొత్త మామిళ్ళ వారిగూడెం, మల్లాయి గూడెం,బచ్చువారి గూడెం.
- 2న నారంవారిగూడెం, వేదాంతపురం, గాండ్లగూడెం, దిబ్బ గూడెం, కావడి గుండ్ల.
- 3న అశ్వారావుపేట, పేరాయిగూడెం, ఆసుపాక, గుమ్మడవల్లి, కన్నాయి గూడెం.
- 4న అశ్వారావుపేట, పేరాయిగూడెం, తిరుమలకుంట, గుమ్మడవల్లి, కోయ రంగాపురం.
- 5న అశ్వారావుపేట, పేరాయిగూడెం, వినాయకపురం, నారాయణపురం, ఊట్లపల్లి.
- 6న అశ్వారావుపేట, పేరాయిగూడెం, వినాయకపురం, నారాయణపురం, ఊట్లపల్లి.

# సింగరేణి గుర్తింపు సంఘ ఎన్నికలు ప్రశాంతం

- **మొత్తం ఓట్లు 990, పోలైనవి 937**
- **నమోదు శాతం 94.6**
- **పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే**



**నవతెలంగాణ-సత్తుపల్లి**

సింగరేణిలో గుర్తింపు సంఘ ఎన్నికలు గురువారం సత్తుపల్లి ఓసీల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగాయి. మొత్తం ఓట్లు 990 గాను 937 మంది కార్మికులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో జేవీఆర్ ఓసీలో 613 ఓట్లు ఉండగా 579 మంది ఓటును వినియోగించుకున్నారు. సీహెచ్‌పీలో 137 ఓట్లకు గాను 130 మంది పోలింగ్‌కు హాజరయ్యారు. 53 మంది కార్మికులు పోలింగ్‌కు గైర్హాజరయ్యారు. పోలింగ్ కేంద్రాల ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సత్తుపల్లి సీఐ జిల్లెల్లమూడి మోహన్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కూర్మా యోగేశ్వరరావు, పీవోలు ఎంపీ నరసింహారావు, ఎస్. వెంకటాచారి, ఆర్డీవో అశోకచక్రవర్తి పాల్గొన్నారు.



**పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్**

సింగరేణి ఎన్నికల పోలింగ్ సరళిని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పరిశీలించారు. కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీ నాయకులను కలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, ఉడతనేని అప్పారావు, కొలపనేని ధనుంజయరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు నరుకుళ్ల అప్పారావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు గ్రామసభలు

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు నేటి నుండి ఈనెల 6వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రేసు లక్ష్మి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో తెలంగాణ ప్రభుత్వం, ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తీసుకు వెళ్లేందుకు ప్రభుత్వం ఆరు హామీలను నెరవేర్చేందుకు గాను నేటి నుండి 06.01,2024 వరకు గ్రామ సభలు నిర్వహించేందుకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ సభల నిర్వహణకు గాను దుమ్ముగూడెం మండలంలో 6 గురు అధికారుల టీం లీడర్లుగా (6) టీం లను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జడ్పిటిసి తెల్లం సీతమ్మ, తాసిల్దార్ పి చంద్రశేఖర్, ఎంపీడీవో ముత్యాలరావు, సిఐ దోమల రమేష్, వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో చిట్ ఫండ్ కేసులను పరిష్కరించండి

**నవతెలంగాణ-ఖమ్మం లీగల్**

డిసెంబర్ 30న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో చిట్ ఫండ్ కంపెనీ వారు దాఖలు చేసిన చెక్కు కేసులు, రుణ వసూలు కేసులను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బిఎస్ జగ్జీవన్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం న్యాయమూర్తి చిట్ ఫండ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ లో కేసు పరిష్కారం కావడం వల్ల కంపెనీ వారికి వెంటనే డబ్బులు వచ్చే అవకాశం ఉంటుందని అదే సమయంలో కక్షిదారులకు కూడా రిబేటు లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, చిట్ ఫండ్ కంపెనీ ప్రతినిధులు, న్యాయవాది కె.చంద్రశేఖర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## మహా అన్నదానం

**మధిర :** మధిర పట్టణంలోని18వార్డు లడక్ బజార్‌లో గల స్వామి అయ్యప్ప దేవాలయంలో బుధవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక సంఖ్యలో మాల ధర స్వాములు, భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు బత్తుల శ్రీనివాసరావు, వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువులతోనే రైతులకు సిరిసంపదలు

- **కన్నుల పండగగా ఆరో వార్షికోత్సవ వేడుకలు**
- **రైతుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ప్రథమ లక్ష్యం**
- **ఉత్తమ రైతులకు ఘన సత్కారం**

**నవతెలంగాణ-కామేపల్లి**

సేంద్రియ ఎరువులతోనే రైతులకు సిరీ సంపదలు వస్తాయని మారుతి అగ్రో అండ్ ఫెర్టిలైజర్స్ టెక్నాలజీస్ - అన్నదాత సంస్థ ఛైర్మెన్ అడ్డగుల్ల సత్యనారాయణ అన్నారు. ముచ్చర్లలో అన్నదాత మారుతి అగ్రిటెక్ సంస్థ ఆరోవ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఛైర్మెన్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వాడకం వల్ల భూమిలో సూక్ష్మ జీవులు చనిపోయి రైతులు పండిస్తున్న పంటలకు అనేక రకాల వైరస్‌లు వ్యాప్తి చెంది పంటలు దిగుబడి రాక అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి వెన్నుముకైనా రైతు దేశ సంపద సృష్టిలో ప్రథమ స్థానంలో ఉన్నప్పటికీ ఆర్థికంగా అభివృద్ధి చెందడం లేదన్నారు. రైతుల ప్రయోజనమే లక్ష్యంగా అన్నదాత సంస్థ సేంద్రియ ఎరువులను తయారు చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఎంతో మంది రైతుల ఆర్థిక అభివృద్ధిలో భాగస్వామ్యం వహించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఉత్తమ దిగుబడులు సాధించిన రైతులు రాయల రాజేష్, బానోత్ శీను, బత్తుల నారాయణను పూలమాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సంస్థ నూతన సంవత్సర డైరీలు క్యాలెండర్లను ఆవిష్కరించారు. బయ్యారం వైస్ ఎంపీపీ తాత గణేష్, సంస్థ బ్రాంచ్ మేనేజర్ తమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఏబీఎం. రాంబాబు, సుమంత్, వీరభద్రం, గోపి, నాగబాబు, ఉపేందర్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన గ్రామసభలను విజయవంతం చేయండి



**నవతెలంగాణ-కల్లూరు**

కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో నేట ి నుండి జనవరి 6 వరకు ప్రజాపాలన గ్రామసభల ద్వారా దరఖాస్తు స్వీకరిస్తారని ఆర్డీవో అశోక్ చక్రవర్తి తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం నిరుపేద ప్రజలకు ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలు అందజేయడం కోసం ప్రజల నుండి దరఖాస్తు కోరుతున్నట్టు తెలిపారు. ప్రజా పాలన పేరుతో రెవెన్యూ డివిజన్ పరిధిలోని వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు, మండలాలలో గ్రామపంచాయతీల ఆవరణలలో సంక్షేమ పథకాలు అమలుకు ప్రత్యేక ప్రణాళికలతో ప్రజల వద్దకు ప్రజాపాలన సభలు జరుగుతాయన్నారు. ఈ మేరకు మండల స్థాయి డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు కోసం ప్రజా పాలన గ్రామసభల్లో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కాస్తులన్నీ ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచితంగానే ఇవ్వబడతాయని డిఎల్ పిఓ ప్రభాకర్, మండల ప్రత్యేక అధికారి కే.సునీత కోరారు. స్థానిక రైతు వేదికలు బుధవారం ప్రజా పాలన గ్రామసభలపై సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీటీసీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

**వేంసూరు :** గ్రామాలలో లబ్ధిదారులఇంటికి అభయ హస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తులు పంపించటం



జరుగుతుందని ఆర్డీవో అశోక్ చక్రవర్తి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక నందు అధికారులు ప్రజాప్రతినిధులతో ఆరు గారంటీల పథకాలపై ఈ నెల 28 నుండి 6 వరకు జరగనున్న గ్రామసభల నిర్వహణపై సమావేశం నిర్వహించారు సమావేశంలో ఆర్డీవో అశోక చక్రవర్తి మాట్లాడారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి హుస్సేన్ నాయక్, ఎంపీడీవో జి.రమేష్, తాసిల్దార్ ఎంఎ రాజు, ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


**కొణిజర్ల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు సంబంధించిన అప్లికేషన్‌లు ఉచితంగా అధికారులు ద్వారా ప్రజలకు నేరుగా ఇళ్లకు వెళ్లి అందజేస్తామని మండల స్పెషల్ అధికారి టి. సుమ అన్నారు. ప్రజాపాలన పై బుధవారం మండల అధికారులతో సమీక్ష సమావేశంమండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం ఆరు గ్యారెంటీల అప్లికేషన్‌లను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జె.శంకర్‌రావు, ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**మధిర :** ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మధిర మున్సిపల్ ఛైర్ పర్సన్ మొండితోక లత కోరారు. బుధవారం మధిర మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధిర పట్టణంలో రేపటి నుండి జనవరి 6 వరకు వార్డు సభలో నిర్వహించి మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, చేయూత ఐదు గ్యారెంటీ పథకాలకి సంబంధించి అర్హులైన పేదల నుండి ఒకే దరఖాస్తు ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమములో కమీషనర్ రమాదేవి, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

**కారేపల్లి :** ప్రజాపాలన అభయహస్తం పథకాలకు ప్రభుత్వమే దరఖాస్తులు సరఫరా చేస్తుందని, జిరాక్స్‌లు చెల్లవని డీఆర్‌డీవో విద్యాచందన, కారేపల్లి ఎంపీడీవో ఎం. చంద్రశేఖర్‌లు అన్నారు. బుధవారం కారేపల్లి మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల పంపిణి అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దరఖాస్తుకు ధృవీకరణ అనవసరం లేదన్నారు. వీరి వెంట స్పెషల్ ఆఫీసర్ అజయ్‌కుమార్, ఎంపీవో సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**నేలకొండపల్లి :** నేటి నుండి జనవరి 6 వరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో జరగనున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ కొండపల్లి శ్రీరామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణంలోని రైతు వేదికలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ ఛైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య ఎంపీడీవో కే జమలారెడ్డి, జి అనురాధ భాయ్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## నేటి నుండే గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరణ

**పినపాక :** ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నేటి నుండి ప్రజా పాలన కార్యక్రమాలు కొనసాగుతాయని ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ వీర భద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో ప్రజా పాలన సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలంలో నాలుగు టీములుగా దరఖాస్తులు తీసుకుంటారని తెలియజేశారు. ఎంపీడీవో టీం, ఎంపీఓ టీం, తహసీల్దార్ టీమ్, అగ్రికల్చర్ ఆఫీసర్ టీం ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్‌గా ఈఈ రాంప్రసాద్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ గా డిఆర్డిఏ డిడి మధుసూదన్‌రావు పర్యవేక్షణ చేస్తారు. ప్రజాపాలన దరఖాస్తు నమూనాను విడుదల చేశారు. నేటి నుండి జరుగు గ్రామ సభలలో దరఖాస్తు ఫారములు ప్రజల ద్వారా ప్రత్యేక కౌంటర్లను జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేసి స్వీకరిస్తామని తెలిపారు. ఎంపీపీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ నెంబర్, సర్పంచులు, అధికారులు, టీం లీడర్లు పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తామని ఈ సదవకాశాన్ని ప్రజలు వినియోగించుటకు ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు.

## ఆరు గ్యారంటీల
# అమలు కోసమే ప్రణాళిక

- అంతిమ లబ్దిదారులు ప్రజలే
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రజా పాలనపై సమావేశంలో.. మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు




నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఆరు గ్యారంటీల అమలు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికను రూపొందించిందని మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సముదాయ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో ప్రజాపాలన, ఆరుగ్యారంటీల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగమంతా సమాయాత్తం కావాలని ఆదేశించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఆరు గ్యారంటీలపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, దరఖాస్తులు తీసుకోవాలని తెలిపారు. పథకాల రూపకల్పన, విధివిధానాలను ప్రభుత్వం రూపొందిస్తే వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. అంతిమ లబ్దిదారులు ప్రజలేనని, అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందినప్పుడే.. సార్థకత చేకూరుతుందని చెప్పారు. యావత్ తెలంగాణ ప్రజలు సంఘటితమై కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని, కాబట్టి వారికి ఇచ్చిన హామీలను అమలుచేసే బాధ్యత తమపై ఉందని, అందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన కారక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి దరఖాస్తు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని, పోలీస్ యంత్రాంగం కూడా ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతానికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# 'ఉపాధి హామీ'కి డిమాండ్

### వచ్చే ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగేనా?

న్యూఢిల్లీ : కరోనా వంటి మహమ్మారి విజృంభించి లాక్‌డౌన్ సమయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పించి బాసటగా నిలిచింది మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ). విపత్కర సమయంలో అనేక రంగాలు ప్రభావితమవుతుండగా కొంతలో కొంత ప్రజలకు ఆర్థికంగా బలాన్ని అందించగలిగింది.

ఇటు కేంద్రం ఈ పథకంలో పలు మార్పులను తీసుకొస్తున్నది. ఉపాధి కార్మికుల హాజరు, చెల్లింపులకు సంబంధించి కొత్త విధానాలను ప్రవేశపెడుతున్నది. ఇలాంటి తరుణంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏకు డిమాండ్ పెరగటంతో రాబోయే కేంద్ర బడ్జెట్ 2024-25 కోసం ఉపాధి హామీ పథకం కింద గణనీయమైన మొత్తాన్ని కేటాయించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

#### బడ్జెట్ కేటాయింపులు

బడ్జెట్ కేటాయింపులు 2019-20లో రూ. 71,002 కోట్ల వాస్తవ వ్యయంతో పోలిస్తే 2020-21లో రూ. 61,500 కోట్లకు పడిపోయాయి. అంటే 13 శాతం తగ్గుదల నమోదైంది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఈ పథకం కింద డిమాండ్ బాగా పెరిగింది. ఈ సంక్షోభ సమయంలో ఈ పథకానికి ఆత్మనిర్భర్ భారత్ ఉద్దీపన ప్యాకేజీ కింద దాని కేటాయింపును రూ.1.11 లక్షల కోట్లకు పెంచారు. 2022-23లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏకు బడ్జెట్ కేటాయింపులు రూ. 89,400 కోట్లకు సవరించిన అంచనాల నుంచి 2023-24కి 33 శాతం తగ్గి రూ. 60,000 కోట్లకు పడిపోవటం గమనార్హం. అయితే, ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 'ఉపాధి హామీ'కి డిమాండ్ పెరిగింది. రుతుపవనాల అనిశ్చితితో పాటు పట్టణ ఉద్యోగాల్లో సంక్షోభం కూడా ఉన్నది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ గ్రామీణ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ.. మోడీ సర్కారుకు ఈ పథకంపై ఎప్పుడూ చిన్న చూపేనని విశ్లేషకులు చెప్తున్నారు. ఇందుకు గత కొన్నేండ్లుగా బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు, పథకంలో సంక్లిష్ట విధానాలు తీసుకురావటం వంటి వాటిని వారు ఉదహరిస్తున్నారు.

ఒకవేళ కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు పెంచినా వచ్చే ఏడాది రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే చేస్తుందని తెలిపారు.

# ఎన్‌ఈపీతో ప్రమాదంలోకి విద్యావ్యవస్థ

- మోడీ సర్కారుపై పోరు
- జనవరి 12న చలో ఢిల్లీ
- ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడు విపి సాను




అల్లూరి సీతారామరాజు నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి

నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ)తో విద్యా వ్యవస్థ ప్రమాదంలో పడిందని ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడు విపి సాను విమర్శించారు. మోడీ సర్కార్ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలన్నీ ఐక్య పోరుకు సిద్ధమయ్యాయని తెలిపారు. బుధవారం నాడిక్కడ ఎస్‌ఎఫ్‌ఐ ఆంధ్రప్రదేశ్ 24వ రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ఆయన నవతెలంగాణకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలను వెల్లడించారు. 2016లోనే తాము నూతన విద్యా విధానంపై హెచ్చరించామనీ, కానీ మోడీ సర్కార్ పట్టించుకోకుండా విద్యారంగాన్ని సర్వనాశనం చేసి ఎన్‌ఈపీని అమలు చేస్తున్నారని విమర్శించారు. 'కొఠారి కమిషన్ తరువాత చాలా ఏండ్లకు విద్యా విధానం తీసుకొచ్చారు. ఆ విద్యా విధానం విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉండాలి. కానీ ఆ రకంగా కాకుండా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉంది. డ్రాఫ్టు వంటి కీలకమైన అంశాలపై ఎస్‌ఎఫ్‌ఐ సలహాలిచ్చింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలూ కొన్ని సలహాలనిచ్చాయి. కానీ వాటిని మోడీ ప్రభుత్వం పెడచెవినపెట్టింది. డ్రాఫ్టు వంటి కీలకమైన అంశాలపై ఎన్‌ఈపీలో ఎటువంటి పరిష్కారం చూపలేదు. రాజ్యాంగంలోని కీలకమైన ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, లౌకికవాదం, సామ్యవాదం వంటి లక్ష్యాలపై ఎన్‌ఈపీ మౌనంగా ఉంది. కరోనా కాలంలో కేంద్ర మంత్రి వర్గం ఆమోదంతోనే ఎన్‌ఈపీని అమలులోకి తెచ్చారు. కనీసం పార్లమెంట్‌లో కూడా చర్చించలేదు' అని వివరించారు.

#### ఇండియాను ఎందుకు మార్చాలి?

'మోడీ సర్కార్ అమలు చేస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మరింత వేగవంతం చేస్తున్నది. ఇండియా స్థానంలో భారత్‌ను ప్రయోగిస్తుంది. భారత్‌కు మేం వ్యతిరేకం కాదు. కానీ ఉన్న ఇండియాను ఎందుకు మార్చాలి. వాళ్ల (కేంద్ర ప్రభుత్వం) ఇండియాను తీసేసే ప్రయత్నం చేస్తున్నారు. మహాత్మా గాంధీని గాడ్సే హత్య చేశారనేదాన్ని పూర్తిగా పుస్తకాల నుంచి తొలగించారు. మొఘల్స్, అబ్దుల్ కలాం అజాద్, అశోకుడు, అక్బర్ వంటి వారి చరిత్రలు తొలగించారు. ఇలాంటివి అనేకం ఉన్నాయి' అని తెలిపారు.

#### నాణ్యమైన విద్యా కొరత

'దేశంలో నాణ్యమైన విద్యా కొరత ఉంది. ప్రపంచంలోని మొదటి 50 యూనివర్సిటీల్లో మన దేశ యూనివర్సిటీలు ఒక్కటీ లేదు. ఇతర దేశాల్లోని విద్యా సంస్థల్లో నాణ్యత ఏడాదికేడాదికీ పెరుగుతున్నది. మన దేశంలోని విద్యా సంస్థల్లో నాణ్యత దిగజారుతున్నది.

అలాగే మన దేశం నుంచి ఇతర దేశాలకు చదువు నిమిత్తం వలస వెళ్లే విద్యార్థుల సంఖ్యా పెరుగుతున్నది. అమెరికా ఒక్క దేశానికే 96,970 మంది విద్యార్థులు వెళ్లారు. మోడీ మోడల్‌గా చెప్పుకుంటున్న గుజరాత్ నుంచే ఎక్కువ మంది ఇతర దేశాలకు వెళ్తున్నారు. చదువు, ఉపాధి నిమిత్తం 60 లక్షల మంది ప్రజలు మన దేశ సిటిజన్ షిప్‌ను వదులు కున్నారు" అని తెలిపారు.

#### స్కాలర్‌షిప్స్, ఫెలోషిప్స్ కోత

'మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత పేద, దళిత, గిరిజన, మైనార్టీ విద్యార్థులకు ఇచ్చే ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు కోత విధించింది. కొన్ని ఫెలోషిప్‌లు పూర్తిగా తొలగించారు. దీనివల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే ప్రవేశపరీక్షలు, ఫెలోషిప్‌లకు అర్హత పరీక్షలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పరిధిలోకి వచ్చిన తరువాత ప్రాంతీయ భాషలను తొలగించారు. కేవలం హిందీ, ఇంగ్లీష్ భాషల్లోనే పరీక్షలు జరుగుతున్నాయి. దీంతో వెనుకబడి, గ్రామీణ, గిరిజన, దళిత విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. విద్యా సంస్థల్లో ఖాళీలు నాణ్యమైన విద్యకు ఆటంకంగా ఉన్నాయి. ఈ సమస్యలన్నింటిపై జనవరి 12న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నాం. అన్ని విద్యార్థి సంఘాలన్నీ ఒకే వేదికపైకి వచ్చి పోరాటం చేస్తున్నాం' అని తెలిపారు.

### ఉత్తేజభరితంగా ప్రారంభమైన ఎస్‌ఎఫ్‌ఐ 24వ మహాసభ



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ) విద్వేషాన్ని నింపే విధంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రమణ్యం ధ్వజమెత్తారు. సమాన, నాణ్యమైన విద్యను అందించడంలో ఎన్‌ఈపీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎస్‌ఎఫ్‌ఐ 24వ రాష్ట్ర మహాసభలు అల్లూరి సీతారామరాజు నగర్, ధీరార్ రాజేంద్రన్ ప్రాంగణం (అంబేద్కర్ భవన్)లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రారంభసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడారు. 145 కోట్ల ప్రజలున్న చైనాలో పేదలు లేరని, 35 కోట్ల ఉన్న అమెరికాలో పేదల సంఖ్య ఏడాదికి ఏడాది పెరుగుతుందని అన్నారు. సంపద పెరగడం ముఖ్యం కాదని, పెరిగిన సంపద పంపిణీ చేయడం ముఖ్యమన్నారు.

ఎయిడెడ్ విద్యా వ్యవస్థ నిర్వీర్యం

రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని, ఉన్న కాలేజీలను మూసివేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ పోరాడుతుందని, దాన్ని కొనసాగించాలని సూచించారు. ఏడాదిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారి సంఖ్య 3.56 లక్షల మంది తగ్గిపోయారని తెలిపారు. రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టిన తరువాత, పిల్లల చదువులు దెబ్బతిన్నాయని అంతర్జాతీయ సంస్థలు చెబుతున్నాయని ఉటంకించారు.

#### కేరళలో ప్రత్యామ్నాయ విద్యా విధానం

కేరళలో ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని అక్కడి వామపక్ష ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ క్లాస్ రూమ్‌లు, పూర్తి స్థాయి ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు వంటి ఉన్నాయని, కాలేజీల్లోనూ, యూనివర్శిటీల్లోనూ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. అలాంటి రాజకీయ వ్యవస్థ కావాలని, అందుకోసం పోరాటం చేయాలని అన్నారు.

కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఎన్‌ఈపి వ్యతిరేకించాయి. దేశంలో ప్రశ్నిస్తే వారిపై దాడులు చేయడం, జైల్లో పెట్టడం ప్రభుత్వానికి పరిపాటిగా ఉందని విమర్శించారు. ప్రశ్నించే గొంతెలను నొక్కే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపు ఇచ్చారు.

### నేటీ నుంచి ఐలు 14వ అఖిల భారత మహాసభ

- హౌరాలో మూడు రోజుల పాటు ...

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

అఖిల భారత న్యాయవాద సంఘం (ఐలు) 14వ అఖిల భారత మహాసభ నేడు ప్రారంభం కానుంది. నేటీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, న్యాయం, సామ్యవాదం లక్ష్యంతో దేశవ్యాప్తంగా 50,000కు పైగా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, న్యాయ అధ్యాపకుల సభ్యత్వం కలిగిన ఐలు 14వ అఖిల భారత మహాసభ పశ్చిమ బెంగాల్‌లోని హౌరా నగరంలో ప్రారంభమవుతున్నాయి. మతోన్మాదంపై పోరాటం, 'సేవ్ రాజ్యాంగం, సేవ్ ప్రజాస్వామ్యం' నినాదంతో ఈ మహాసభలు జరుగుతున్నాయి. అశోక్ బికాష్ మంచ్, నారా నారాయన్ గుప్తా నగర్‌లో మహాసభ జరగనుంది. ఈ మహాసభల ప్రారంభానికి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దీపక్ గుప్తా, ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్. మురళీధర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అశోక్ కుమార్ గంగూలీ పాల్గొంటారు. దేశంలో ప్రజాస్వామ్యం, సోషలిజం, చట్టబద్ధమైన పాలన, ఒకే నేషన్-ఒకే ఎలక్షన్ వంటి అనేక అంశాల మీద, రాజ్యాంగపరమైన అంశాలమీద చర్చించనున్నారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణ కోసం, న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ మహాసభలో చర్చించనున్నారు. ఐలు కొత్త కమిటీని ఈ మహాసభలో ఎన్నుకోనున్నారు. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 600 మంది న్యాయవాదులు ప్రతినిధులుగా ఈ మహాసభలో పాల్గొననున్నారు. న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, న్యాయ ఆధ్యాపకుల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కూలంకషంగా ఈ మహాసభలో చర్చించనున్నారు. ఈ మహాసభని జయప్రదం చేయాలని అఖిల భారత న్యాయవాద సంఘం కార్యదర్శి నర్రా శ్రీనివాస రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ మాధవరావు ఒక ప్రకటనలో కోరారు.

### బెల్టుషాపులను ఎత్తేయాలి

- పీవైఎల్ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బెల్టుషాపులను ఎత్తేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీవైఎల్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. అనంతరం పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ ప్రదీప్, కార్యదర్శి వాంకుడోత్ అజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్టుషాపులను రద్దు చేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. బెల్టుషాపులతో యువత మద్యం మత్తులో మునిగిపోతున్నదని తెలిపారు. దీంతో నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలో తెలంగాణను మద్యం మత్తులో మునిగేలా చేసిందని పేర్కొన్నారు. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా అర్ధరాత్రి వరకు మద్యం షాపులు తెరిచి ఉంచడం సరైంది కాదని తెలిపారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.

### బీఎండబ్ల్యూ కారులో ఒక్కసారిగా మంటలు

బంజారా హిల్స్ : రన్నింగ్‌లో ఉన్న ఓ బీఎండబ్ల్యూ కారులో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడిన ఘటన హైదరాబాద్‌లోని సచివాలయం వెనుక ఉన్న మింట్ కాంపౌండ్ వద్ద చోటుచేసుకుంది. అయితే డ్రైవర్ వెంటనే కారు దిగడంతో ప్రాణ నష్టం తప్పింది. వాహనాదారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మింట్ కాంపౌండ్ వద్ద రన్నింగ్‌లో ఉన్న బీఎండబ్ల్యూ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే కారు నిలిపివేసి బయటకు వచ్చేశాడు. నిమిషాల వ్యవధిలో కారు మొత్తం మంటలు వ్యాపించాయి. జీహెచ్‌ఎంసీ వాటర్ ట్యాంకర్, అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందుకుని అక్కడికి చేరుకునే లోపే వాహనం దగ్ధమైపోయింది. ఖైరతాబాద్ పోలీసులు మింట్ కాంపౌండ్ వద్దకు చేరుకుని కాలిపోయిన కారును పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని కారులో మంటలు రావడానికి గల కారణాలేంటి అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు అమిత్‌షా రాక

- పార్లమెంట్ ఎన్నికలపై శ్రేణులకు దిశానిర్దేశం : ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ : జి. ప్రేమేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మండలాధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర నాయకులతో బీజేపీ రాష్ట్రస్థాయి సమావేశాన్ని గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కొంగర కలాన్‌లో గల శోక్ల కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్టు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారని పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర ఇన్‌చార్జులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్, సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్, శాసనసభ ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీ ప్రకాశ్ జవదేకర్, తదితర నేతలు పాల్గొంటారని తెలిపారు. గురువారం ఉదయం అమిత్‌షా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరకుంటారనీ, అక్కడ నుంచి చార్మినార్ వద్దనున్న భాగ్యలక్ష్మి దేవాలయాన్ని సందర్శించుకుంటారని పేర్కొన్నారు. ఆ తర్వాత కొంగరకలాన్‌లోని రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొంటారనీ, అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షించి పార్లమెంట్ ఎన్నికలకు ఎలా సన్నద్ధం కావాలనే దానిపై దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. వికాసిత్ భారత్(సంకల్ప యాత్ర), అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ట(అయోధ్య సందర్శన) తదితర అంశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ శాసనసభ్యులతో సమావేశమవుతారని తెలిపారు.

### టీజీవో కార్యవర్గం 31కి వాయిదా

ప్రజాపాలన ప్రారంభం నేపథ్యంలో నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాపాలన ప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం నిర్వహించతలపెట్టిన టీజీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 31కి వాయిదా వేస్తున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. ఆ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇందులో ఉద్యోగులు, అధికారులు బాధ్యతాయుతంగా పాల్గొనాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు అండగా నిలవాలని సూచించారు. ఈనెల 31న టీజీవో కార్యవర్గ సమావేశంలో కొన్ని కీలకమైన నిర్ణయాలపై తీర్మానం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, వారి ప్రతినిధులు, కేంద్ర కార్యవర్గ సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

# గడ్డపోతారంలో 'భూ గందరగోళం'

- 9ఎకరాల భూమిని టీఎస్‌ఐఐసీకి కేటాయించారని..
- భూముల స్వాధీనం కోసం అధికారుల రాక
- అడ్డుకున్న సంబంధిత సర్వే నెంబర్ బాధితులు
- తీవ్ర వాగ్వివాదం, పోలీసుల పహారాలో భూముల స్వాధీనం



నవతెలంగాణ-జిన్నారం

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 27లో భూమికి సంబంధించి టీఎస్‌ఐఐసీ, రెవెన్యూ అధికారులు, స్థానికులకు మధ్య బుధవారం తీవ్ర వాగ్వివాదం నెలకొన్నది. సదరు సర్వేనెంబర్‌లో 9 ఎకరాల భూమిని టీఎస్‌ఐఐసీకి కేటాయించారంటూ.. భూ స్వాధీనం కోసం సంబంధిత అధికారులు బుధవారం గ్రామానికి వచ్చారు. అయితే తమకు కేటాయించిన భూమిని పరిశ్రమల పేరిట తిరిగి వేరే సంస్థలకు ఎలా కేటాయిస్తారని సంబంధిత సర్వేనెంబర్ బాధితులు అధికారులను అడ్డుకున్నారు. కొన్నేండ్ల క్రితమే తమకు కేటాయించిన భూములను వేరొకరి ఎలా అప్పగిస్తారంటూ ప్రశ్నించారు. కాగా, టీఎస్‌ఐఐసీ అధికారులతో పాటు అక్కడి వచ్చిన పటాన్‌చెరు డీఎస్పీ బాలాజీ నాయక్, బొల్లారం సీఐ ముద్దీన్, ఎస్‌ఐలు, పోలీసులు సదరు భూముల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి భూములను స్వాధీనపరుచుకున్నారు. ఓ పక్క బాధితులు నిరసన తెలుపుతుండగా వారిని సముదాయిస్తూనే.. మరో పక్క సంబంధిత భూమిని స్వాధీనం చేసుకుని టీఎస్‌ఐఐసీ బోర్డులు నెలకొల్పారు. ఈ ఘటనపై జిన్నారం తహసీల్దార్ రవికుమార్ వివరణ కోరాగా.. సర్వేనెంబర్ 27కు సంబంధించి మొత్తం దాదాపు 65 ఎకరాలు ఉండగా.. మూడు దశాబ్దాల కిందట 59 ఎకరాలను కొంతమంది పేదలకు ప్రభుత్వం అసైన్ చేసిందని తెలిపారు. అయితే ఈ భూముల్లో కొంతమంది ఇటుక బట్టీలు, ఇతరత్రా వ్యాపార సంబంధిత వ్యవహారాలు కొనసాగిస్తున్నారన్నారు. దాంతో 2017లోనే ఈ 27 సర్వేనెంబర్ భూమిలో 9 ఎకరాలను టీఎస్‌ఐఐసీకి అప్పగించడం జరిగిందని చెప్పారు. సదరు భూమినే బుధవారం స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొత్త ఏడాది వస్తుందనగానే ప్రతి ఒక్కరిలోనూ కచ్చితంగా ఎంతో కొంత ఎగ్జైట్ మెంట్ అనేది కనబడుతూ ఉంటుంది. న్యూ ఇయర్ సందర్భంగా మనలో చాలా మంది డిసెంబర్ 31వ తేదీన అర్థరాత్రి కరెక్టుగా పన్నెండు గంటల సమయంలో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకుంటూ ఉంటారు. ఈ సమయంలో బేకరీలలో దొరికే కేకులకు మంచి డిమాండ్ ఉంటుంది. అయితే ఇంట్లోనే చాలా ఈజీగా అది కూడా అతి తక్కువ ఖర్చుతో న్యూ ఇయర్ కేకులని తయారు చేసుకోవచ్చు. అవేంటో చూద్దాం...

# కేక్స్‌తో ఖుషీగా





## ఆరెంజ్ కేక్

**కావల్సిన పదార్థాలు :** వెన్న - అరకప్పు, చక్కెర - ఒకటిన్నర కప్పు, గుడ్లు - ఆరు, ఆరెంజ్ - రెండు (తొక్కతీసి కట్ చేసిన పళ్లు), కేక్ పౌడర్ - నాలుగు కప్పులు, అల్యూమినియం పేపర్ - చిన్నది, పాలు - పావు కప్పు, చక్కెర పొడి - ఒక కప్పు, కొబ్బరి తరుగు - ఇష్టం వుంటే.

**తయారు చేసే విధానం :** పదార్థాలన్నీ గది ఉష్ణోగ్రత వద్ద ఉండేలా చూసుకోవాలి. తర్వాత ఒక గిన్నెలో వెన్న వేసుకుని బాగా మిక్స్ చేయాలి. చక్కెర, గుడ్లు కూడా బాగా వేసి కలుపుకోవాలి. అందులో ఆరెంజ్ ముక్కలు కూడా వేసి బాగా కలపాలి. ఇందులో పాలు, పిండి నెమ్మదిగా వేస్తూ కలుపుకోవాలి. మిగిలిన పదార్థాలు కూడా వేసుకుని కలుపుకోవాలి. తర్వాత మిశ్రమాన్ని మరీ మందంగా లేదా మరీ పలుచగా కాకుండా కేక్ పాన్‌లో వేసుకోవాలి. మిశ్రమాన్ని వేసుకునే ముందు దానిపై కొద్దిగా వెజిటేబుల్ ఆయిల్‌ని రాయాలి. దీన్ని ఓవెన్‌లో పెట్టుకోవాలి. 45 నిమిషాల పాటు ఓవెన్‌లో 350 ఫాంన్ హీట్ వద్ద వుంచాలి. ఎంతో రుచిగా వుండే కేక్ రెడీ. దీనిపై క్రీమ్‌తో డెకరేషన్ చేసుకోవాలి. దానిపై చెర్రీస్ అమరిస్తే మరింత బాగుంటుంది.

## చాక్లెట్ కాష్యూనట్ ట్రఫెల్

**కావల్సిన పదార్థాలు :** జీడిపప్పు పొడి - అరకేజీ (జీడిపప్పుని మిక్సీలో పొడి చేసుకోవాలి), గుడ్లు - తొమ్మిది,



కోకోపొడి - వంద గ్రాములు, బేకింగ్ పౌడర్ - ఐదు గ్రాములు, క్యాస్టర్ షుగర్ - ఐదు వందల గ్రాములు, మైదా - అరకిలో, ట్రఫెల్ కోసం - పావుకిలో ఫ్రెష్ క్రీం, డార్క్ చాక్లెట్ - అరకిలో.

**తయారు చేసే విధానం :** గుడ్లు, క్యాస్టర్ షుగర్ బాగా కలుపుకొని బీటర్ సాయంతో గిలకొట్టాలి. ఇప్పుడు జీడిపప్పు పొడి, కొకొపొడి, మైదా, బేకింగ్ పొడీ కలుపుకుని కోడిగుడ్ల మిశ్రమంలో వేసుకోవాలి. ఇప్పుడు కేకులు తయారు చేసే కేక్ టిన్ తీసుకొని అందులో ఈ మిశ్రమం వేసి ఓవెన్‌లో 150 డిగ్రీల వద్ద ఇరవై నిమిషాల పాటు బేక్ చేయాలి. ఇంకో పాత్ర తీసుకొని అందులో చాక్లెట్, తాజా క్రీం కలుపుకొని చాక్లెట్ కరిగేంత వరకూ వేడి చేసి పక్కన పెట్టుకోవాలి. ఇదే ట్రఫెల్. ఇప్పుడు ముందుగా చేసి పెట్టుకున్న కేక్‌ని గిన్నెలోంచి బయటకు తీసి దానిని మూడు పొరలుగా కత్తిరించుకుని, శాండ్‌విచ్ తరహాలో ఒక్కో పొరకూ ట్రఫెల్ రాయాలి. పై పొరపై మిగిలినదంతా వేసేయాలి. గంట పాటు ఫ్రిజ్‌లో ఉంచిన తర్వాత వడ్డించుకోవచ్చు.

## యాపిల్ కేక్



**కావల్సిన పదార్థాలు :** యాపిల్ ముక్కలు - ఐదు కప్పులు (తొక్కతీసి చిన్న ముక్కలుగా కట్ చేసినవి), చక్కెర - కప్పు, బ్లాక్ రెయిసిన్స్ - కప్పు, డ్రై ఫ్రూట్స్ - కప్పు, పీకాన్స్ - కప్పు, వెజిటేబుల్ ఆయిల్ - పావు కప్పు, వెనీలా - రెండు స్పూన్లు, గుడ్లు - బాగా బీట్ చేసినది ఒకటి, మిక్స్‌డ్ కేక్ ఫ్లోర్ - రెండున్నర కప్పులు, బేకింగ్ సోడా - ఒకటిన్నర కప్పు, దాల్చిన చెక్కడ పొడి - ఒక స్పూను.

**తయారు చేసే విధానం :** ఒక వెడల్పాటి గిన్నె తీసుకుని అందులో యాపిల్ ముక్కలు, చక్కెర, పీకాన్స్, రెయిసిన్స్ అన్నీ వేసుకోవచ్చు. దీన్ని 35-40 నిమిషాల పాటు ఓవెన్‌లో పెట్టాలి. టెంపరేచర్ 350 ఫారన్ హీట్ వుండేలా చూసుకోవాలి. దీన్ని సర్వ్ చేసే ముందు ఫ్రిజ్‌లో పెట్టి కాస్త కూల్‌గా వుండేలా అందించాలి.

## స్వీట్ రైస్ కేక్



**కావల్సిన పదార్థాలు :** బియ్యప్పిండి - వంద గ్రాములు, మైదాపిండి, మొక్కజొన్న పిండి - అర టేబుల్ స్పూన్ చొప్పున, బ్రౌన్ షుగర్ - అరవై గ్రాములు, నీళ్లు - కప్పు(గోరువెచ్చగా చేసుకోవాలి), నూనె - రెండు టేబుల్ స్పూన్లు, గుడ్డు - ఒకటి.

**తయారు చేసే విధానం :** ముందుగా ఒక గిన్నెలో ఒక కప్పు గోరువెచ్చని నీటిలో బ్రౌన్ షుగర్‌ను కరిగించాలి. అందులో బియ్యప్పిండి, మొక్కజొన్న పిండి, మైదాపిండి ఒకదాని తర్వాత ఒకటి జల్లెడ పట్టుకోవాలి. అనంతరం ఉండలు లేకుండా కలుపుకోవాలి. అందులో నూనె జోడించి, హ్యాండ్ హెల్డ్ మిక్సర్‌తో బాగా కలుపుకోవాలి. తర్వాత చిన్న కేక్ కంటైనర్ లోపల కొద్దిగా నూనె రాసి, అందులో ఈ మిశ్రమాన్ని వేసుకోవాలి. అనంతరం 45 నిమిషాల పాటు ఆవిరిపై ఉడికించుకోవాలి. కేక్ చల్లారాక రాత్రంతా ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. అనంతరం నచ్చిన విధంగా కట్ చేసుకుని వాటిని గుడ్డు మిశ్రమంలో ముంచి ఇరువైపులా పాన్‌పై వేయించుకుని సర్వ్ చేసుకోవాలి.

# అక్రోట్స్‌తో ఆరోగ్యం



**డ్రై ఫ్రూట్స్ జాబితాలో అత్యధిక పోషకాలు గలిగిన అక్రోట్ ముందుంటుంది. మెదడు పనితీరును పెంచటానికి ఇదెంతో మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యానికి అక్రోట్ చేసే మేలు గురించి తెలుసుకుందాం.**

- మానసిక ఒత్తిడికి అక్రోట్స్ మంచి ఔషధం. అక్రోట్స్‌లోని 'మెలటోనిన్' సుఖ నిద్రకు, చక్కని జ్ఞాపకశక్తికి దోహదం చేస్తుంది.
- అక్రోట్స్‌లో ఎక్కువగా ఉండే పీచు జీర్ణకోశ సమస్యలను నివారిస్తుంది. ఇందులో లభించే విటమిన్ ఇ చర్మాన్ని తాజాగా ఉంచుతుంది.
- బోలెడన్ని యాంటీ ఆక్సిడెంట్స్ కలిగిన అక్రోట్ రోగనిరోధక శక్తిని పెంచి రోగాలబారిన పడకుండా కాపాడుతుంది.
- అక్రోట్ వినియోగంతో రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. దీనివల్ల హృదయ రోగాలు నివారించబడతాయి.
- దీనిలో విరివిగా లభించే ఫాటీ ఆమ్లాలు, ఫైటో న్యూట్రియంట్స్ క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గిస్తాయి. చికిత్స పొందే రొమ్ము క్యాన్సర్ బాధితులు రోజుకో కప్పు అక్రోట్స్ తినటం వలన క్యాన్సర్ కణాల ఎదుగుదల మందగిస్తుంది.
- అక్రోట్స్‌లోని ఒమేగా-3 ఫాటీ ఆమ్లాలు గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలను ఆరోగ్యంగా ఉంచటమే గాక చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. రక్త పీడనం కూడా అదుపులో ఉండేలా చూస్తాయి. ఈ ఆమ్లాలు గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని కాపాడటంతో బాటు సరైన సమయంలో ప్రసవం అయ్యేలా చేస్తాయి.
- రోజూ అక్రోట్ వాడే వారికి ఊబకాయం, జీవక్రియ లోపాలు, రక్తంలోని మోతాదుకు మించి కొవ్వు చేరటం, అధిక రక్త పోటు వంటి ఇబ్బందుల ముప్పు గణనీయంగా తగ్గుతుంది. రోజూ నాలుగైదు అక్రోట్స్ తినేవారికి పిత్తాశయ రాళ్ళ సమస్య రాదు.

# పనులు సులభమయ్యేలా...



**ఒక్క చిన్న చిట్కా మీ పని తీరునే మార్చేస్తుంది. సమయం వృథా ఉండదు. డబ్బు ఖర్చు లేదు. మరెన్నో లాభాలు ఉన్నాయి. కిచెన్‌లో ఇట్టే పనులు చక్కబెట్టడానికి కొన్ని చిట్కాలు మీ కోసం..**

- నూనెలో పచ్చి మిరపకాయలను వేయించేటప్పుడు మధ్యలోకి చీల్చితే అవి పేలకుండా ఉంటాయి.
- పచ్చిమిరపకాయలు ఎక్కువ కాలం ఫ్రెష్‌గా ఉండాలంటే వాటి తొడిమలను తొలగించి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.
- అన్నం తెల్లగా ఉండాలంటే ఉడికే సమయంలో రెండు చుక్కల నిమ్మరసం వేసుకోవాలి.
- దోశల పిండి ఎక్కువ పులిసిపోతే కాస్త గోధుమ పిండి చేర్చి వేసుకుంటే దోశలు రుచిగా తయారవుతాయి.
- చపాతీ పిండిలో కాసిని పాలు కలిపితే చపాతీలు మృదువుగా వస్తాయి.
- పెరుగు పులిసిపోకుండా ఉండాలంటే ఒక చిన్న పచ్చి కొబ్బరి ముక్క వేసి చూడండి.

## ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ పరీక్షలు!

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. దీంతో మార్చి 14 నుంచి పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు-2024 ప్రారంభమవుతాయి. అదేనెల 26 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం రూపొందించింది. ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి కొన్ని మార్పులు జరిగే అవకాశమున్నది. జనరల్ సైన్స్‌కు సంబంధించి ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు ఒకే పరీక్షను నిర్వహిస్తున్నారు. అంటే ఒకేరోజు రెండు ప్రశ్నాపత్రాలతో పరీక్షలు జరుగుతున్నాయి. ఇది విద్యార్థులకు కొంత ఇబ్బందికరంగా మారిందని విద్యాశాఖ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో విద్యార్థుల సౌకర్యార్థం ఆ రెండు సబ్జెక్టులకు వేర్వేరు పరీక్షలను వేర్వేరు తేదీల్లో నిర్వహించాలని ఎస్సీఈఆర్టీ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో దీనిపైనా స్పష్టమైన నిర్ణయం వెలువడే అవకాశమున్నది. దీంతో పదో తరగతి విద్యార్థులు ఆరు పేపర్లకు ఏడు పరీక్షలను రాయాల్సి ఉంటుంది.

## ఫిబ్రవరి రెండోవారంలో ఎంసెట్ నోటిఫికేషన్!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్‌తోపాటు వివిధ వృత్తివిద్యా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే వివిధ ప్రవేశ పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రవేశ పరీక్షల నిర్వహణ, నోటిఫికేషన్ విడుదల, రాతపరీక్షల తేదీలు వంటి అంశాలపై బుధవారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్కే మహమూద్, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు హాజరయ్యారు. ప్రవేశ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏటా ఎలాంటి పద్ధతులను అనుసరిస్తారో లింబాద్రి వివరించినట్టు తెలిసింది. విశ్వవిద్యాలయాల పాత్ర, ఉన్నత విద్యామండలి సమన్వయం గురించి చెప్పినట్టు సమాచారం. కన్వీనర్ల నియామకం, సెట్స్ కమిటీల ఏర్పాటు, సమావేశాల నిర్వహణ వంటి అంశాలను ముఖ్యకార్యదర్శి దృష్టికి తెచ్చారు. ఫిబ్రవరిలో ఎంసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. మే రెండో వారంలో ఎంసెట్ రాతపరీక్షలను నిర్వహించాలని ప్రాథమికంగా ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) రాతపరీక్షలకు ఇబ్బంది లేకుండా ఎంసెట్ షెడ్యూల్‌ను తయారు చేస్తారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు జేఈఈ మొదటి విడత, ఏప్రిల్ ఒకటి నుంచి 15 వరకు రెండో విడత రాతపరీక్షలు జరుగుతాయని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. అయితే విద్యార్థులు ఎంసెట్‌కు సన్నద్ధం అయ్యేందుకు కొంత సమయం ఇచ్చి రాతపరీక్షలను నిర్వహించే అవకాశమున్నది. అందుకే మే రెండో వారంలో ఎంసెట్ రాతపరీక్షలను నిర్వహించాలని భావిస్తున్నారు. ఐసెట్, ఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పీజీఈసెట్, పీఈసెట్ రాతపరీక్షల తేదీలు, నోటిఫికేషన్లపైనా చర్చించినట్టు తెలిసింది.

## గ్రూప్-2 మరోసారి వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల ఆరు, ఏడు తేదీల్లో నిర్వహించతలపెట్టిన గ్రూప్-2 రాతపరీక్షలు మరోసారి వాయిదా పడ్డాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి అనితా రామచంద్రన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-2 రాతపరీక్షలను ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. తొలుత ఆగస్టు 29,30 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు మొదటిసారి వాయిదా వేసింది. గ్రూప్-2 రాతపరీక్షలను నవంబర్ రెండు, మూడు తేదీల్లో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి రావడం వల్ల మరోసారి గ్రూప్-2 రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం మారడం, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులు రాజీనామా చేయడం వంటి కారణాలతో గ్రూప్-2 రాతపరీక్షలు ముచ్చటగా మూడోసారి వాయిదా పడ్డాయి. దీంతో నిరుద్యోగుల్లో ఉన్న ఆందోళనలకు తెరపడింది.

# ఇక భారత్ బియ్యం!

(మొదటిపేజీ తరువాయి)

ఇంకేమీ రేషన్ దుకాణాలలో దొరకడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పాతిక రూపాయలకే కిలో బియ్యం విక్రయిస్తామని చెప్పడం కేవలం ఎన్నికల ఎత్తుగడేనని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇతర నిత్యావసరాల సరఫరా మాదిరిగానే ఇది కూడా మూడునాళ్ల ముచ్చటే అవుతుందని పెదవి విరుస్తున్నారు.

ప్రస్తుతం కిలో బియ్యం జాతీయ సగటు చిల్లర ధర రూ.43.30కి చేరింది. సంవత్సరం క్రితం నాటి ధరతో పోలిస్తే ఇది 14.1% ఎక్కువని వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చెబుతోంది. పెరుగుతున్న ధరలను, తద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకే సబ్సిడీ ధరతో భారత్ బియ్యాన్ని విక్రయించాలని ప్రభుత్వం యోచిస్తోందని అధికారులు చెబుతున్నారు. దీనిపై మరింత వివరణ కోరుతూ వినియోగ వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖను సంప్రదించినప్పటికీ సమాధానం రాలేదు.

ప్రస్తుతం భారత్ బ్రాండ్‌తో కిలో గోధుమ పిండిని రూ.27.50కి, పచ్చి శనగపప్పును రూ.60కి విక్రయిస్తున్నారు. వీటిని దేశవ్యాప్తంగా 2,000 ఔట్‌లెట్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. భారత్ దాల్, భారత్ అట్టాను ఏ విధంగా విక్రయిస్తున్నారో భారత్ బియ్యాన్ని కూడా అదే విధంగా అమ్ముతామని అధికారులు తెలిపారు. ఇటీవల ఉల్లి ధరలు మళ్లీ పెరగడంతో ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా సబ్సిడీ రేటుకు ఉల్లిగడ్డలను విక్రయించింది. మదర్ డెయిరీకి చెందిన కిరాణా సరకుల విక్రయ విభాగం సఫల్ ద్వారా కూడా ఉల్లి అమ్మకాలు జరిగాయి.

నిత్యావసర ఆహార వస్తువుల ధరలు స్థిరంగా ఉండేలా చూసేందుకు ప్రభుత్వం గత కొన్ని నెలలుగా పలు చర్యలు చేపడుతోంది. బాసుమతి యేతర బియ్యం ఎగుమతులపై జూలైలో నిషేధం విధించింది. ఆగస్టులో బాసుమతి బియ్యం ఎగుమతి ధరను టన్నుకు 1,200 డాలర్లుగా నిర్ణయించింది. ఆ తర్వాత ఆ ధరను 950 డాలర్లకు తగ్గించింది. దేశీయ మార్కెట్‌లో బియ్యం లభ్యతను పెంచేందుకు బహిరంగ మార్కెట్ అమ్మకపు పథకం (ఓఎంఎస్-ఎస్) కింద నాలుగు లక్షల టన్నుల బియ్యాన్ని ఈ-వేలం ద్వారా ఎఫ్‌సీఐ అమ్మకానికి పెట్టింది. కిలో బియ్యం ధరను రూ.29-29.73గా నిర్ణయించింది. తాజా వేలంలో 13,164 టన్నుల బియ్యాన్ని అమ్మింది. ప్రభుత్వం వద్ద ప్రస్తుతం 17.9 మిలియన్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయి.

ఆహారధాన్యాల ధరలు గత నెలలో 10.3% పెరిగాయి. దీంతో ఆహార ద్రవ్యోల్బణం 8.7 శాతానికికి చేరింది. అక్టోబరులో ఇది 6.61 శాతానికిగా ఉంది. మొత్తం వినియోగ ధరల సూచీ (సీపీఐ)లో ఆహార ద్రవ్యోల్బణం దాదాపు సగంగా నమోదైంది. ఈ శీతాకాలంలో వర్షపాతంపై ఎల్‌నినో ప్రతికూల ప్రభావం చూపుతుందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల గోధుమ వంటి కీలక రబీ పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఫలితంగా ఆహారధాన్యాల ద్రవ్యోల్బణం మరింత పెరగవచ్చు.

సబ్సిడీ ధరతో ఆహార ధాన్యాలు అందించినంత మాత్రాన అల్పాదాయ వర్గాల ప్రజలకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదని ఇండియా రేటింగ్ సంస్థ ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్ర పంత్ అభిప్రాయపడ్డారు. ఆహారధాన్యాలు, పప్పులు... ఈ రెండింటికీ ద్రవ్యోల్బణంతో సంబంధం ఉన్నదని ఆయన తెలిపారు. నిషేధం విధించినప్పటికీ గోధుమ ధరలు ఎందుకు పెరుగుతున్నాయో ఆలోచించాలని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి వినియోగ ధరల సూచీ 4 శాతానికి తగ్గవచ్చునని, కానీ ద్రవ్యోల్బణం మాత్రం ఈ ఆర్థిక సంవత్సరంలో సగటున 5.2-5.3 శాతంగా ఉంటుందని ఆయన వివరించారు.

# ఐఎన్‌టీయూసీ ఆధిక్యత

నవతెలంగాణ-కొత్తగూడెం/ సింగరేణి ప్రతినిధి/ నస్పూర్, మందమర్రి

సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల ఫలితాల్లో ఉత్కంఠ నెలకొంది. బుధవారం అర్ధరాత్రి 11 గంటల వరకు అందిన సమాచారం మేరకు మూడు చోట్ల ఐఎన్‌టియూసి గెలిచింది. ఒకచోట ఎఐటియూసి గెలిచింది. మొత్తం 12 ఏరియాల్లో ఎవరికి ఓట్లు వస్తే ఆ యూనియన్ విజయం సాధిస్తోంది. ఇల్లందు, కొత్తగూడెం కార్పొరేట్, హైదరాబాద్ హెడ్ ఆఫీసు ఏరియాల్లో ఐఎన్‌టియూసీ గెలిచింది. బెల్లంపల్లి ఏరియాలో ఎఐటియూసి గెలుపొందింది. తెల్లవారుజాము వరకు కౌంటింగ్ కొనసాగింది. ఫలితాన్ని గురువారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సింగరేణి అధికారులు తెలిపారు.

అనేక ఒడిదుడుకులు ఉత్కంఠ, కోర్టు వాయిదాలు మొట్టికాయల మధ్య ఎట్టకేలకు సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్‌ల్లోని సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాల్లో జరిగిన ఎన్నికల్లో 13 కార్మిక సంఘాల పోటీ పడ్డాయి. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, బీఎంఎస్, టీబీజీకేఎస్ పోటీలో ఉన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు మధ్య పోలింగ్ జరిగింది. బుధవారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, సింగరేణి ఉద్యోగులు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ



ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్మికులు పోటెత్తారు. సాయంత్రం 5గంటల వరకు జరిగిన ఈ ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా 95శాతం పోలింగ్ నమోదైంది. ఆయా సంఘాలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పోలింగ్ కేంద్రాల సమీపంలో కార్మికులు, సంఘాల నాయకులతో సాధారణ ఎన్నికల సందడి వాతావరణం నెలకొంది.

**ఏరియాల వారీగా సరళి..**

ఇల్లందు డివిజన్‌లో 614 మందికిగాను 604ఓట్లు (98.37శాతం), మణుగూరులో 2450 ఓట్లలో 2378 (97.06శాతం), కార్పొరేట్ డివిజన్‌లో 1191ఓట్లలో 1149 (96.47శాతం), కొత్తగూడెం డివిజన్‌లో 2326 ఓట్లలో 2207 మంది.. కార్మికులు తమ ఓటు వేశారు. కరీంనగర్ జిల్లాలోని రామగుండం డివిజన్ వన్ పరిధిలో 5384 ఓట్లకుగాను 5044(93.70శాతం), ఆర్జీ-2లో 3556 ఓట్లలో 3369 (94.74శాతం), ఆర్జీ-3లో 3884 ఓట్లలో 3612 (93.00శాతం) కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భూపాల్‌పల్లి డివిజన్‌లో 5442 ఓట్లలో 5123 (94.13శాతం), బెల్లంపల్లి డివిజన్‌లో 996 ఓట్లలో 959 (96.30 శాతం), మందమర్రి డివిజన్‌లో 4835ఓట్లలో 4515(93.40 శాతం), శ్రీరాంపూర్‌లో 9124 ఓట్లలో 8491 (93.00శాతం) ఓట్లు పోలయ్యాయి. మొత్తం సింగరేణి వ్యాప్తంగా 39805 ఓట్లలో 37,451 (95శాతం) మంది కార్మికులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

**అందిన సమాచారం మేరకు ఫలితాలు**

ఇల్లందు ఐఎన్‌టీయూసీ ఖాతాలో పడింది. ఇల్లెందులో 46 ఓట్ల తేడాతో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేటు ఏరియాలో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. ఐఎన్‌టీయూసీ యూనియన్ 288 ఓట్లతో విజయం సాధించింది. బెల్లంపల్లి ఏరియాలో ఏఐటీయూసీ విజయం సాధించింది. 112 ఓట్ల ఆధిక్యంతో గెలిచింది. హైదరాబాద్ హెడ్ ఆఫీసులో ఐఎన్‌టియూసీకి మెజారిటి ఓట్లు పడ్డాయి. శ్రీరాంపూర్, భూపాలపల్లి, మందమర్రి, రామగుండ ఏరియాల్లో ఓట్లు అధికంగా ఉన్నాయి. ఫలితం వెలువడడానికి ఆలస్యం అవుతుందని అధికారులు వెల్లడించారు.

## ఎంఫిల్‌లో చేరొద్దు

(మొదటిపేజీ తరువాయి)

కోరుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఎంఫిల్ అనేది గుర్తింపు పొందిన డిగ్రీ కాదని పేర్కొన్నారు. ఈ ప్రోగ్రామ్‌ను ఉన్నతవిద్యా సంస్థలు అందించరాదంటూ యూజీసీ నిబంధనలు -2022 రెగ్యులేషన్ నెంబర్ 14 స్పష్టంగా చెబుతోందని అన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఎంఫిల్‌లో ప్రవేశాల ప్రక్రియను నిలిపివేసే చర్యలు చేపట్టాలని యూనివర్సిటీ అధికారులను ఆదేశిస్తున్నట్టు తెలిపింది.

## బీఆర్ఎస్ తాత్సారం చేయలే.. కేంద్రానిదే వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నోసార్లు కలిశారనీ, పదుల సంఖ్యలో లేఖలు రాశారని తెలిపారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాటలు విడ్డూరంగా ఉన్నాయని విమర్శించారు. రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా మారుస్తామని గడ్కరీ ఇచ్చిన హామీని నెరవేర్చలేదని చెప్పారు. పార్లమెంట్‌లో కోట్లాడి ఎయిమ్స్ తెచ్చామన్నారు. జిల్లాకో నవోదయ పాఠశాల ఏర్పాటు, బయ్యారంలో ఉక్కుఫ్యాక్టరీ, ఖాజీపేటలో రైల్వే కోచ్‌ల తయారీ ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, భద్రాచలం-కౌటాల జాతీయ రహదారి, 34 అసెంబ్లీ సీట్ల పెంపు లాంటి అంశాలను కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టు కు జాతీయ హోదా అడిగితే స్పందించలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సమస్యలపై ప్రధాని మోడీకి వివరించి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై వివరించడం సంతోషకరమన్నారు. విభజన హామీల కోసం కొట్లాడాలన్నారు. మీడియా సమావేశంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి షర్మిల..!

(మొదటిపేజీ తరువాయి)

లోకసభ ఎన్నికలకు సన్నద్ధత, అనుసరించాల్సిన వ్యూహాలు, పొత్తులు, చేరికలు, పార్టీ బలోపేతం, ఏపీ ప్రజలకు కాంగ్రెస్ గ్యారెంటీలపై చర్చించారు. ఏపీ కాంగ్రెస్ కార్యక్రమాల రిపోర్ట్‌ను అధిష్టానానికి రుద్రరాజు అందజేశారు. అలాగే ఏపీలో కాంగ్రెస్ విజయానికి రూపొందించిన యాక్షన్ ప్లాన్ నివేదికనూ అందజేశారు. అనంతరం ఏపీ ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్ మీడియాతో మాట్లాడుతూ రానున్న లోకసభ ఎన్నికలపై చర్చించామని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ఏపీలో కాంగ్రెస్‌ను పునర్నిర్మిస్తామని, కాంగ్రెస్ సిద్ధాంతం నమ్మే వారిని స్వాగతిస్తున్నామని అన్నారు. రాబోయే ఏపీ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలలో ఓటు శాతం పెంచుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. వచ్చే వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై చర్చ జరిపామని, తమ పార్టీలోకి తిరిగి వచ్చే వారికి ఆహ్వానమని అన్నారు. జనవరిలో రాష్ట్రంలో మూడు సభలు ఏర్పాటు చేస్తామని, అందులో పాల్గొనేలా మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని ఆహ్వానించామని తెలిపారు. హిందుపురంలో ఖర్గే, విశాఖలో రాహుల్ గాంధీ, అమరావతిలో ప్రియాంక గాంధీ సభలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని అన్నారు.

## ప్రజాపాలనకు నోడల్ అధికారులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌కు కె.నిర్మల, వరంగల్‌కు వాకాటి కరుణ, ఖమ్మంకు రఘునందన్ రావు, మహబూబ్ నగర్‌కు టికె.శ్రీదేవి, కరీంనగర్‌కు శ్రీదేవసేనను నియమించారు. రంగారెడ్డికి ఇ.శ్రీధర్, మెదక్‌కు ఎస్.సంగీత, అదిలాబాద్‌కు ఎం. ప్రశాంతి, నల్గొండకు ఆర్‌వి. కర్నన్, నిజామాబాద్‌కు క్రిష్టినాకు బాధ్యతలు అప్పగించారు. కాగా డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రజాపాలన కింద ధరఖాస్తులు స్వీకరించనున్నారని తెలిసిందే.

## ఇక రైల్వే స్టేషన్లలో మోడీ సెల్ఫీ బూత్‌లు !

### ఏర్పాటుకు ఢిల్లీ రైల్వే బోర్డు తాఖీదులు

### ఇది ప్రజా ధనాన్ని వృథా చేయడమే : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముచ్చటగా మూడోసారి గద్దె ఎక్కాలని ప్రధాని నరేంద్ర మోడీ ఉవ్విళ్లూరుతున్నారు. ఇందులో తప్పేమీ లేదు కానీ అందుకోసం చేస్తున్న ప్రయత్నాలే విమర్శలు, వివాదాలకు దారితీస్తున్నాయి. ఇప్పటికే దేశంలోని అనేక ప్రాంతాలలో వివిధ మంత్రిత్వ శాఖలు మోడీ కటౌట్లతో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా దేశంలోని పలు రైల్వే స్టేషన్లలో కూడా 3డీ సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేయబోతున్నారు. తద్వారా ప్రయాణికులు మోడీ కటౌట్‌తో సెల్ఫీ దిగి సామాజిక మాధ్యమాలలో షేర్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు.

అయితే దీనిపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ సెల్ఫీ పాయింట్ల కారణంగా ప్రజాధనం పెద్ద ఎత్తున వృథా అవుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. 'ప్రచారం కోసం మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు హద్దులు లేకుండా పోతోంది. ఇది పన్ను చెల్లింపుదారుల సొమ్మును వృథా చేయడం తప్పించి మరొకటి కాదు' అని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. తాత్కాలికంగా, శాశ్వతంగా సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేసే స్టేషన్ల జాబితాను ఖర్గే ఆర్‌టీఐ ద్వారా సెంట్రల్ రైల్వే నుండి సంపాదించారు. దాని ప్రతిని కూడా ఆయన 'ఎక్స్'లో జత చేశారు. దీని ప్రకారం కేటగిరీ 'ఏ' స్టేషన్లలో తాత్కాలికంగా సెల్ఫీ బూత్‌లను ఏర్పాటు చేసేందుకు రూ.1.25 లక్షల చొప్పున ఖర్చు చేస్తారు. కేటగిరీ 'సీ' స్టేషన్లలో శాశ్వత ప్రాతిపదికన సెల్ఫీ బూత్‌ల ఏర్పాటుకు రూ.6.25 లక్షల చొప్పున ఖర్చవుతుంది.

స్టేషన్లలో సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేయాల్సిందిగా 19 జోన్లకు చెందిన జనరల్ మేనేజర్లకు ఢిల్లీలోని రైల్వే బోర్డు తాఖీదులు పంపిందని వార్తలు వచ్చాయి. మన్నికైన 3డీ ఆకృతులు, యాక్రిలిక్ బోర్డులు, గ్లాసు, ఇంటిగ్రేటెడ్ లైటింగ్‌తో వీటిని రూపొందిస్తారు. 3డీ ఆకృతులను ఫైబర్, బంకమట్టి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో నిర్మిస్తారు. స్కిల్ ఇండియా, ఉజ్వల యోజన, చంద్రయాన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు ఈ బూత్‌లలో ప్రాచుర్యం కల్పిస్తారు. మంత్రిత్వ శాఖ సాధించిన విజయాలను వివరిస్తూ 822 సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని అక్టోబరులో రక్షణ శాఖ మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సెల్ఫీ పాయింట్లలో విధిగా మోడీ ఫొటోలు ప్రదర్శించాలని నిర్దేశించింది. స్మారక ప్రదేశాలు, మ్యూజియంలు, ప్రజా రవాణా కేంద్రాలు, విమానాశ్రయాలు, మార్కెట్లు, పాఠశాలలు, కళాశాలలు, పర్యాటక ప్రదేశాలలో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించింది.



దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్ సెంచరీకి తోడు బెడింగ్హామ్(56) అర్ధసెంచరీతో రాణించడంతో దక్షిణాఫ్రికా జట్టు తొలి టెస్ట్‌లో ఆధిక్యత సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోర్ 8వికెట్ల నష్టానికి 208పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారతజట్టు 245పరుగులకు ఆలౌటైంది.

# సిరాజ్, బుమ్రా కట్టడి చేస్తేనే..

### దక్షిణాఫ్రికాకు ఆధిక్యత | ఎల్గర్ అజేయ సెంచరీ | దక్షిణాఫ్రికా 256/5

**సెంచూరియన్:** దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్ సెంచరీకి తోడు బెడింగ్హామ్(56) అర్ధసెంచరీతో రాణించడంతో దక్షిణాఫ్రికా జట్టు తొలి టెస్ట్‌లో ఆధిక్యత సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోర్ 8వికెట్ల నష్టానికి 208పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారతజట్టు 245పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ కేఎల్ రాహుల్(101) సెంచరీతో కదం తొక్కాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా జట్టును డీన్ ఎల్గర్ సెంచరీ(135, 23ఫోర్లు)తో ఆదుకున్నాడు. భారత బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్న ఎల్గర్.. శతకంతో చెలరేగడంతో దక్షిణాఫ్రికా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌పై ఆధిక్యతను సంపాదించింది. బెడింగ్హామ్(56) అర్ధసెంచరీతో రాణించాడు. ఠాకూర్ వేసిన 22వ ఓవర్లో బౌండరీ కొట్టి 79బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన ఎల్గర్.. అతడే వేసిన 43వ ఓవర్లో తొలి బంతికి మిడ్ వికెట్ దిశగా ఆడి సెంచరీని పూర్తిచేసుకున్నాడు.

టెస్టులలో అతడికి ఇది 14వ సెంచరీ. ఇక దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో ఆరంభంలోనే ఎయిడెన్ మార్క్రమ్(5) ఔటయ్యాడు. రెండో వికెట్‌కు ఎల్గర్.. టోనీ డి జోర్జి(28) 93పరుగులు జోడించారు. ఈ జోడీని బుమ్రా విడదీశాడు. వరుస ఓవర్లలో బుమ్రా.. జోర్జి, కీగన్ పీటర్సన్(2)ను ఔట్ చేశాడు. బుమ్రా, సిరాజ్ కాస్త ఫర్వాలేదనిపించినా శార్దూల్ ఠాకూర్, ప్రసిధ్ కృష్ణలు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. రెండోరోజైన బుధవారం ఆట నిలిచే సమయానికి దక్షిణాఫ్రికా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 5వికెట్ల నష్టానికి 256పరుగులు చేసింది. దీంతో సఫారీ జట్టుకు భారత్‌పై కేవలం 11 పరుగుల ఆధిక్యత లభించింది. క్రీజ్‌లో ఎల్గర్(140), జెన్సన్(3) ఉన్నారు. బుమ్రా, సిరాజ్‌కు రెండేసి, ప్రసిధ్ కృష్ణకు ఒక వికెట్ దక్కాయి.

**కెఎల్ రాహుల్ సెంచరీ..**

టీమిండియా వికెట్ కీపర్ కెఎల్ రాహుల్ సెంచరీతో కదం తొక్కి ఓ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దక్షిణాఫ్రికాపై వికెట్ కీపర్‌గా సెంచరీ కొట్టి రెండో బ్యాటర్‌గా కెఎల్ రాహుల్ నిలిచాడు. అంతకుముందు రిషబ్ పంత్ సఫారీ జట్టుపై వికెట్ కీపర్ హోదాలో తొలిసారి సెంచరీని కొట్టాడు. గత ఏడాది భారతజట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు రాగా కేప్‌టౌన్‌లో రిషబ్ పంత్ తొలిసారి సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అలాగే సెంచూరియన్‌లో వరుసగా రెండు సెంచరీలు కొట్టిన తొలి బ్యాటర్ కూడా కెఎల్ రాహుల్ మాత్రమే.

**వర్షం అడ్డంకి**

రెండోరోజు ఆట ప్రారంభానికి కూడా వరుణుడు అడ్డు తగిలాడు. వర్షం కారణంగా మైదానం చిత్తడిగా మారడంతో ఆట ఆలస్యమైంది. తొలిరోజు కూడా వెలుతురు లేమి కారణంగా 59 ఓవర్లే మ్యాచ్ జరిగింది. చివరి సెషన్‌లో వర్షం పడడంతో నిర్ణీత సమయం కంటే ముందే ఆట ముగిసిన విషయం తెలిసిందే.

**స్కోర్‌బోర్డు..**

**భారత్ తొలి ఇన్నింగ్స్ : 245**

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** మార్క్రమ్ (సి)రాహుల్ (బి)సిరాజ్ 5, ఎల్గర్ (బ్యాటింగ్) 140, జోర్జి (సి)జైస్వాల్ (బి)బుమ్రా 28, పేటర్సన్ (బి)బుమ్రా 2, బెడింగ్హామ్ (బి)సిరాజ్ 56, వెర్రెయనె (సి)రాహుల్ (బి)ప్రసిధ్ 4, జెన్సన్ (బ్యాటింగ్) 3, అదనం 18, (66ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 256పరుగులు.

**వికెట్ల పతనం:** 1/11, 2/104, 3/113, 4/244, 5/249

**బౌలింగ్:** బుమ్రా 16-3-48-2, సిరాజ్ 15-0-63-2, శార్దూల్ ఠాకూర్ 12-2-57-0, ప్రసిధ్ కృష్ణ 15-2-61-1, అశ్విన్ 8-3-19-0.



### ముగ్గురు సభ్యులతో అడ్‌హక్ కమిటీ

### ఛైర్మన్‌గా భూపీందర్ సింగ్ బజ్వా

### తాత్కాలిక రెజ్లింగ్ కమిటీ నియమించిన భారత ఒలింపిక్ సమాఖ్య

**న్యూఢిల్లీ :** తాత్కాలిక రెజ్లింగ్ బాడీ (అడహక్ కమిటీ)ని భారత ఒలింపిక్ సమాఖ్య (ఐఓసీ) బుధవారం ప్రకటించింది. రెజ్లర్ల ఆందోళనలకు తలొగ్గిన కేంద్రప్రభుత్వం డబ్ల్యూఎఫ్ఐ నూతన ప్యానెల్‌ను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అలాగే డబ్ల్యూఎఫ్ఐ నిర్వహణ వ్యవహారాల కోసం ఒక కమిటీని నియమించాలని కూడా ఐఓసీని కోరింది. దీంతో భూపీందర్ సింగ్ బజ్వా నేతృత్వంలో తాత్కాలిక కమిటీ (అడహక్ కమిటీ)ని ఐఓసీ నియమించింది.ఎంఎం. సౌమ్య, మంజూష కన్వర్‌లు ఈ అడహక్ కమిటీలో సభ్యులుగా కొనసాగుతారని ప్రకటించింది. డబ్ల్యూఎఫ్ఐలో న్యాయమైన, జవాబుదారీతనం, పారదర్శకత్వాన్ని నిర్ధారించడానికి ఈ అడహక్ కమిటీని నియమించినట్టు ఐఓఏ తెలిపింది. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా ఎన్నికైన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఎన్నికలపై రెజ్లర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెజ్లింగ్‌కు సాక్షి మాలిక్ రిటైర్మెంట్ ప్రకటించగా, మరో రెజ్లర్ బజరంగ్‌పూనియా పద్మశ్రీని వెనక్కి ఇచ్చేశారు. బ్రిజ్ భూషణ్ సింగ్ నివాసం నుండే డబ్ల్యూఎఫ్ఐ కార్యాలయం పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఖేల్‌రత్న, అర్జున అవార్డులను వెనక్కి ఇచ్చేస్తున్నట్టు వినేష్ ఫోగట్ ప్రకటించారు.

## బంగ్లా సంచలనం

### తొలి టి20లో న్యూజిలాండ్‌పై గెలుపు



**నైపియర్:** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టి20 బంగ్లాదేశ్ జట్టు సంచలన విజయం నమోదు చేసింది. న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన బంగ్లా జట్టు బుధవారం జరిగిన తొలి టి20లో ఐదు వికెట్ల తేడాతో చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను బంగ్లాదేశ్ బౌలర్లు కట్టడి చేశారు. దీంతో ఆ జట్టు నిర్ణీ 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 134పరుగులు చేసింది. నీషమ్(48)టాప్ స్కోరర్. బంగ్లాదేశ్ బౌలర్లు ఇస్లామ్‌కు మూడు, మెహిదీ హసన్, ముస్తాఫిజుర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం బంగ్లాదేశ్ ఓపెనర్ లింటన్ దాస్(42నాటౌట్), సౌమ్య సర్కార్(22) బ్యాటింగ్‌లో రాణించడంతో 18.4ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 137పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. న్యూజిలాండ్ బౌలర్లు ఇష్ సోధీ, మిల్నే, నీషమ్, బెన్, కెప్టెన్ సాంట్నర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మెహిదీ హసన్‌కు లభించగా.. రెండో టి20 మౌంట్‌ముఘనైయి వేదికగా శుక్రవారం జరగనుంది.

## ఆస్ట్రేలియా 318ఆలౌట్

### పాకిస్తాన్‌తో బాక్సింగ్ డే టెస్ట్



**మెల్‌బోర్న్:** బాక్సింగ్ డే (రెండో)టెస్ట్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్స్ నిరాశపరిచారు. దీంతో ఆస్ట్రేలియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 318పరుగులకు ఆలౌటైంది. తొలిరోజైన మంగళవారం ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 187పరుగులు చేసి పటిష్టంగా ఉన్న ఆసీస్‌ను పాకిస్తాన్ బౌలర్లు కట్టడి చేశారు. అమీర్ జమాల్(3/64)కి తోడు షాహిన్ షా, హంజా, హసన్ అలీ రెండేసి వికెట్లు పడగొట్టారు. దీంతో ఆసీస్ భారీ స్కోర్ చేయడంలో విఫలమైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన పాకిస్తాన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 6వికెట్ల నష్టానికి 194పరుగులు చేసింది. ఓపెనర్ అబ్దుల్లా(62), కెప్టెన్ మసూద్(54) అర్ధసెంచరీలతో మెరిసారు. బుధవారం ఆట నిలిచే సమయానికి వికెట్ కీపర్ రిజ్వాన్(29), అమీర్ జమాల్(2) క్రీజ్‌లో ఉన్నారు. ఆసీస్ కెప్టెన్ కమిన్స్‌కు మూడు, లియాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. తొలిటెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు 360పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై గెలిచి 1-0 ఆధిక్యతలో ఉంది.

# నవచిత్రం



రవితేజ, కావ్య థాపర్

## పక్కా మాస్ ఈగల్

రవితేజ, కార్తీక్ ఘట్టమనేని కాంబినేషన్‌లో ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం నుంచి రెండవ సింగిల్ 'గల్లంతే..' లిరికల్ వీడియోను మేకర్స్ లాంచ్ చేశారు. సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కాలేజీలో గ్రాండ్‌గా జరిగిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ, 'ఈగల్ డిఫరెంట్ మ్యాసీ ఫిలిం. ఎంటర్‌టైమెంట్ అద్భుతంగా ఉంటుంది. మీ అందరికీ తెగ నచ్చుతుంది. నాకు విపరీతంగా నచ్చింది. జనవరి 13న అందరూ థియేటర్స్‌కి వచ్చేయండి' అని అన్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 13న అన్ని దక్షిణ భారతీయ భాషలతోపాటు హిందీలోనూ గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కానుంది.



మహేష్ బాబు

## పండగలాంటి సినిమా

సంక్రాంతి పండగకి ఎన్ని ప్రత్యేకతలు ఉన్నాయో తమ 'గుంటూరు కారం' చిత్రానికి కూడా అన్ని ప్రత్యేకతలు ఉన్నాయని అంటోంది చిత్ర బృందం. మహేష్‌బాబు, త్రివిక్రమ్ కాంబోలో రూపొందుతున్న ఈ సినిమా తుది దశ చిత్రీకరణలో ఉంది. ప్రస్తుతం ఈ సినిమా కోసం ఓ మాస్ సాంగ్‌ని షూట్ చేస్తున్నారు. హారిక అండ్ హాసిని పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలు. మహేష్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టే సినిమా ఉంటుందని, జనవరి 12న థియేటర్లలో హిట్ సందడి చూస్తారని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేశారు.

### హైదరాబాద్‌లో

## నయా షెడ్యూల్ షురూ..



నాని

హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ రెండోసారి కలిసి పని చేస్తున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం 'సరిపోదా శనివారం'.

డివివి ఎంటర్‌టైన్ మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి భారీ కాన్వాస్‌తో నిర్మిస్తున్నారు. గత నెలలో ఈ సినిమా ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుంది. లేటెస్ట్‌గా బుధవారం కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ లెన్తీ షెడ్యూల్‌లో ఇంటెన్స్ యాక్షన్ బ్లాక్‌లతో పాటు ప్రధాన తారాగణంపై కొంత టాకీ పార్ట్‌ని చిత్రీకరించనున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తుండగా, ఎస్ జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

## ఫ్రెష్ మ్యూజిక్‌తో బబుల్‌గమ్



శ్రీ చరణ్ పాకాల

రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. మానస చౌదరి కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈనెల 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల మీడియాతో ముచ్చటించారు.

'ఇప్పటివరకు నేను ఎక్కువగా థ్రిల్లర్స్ చేశాను. 'బబుల్‌గమ్' లాంటి న్యూ ఏజ్ లవ్ స్టోరీ చేయడాన్ని బాగా ఎంజాయ్ చేశాను. ఇందులో హీరో డీజే కాబట్టి దీని కోసం ఎలక్ట్రానిక్ మ్యూజిక్ మ్యూజిక్ ఇచ్చే ఛాన్స్ వచ్చింది. ట్యూన్ కంటే లిరిక్స్ ముఖ్యమని నమ్ముతాను. రవికాంత్ సింగర్ కూడా. ఇందులో ఈజీ పీజీ పాటని తనే రాశాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇందులో ఫ్రెష్ మ్యూజిక్ వింటారు. దర్శకుడు రవికాంత్ నా స్నేహితుడు. తన షార్ట్ ఫిలిమ్స్‌కి, 'క్షణం', 'కృష్ణ అండ్ లీలా' ఇప్పుడు ఈ సినిమాకి మ్యూజిక్ అందించాను. రోషన్ కనకాల డెడికేటెడ్, హంబుల్. మంచి నటుడు, డ్యాన్సర్ కూడా. సినిమా చూశాను. చాలా బాగా నచ్చింది. ఇప్పటివరకూ చూసిన మిగతా వారు కూడా చాలా ఇష్టపడ్డారు. మ్యూజిక్ పరంగా ఇంటర్వెల్ బ్యాంగ్, క్లైమాక్స్, పాటలని చాలా బాగా ఎంజాయ్ చేశారు. సంగీతం విషయంలో నిర్మాతలు చాలా సపోర్ట్ చేశారు. ప్రస్తుతం 'సత్యభామ, 'గూఢచారి 2' చిత్రాలకు సంగీతం అందిస్తున్నాను'.

## రాఘవరెడ్డి రిలీజ్‌కి రెడీ



శివ కంఠమనేని, రాశి

శివ కంఠమనేని హీరోగా రాశి, నందితా శ్వేత ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'రాఘవ రెడ్డి'. స్పేస్ విజన్ నరసింహా రెడ్డి సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్‌పై సంజీవ్ మేగోటి దర్శకత్వంలో కె.ఎస్. శంకర్ రావ్, జి.రాంబాబు యాదవ్, ఆర్.వెంకటేశ్వర్ రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీ జనవరి 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, 'ఇందులో అన్ని రకాల అంశాలు, ఎమోషన్స్ కనిపిస్తున్నాయి. చిన్న చిత్రాల వల్లే ఇండస్ట్రీ బతుకుతోంది' అని తెలిపారు. 'ఇది నాకు నాలుగో చిత్రం. కామెడీ ట్రాక్ కూడా బాగా వచ్చింది. ఇంటర్వెల్ సీన్ అందరికీ నచ్చుతుంది. క్లైమాక్స్ సీన్ ఎమోషనల్‌గా టచ్ అవుతుంది. అందరూ కంటతడి పెడతారు. ఈ సినిమాకి మంచి ప్రశంసలతో పాటు లాభాలు కూడా వస్తాయి' అని శివ కంఠమనేని చెప్పారు. రాశి మాట్లాడుతూ, 'ఇందులో తల్లిగా పోషించిన నా పాత్ర నాకు చాలా కొత్తగా అనిపించింది' అని తెలిపారు. "రాఘవ రెడ్డి' టైటిల్‌తో యాక్షన్, ఫ్యాక్షన్ అసలు ఏ జోనర్ అన్న అనుమానం అందరిలోనూ ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమాను తీశాం' అని దర్శకుడు సంజీవ్ మేగోటి అన్నారు. నిర్మాత శంకర్ రావు, కో ప్రొడ్యూసర్ శ్రీధర్ రెడ్డి, స్పేస్ విజన్ నరసింహా రెడ్డి తదితరులు చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.



ఇంద్రసేన, ప్రజ్ఞ నయన్

## కమర్షియల్ కామెడీ ఎంటర్‌టైనర్

రవి చావలి దర్శకత్వంలో ఎస్.రమేష్ కుమార్ నిర్మించిన చిత్రం 'బద్మాష్ గాళ్ళకి బంపర్ ఆఫర్'. 'శాసనసభ' చిత్రంతో హీరోగా మంచి గుర్తింపు పొందిన ఇంద్రసేన, 'మ్యాడ్' చిత్రంలో నటించిన సంతోష్ హీరోలుగా ప్రజ్ఞ నయన్, నవీన రెడ్డి హీరోయిన్లుగా నటించారు.

డబ్బు కోసం రియల్ ఎస్టేట్ దందా చేసే ఒక వ్యక్తి దగ్గర పని చేసే ఇద్దరు కుర్రాళ్ళు అతన్నే ఎందుకు కిడ్నాప్ చేశారు. ఆ కిడ్నాప్‌లో వారికి తెలిసిన రహస్యాలు ఏమిటి? చివరకు వాళ్ళు అనుకున్న డబ్బు సంపాదించారా లేదా అనే పాయింట్‌ని పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మలయాళ నటి మెర్లిన్ ఫిలిప్, తమిళ నటుడు తారక్, శుభలేఖ సుధాకర్ తదితరులు ప్రత్యేక పాత్రల్లో నటించిన ఈ చిత్రం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగుళూర్, టెక్సాస్, అండమాన్‌లో ఈ నెల 29న రిలీజ్ అవుతుంది అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం : భోలే షవాలి, కెమెరా: విజయ్ సి కుమార్, ఎడిటర్ : మార్తాండ్ కె వెంకటేష్, మాటలు : ఘటికా చలం, ఫైట్స్ : కృష్ణంరాజు, డాన్స్ : హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : శేఖర్ అలవకపాటి, లైన్ ప్రొడ్యూసర్ : తోట శ్రీకాంత్.

## నా కథలో నువ్వున్నావా..?



సత్యం రాజేష్, మేఘా చౌదరి

సత్యం రాజేష్ హీరోగా నటిస్తున్న నూతన చిత్రం 'టెనెంట్'. మేఘా చౌదరి కథానాయిక. వై.యుగంధర్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ పతాకంపై మోగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మించారు. తాజాగా ఈచిత్రం నుంచి సాహిత్య సాగర్ లిరిక్స్‌తో పాటు ట్యూన్ అందించిన మెలోడి సాంగ్ 'నా కథలో నువ్వున్నావా?నీ కథనే నేను అయ్యానా?' అనే లిరికల్ వీడియో పాట విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'భార్యాభర్తల అనురాగాన్ని, అప్యాయతను తెలియజేసే పాట ఇది. ఈ బ్యూటీఫుల్ మెలోడి సాంగ్ అందరికి నచ్చుతుంది. జీవితం అనే వైకుంఠపాళిలో ఎంచుకున్న పాచికల్లాంటి ఆరు ముఖ్యపాత్రలకి మధ్య జరిగే కథే ఈ చిత్రం. ప్రస్తుత అర్బన్‌లైఫ్ స్టయిల్‌ని ప్రతిబింబిస్తూ మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో చెబుతూ, వాళ్లని అలర్ట్ చేసే విధంగా ఈ సినిమా ఉంటుంది' అని తెలిపారు.

## డబుల్ ఇంజన్



శశి, రోహిత్

రోహిత్ - శశి రచన, దర్శకత్వంలో రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'డబుల్ ఇంజన్'.

'పరేషాన్' లాంటి న్యూ ఏజ్ చిత్రాన్ని అందించిన వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌లో సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ చిత్రాన్ని నిర్మించారు. లేటెస్ట్‌గా ఈ చిత్ర ట్రైలర్ విడుదలైంది. డానీ, మౌళి, నర్సింగ్, గోపి.. ఈ నలుగురు స్నేహితులు డబ్బు సంపాదించడానికి 'డబుల్ ఇంజన్' కోసం చేసిన ప్రయత్నాలను చాలా థ్రిల్లింగ్ అడ్వంచరస్ జర్నీగా ప్రజంట్ చేసిందీ ట్రైలర్. ముని, రోహిత్, రాజు, అజిత్, గాయత్రి గుప్తా, సాయి కిరణ్ యాదవ్, పవన్ కృష్ణ తమ సహజమైన నటనతో ఆకట్టుకున్నారు. కథ, కథనానికి తగట్టుగా ఎక్స్‌ట్రార్డినరీ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. టెక్నికల్‌గా ట్రైలర్ బ్రిలియంట్‌గా ఉంది. ట్రైలర్‌ని గ్రిప్పింగ్‌గా ప్రజెంట్ చేశారు. విజువల్స్‌లో రా నెస్ అద్భుతంగా చూపించారు. వివేక్ సాగర్ తన బీజీఎంతో కంటెంట్‌ని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్ళారు. అమెజింగ్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నెరేటీవ్‌ని మరింత లైవ్లీగా చూపించింది. శశాంక్ సినిమాటోగ్రఫీ టాప్ క్లాస్‌లో ఉంది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి. ఈ ట్రైలర్ సినిమాపై చాలా క్యూరియాసిటీని పెంచింది అని చిత్ర యూనిట్ తెలిపింది. జనవరి 5న ఈ సినిమా విడుదల కానుంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886